ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం
**డా॥ యం.రామకృష్ణ**
**డా॥ తుమ్మూరి**
**కందర్ప రామచంద్ర రావు**
**కె.బి.సోమయాజులు**
**జి.సత్యవాణి**
**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 4 సంచిక 10**

**జనవరి 2004**

**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 85**
**3సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**


## సాధకుల వసంతం

సాధకుల వసంతం ఎప్పుడూ విలక్షణంగా ఉంటుంది. వసంత సమీరం తాకగానే, వారి భావనలలో భక్తి ఉప్పొంగుతుంది. వారి ప్రాణాలలో తపో జ్వాలలు ధగధగ లాడతాయి. వారి మనసులను జ్ఞాన తీవ్రత ఆవరిస్తుంది. వసంత పంచమి మహాపర్వం సాధకునికి ఆధ్యాత్మిక జాగరణ సందేశాన్ని అందిస్తుంది. ఈ మహాపర్వంలో ఆవతరించే దైవీ చేతన ఒకే పిలుపు ఇస్తుంది - ఓ సాధకుడా! లే. మేలుకో. జీవన లక్ష్యం తనకు తానుగా వచ్చి నిన్ను వరించేవరకూ కఠోర తపస్సులో నిమగ్నుడవుకా.

వసంత పంచమి ఇచ్చే ఈ దైవీ సందేశాన్ని అందరూ వినలేరు. అందరూ అర్థం చేసుకోలేరు. ప్రాపంచికమైన రాగ ద్వేషాలలో మునిగిఉన్న దీనులకూ, హీనులకూ, దుర్బలచిత్తులకూ ఉద్దేశించబడింది కాదిది. ఇంద్రియాల అభిలాషలకూ, లాలసలకూ తలలు వంచే పిరికిపందలకు ఉద్దేశించబడింది కాదిది. భగవత్ ప్రాప్తి కోసం ఉదయించిన పవిత్ర ఆకాంక్ష అనే దివ్య జ్యోతిని తమ హృదయాలలో నింపుకున్న మహావీరులకే ఈ దైవీ సందేశం ఉద్దేశించబడింది. తన సాధనకు అంకితమైన, నడుం బిగించిన శూర వీర సాధకులకే ఈ సందేశం ఉద్దేశించబడింది.

వసంత పంచమి మహాపర్వ పుణ్యక్షణంలో అవతరించిన ఈ సందేశాన్ని హృదయంలో పదిలపరచుకున్న తర్వాతనే పరమపూజ్య గురుదేవుల జీవన చేతన శిఖరాగ్రంపై ఆరోహించింది. ఆ వసంత పంచమి పుణ్యక్షణాలలో ప్రారంభమైన వారి విలక్షణ సాధనా ప్రక్రియ వారి జీవితంలో ఎన్నడూ మందకొడిగా సాగలేదు. ఎన్నడూ ఆగిపోలేదు. ప్రతి వసంత పంచమి మహాపర్వమూ వారి జీవితాన్ని అపురూపమైన వరాలతో అలంకరించింది. ప్రతి వసంత పంచమీ వారికి లెక్కలేనన్ని ఆధ్యాత్మిక రత్నాలను అందించింది. ఫలితంగా వారి జీవితం ప్రతి క్షణం అలౌకిక జ్యోతులను వెదజల్లుతూ వచ్చింది.

తమ సంతానంలో ఈ ఆధ్యాత్మిక జ్యోతిని వెలిగిస్తానని వారు మాట ఇచ్చారు. అయితే అందుకు వారు కఠోరమైన అనుశాసనాన్ని విధించారు. పాత్రత, పవిత్రత, ప్రామాణికత, అన్నిటినీ మించి సాధకత్వం - ఇవీ ఆ నిబంధనలు. మనం నిజమైన సాధకులం కాగలిగితే - ఈ వసంత పంచమి మహాపర్వంలో ప్రవహించే వసంత సమీరం తన స్పర్శతో మనలనుకూడ ధన్యులను చేస్తుంది. తాము ప్రతి వసంత పంచమి నాడూ పొందినవాటిని అన్నింటినీ మనకు ఇవ్వడంలో గురుదేవులు ఎలాంటి పిసినారితనమూ చూపరు.

H H H

**గృహస్థ ధర్మం పవిత్రం, ఆవశ్యకం, ఉపయోగకరం.**

# విషయ సూచిక

**ముఖ చిత్రం : పరమ పూజ్య గురుదేవులు**
**గురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినం**
**వసంత పంచమి: జనవరి 26**


1. **సంపాదకీయం :**
సాధకుల వసంతం 1
2. **విషయ సూచిక** 2
3. **వేదమంత్రం** 3
4. **ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 1**
భారత్ భాగ్యవిధాత 4
5. **వసంత పంచమి అనుభూతి :**
శిష్యత్వాన్ని సార్థకంచేసిన ఆ వసంత పంచమి 7
6. **బోధ కథ :**
పురందరదాసుగా మారిన శ్రీనివాస నాయక్ 9
7. **సమాజ నిర్మాణం :**
భావవిప్లవ మహోద్యమం : యువతరానికి పిలుపు 12
8. **మాతాజీ దివ్య జీవనం : 3**
ధ్యాన తీవ్రతలో దర్శించిన గతం 14
9. **ఆశ్రమ ధర్మం :**
సగం జీవితం సమాజ సేవకే 17
10. **మన సాంస్కృతిక వారసత్వం :**
రామ రాజ్యానికి రాచబాట ఆస్తికత 19
11. **బోధ కథ :**
కళాకారుని అంతఃకరణ ఒక నిర్మల సరోవరం 21
12. **వ్యక్తి నిర్మాణం :**
కృతజ్ఞత ఒక దైవీ గుణం 24
13. **కుటుంబ నిర్మాణం :**
కుటుంబంలో సత్సంస్కారాల నిర్మాణం 25
14. **బోధ కథ :**
గరుడ గర్వభంగం 27
15. **శతసూత్ర కార్యక్రమం : 11-20**
అజ్ఞాన అంధకారాన్ని అంతంచేద్దాం 28
16. **కృష్ణావతారం - 13 :**
భస్మమైన కాలయవనుడు 30
17. **యుగ గీత :**
పన్నెండు విధముల యజ్ఞాలు 33
18. **వ్యక్తి నిర్మాణం :**
శిష్టాచారాన్ని పాటించడం ఎలా? 34
19. **జీవన పథం**
అందరి హితంలోనే మన హితం 37
20. **వ్యక్తి నిర్మాణం :**
ఆత్మవిశ్వాసం ఒక సంజీవని 41
21. **ఆనంద స్వరూపం :**
భోగం కాదు, త్యాగం 43
20. **నావారితో నా మాట :**
నవ సృజనకు మహాకాలుడు సిద్ధం : మనం సిద్ధమేనా? 45
23. **శాంతికుంజ్ సమాచారం** 47
23. **వార్తలు** 47


## 2004 జనవరిలో పర్వదినాలు

3 ముక్కోటి ఏకాదశి.
12 వివేకానంద జయంతి
15 సంక్రాంతి.
22 సుభాష్ చంద్రబోస్ జయంతి.
26 రిపబ్లిక్ దినోత్సవం, శ్రీ పంచమి,
మార్కండేయ జయంతి.
27 సుబ్రహ్మణ్య షష్టి.
28 రథ సప్తమి.

## ఫిబ్రవరి నెలలో పర్వదినాలు

2 భీష్మ ఏకాదశి.
9 శృంగేరి శారదాంబ రథోత్సవం.
19 మహాశివరాత్రి.
22 రామకృష్ణ పరమహంస జయంతి.

**భగవద్గీత జ్ఞానంలో ఉంది అన్ని సమస్యలకు పరిష్కారం.**

# వేద మంత్రం

**న తా నశంతి న దభాతి తస్కరో నాసామామిత్రో వ్యథిరా దధర్షతి ।**
**దేవాంశ్చ యాభిర్యజతే దదాతి చ జ్యోగిత్తాభిః సచతే గోపతిః సహ ॥**

- ఋగ్వేదం 6/28/3, అథర్వవేదం 4/21/3

**భావార్థం** : ప్రపంచంలో సర్వశ్రేష్ఠదానం జ్ఞానదానం. ఎందుకంటే దొంగలు దీనిని దోచుకోలేరు, ఎవరూ దీనిని నష్టపరచలేరు. ఇది నిరంతరం పెరుగుతూ ఉంటుంది. లక్షలాదిమందికి స్థిరసుఖాన్ని ఇస్తుంది.

**సందేశం** : ప్రపంచంలో వివేకవంతులు ఎంతమంది ఉన్నారో, అవివేకులు అంతకంటే ఎక్కువ మంది ఉన్నారు. పరమాత్మ మనుష్యునికి ఎంత గొప్ప మస్తిష్క మిచ్చాడంటే అది చక్కగా ఆలోచించ గలుగుతుంది, వివేచన చేయగల్గుతుంది. నేటి కంప్యూటర్‌ను అదే రూపొందించింది. అనేకానేక ఆవిష్కరణల ద్వారా సుఖ సౌకర్యాల రాశి పోసింది. ఆగటమనేది దానికి తెలియదు. కానీ జ్ఞాన సదుపయోగమనేది వివేకబుద్ధి కలిగిన ఏ కొద్దిమంది ద్వారానే జరుగుతుంది. ఎక్కువమంది వివేకహీనులు. కొద్దిపాటి వివేకమున్నా శీలంలేక సోమరితనం, అజాగ్రత, దురాలోచనలు, మొండి తనముల వలన పలువురు పూర్తిగా పతనమై ఉన్నారు.

విద్వాంసుల కర్తవ్యమేమంటే అజ్ఞాన అంధకారంలో దారి తప్పి తిరిగే సమాజానికి జ్ఞానప్రకాశంతో సరియైన మార్గాన్ని చూపించటం. ఎవరికైనా డబ్బు, బట్టలు, తినటానికి, త్రాగటానికి సహాయం చేయుట మంచిదే. కానీ దాని ప్రభావం క్షణికం. జ్ఞానదానం సర్వశ్రేష్ఠమైన దానం. దీనివలన మనుష్యునకు సరియైన దారి దొరుకుతుంది, పురుషార్థంతో ఆత్మోన్నతి పొందటానికి ప్రేరణ లభిస్తుంది. ఇది ఎటువంటి స్థిరాస్థి అంటే దాని లాభం మనుష్యుడు జీవిత పర్యంతం పొందుతాడు. పైగా ఈ సంపత్తిలో గుణాత్మక అభివృద్ధి ఉంటుంది.

అన్నింటికంటే మొదటి జ్ఞానం తల్లి ఒడిలో లభిస్తుంది. తల్లి స్నేహం, మమకారం, సౌహార్ద్రముల చేత ప్రాణశక్తి పొందిన బాలుడు ఆమె ఆదేశాన్ని ఎంతో తత్పరతతో ఒప్పుకుంటాడు. తల్లులు తమ కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వర్తిస్తే వారు బాలకుల మనస్సులలో సదాలోచనలు మేల్కొల్పుటతో పాటు సామాజిక దురాచారాలపై విప్లవబీజాన్ని నాటగలరు. దేశానికి కళ్యాణప్రదములైన అభిప్రాయాలు గల విద్వాంసులైన పౌరులను ఇవ్వగలరు. మహర్షి అరవిందులు విద్య పూర్ణత్వానికి ఐదు విషయాలను గట్టిగా చెప్పారు. అవి భౌతిక, ప్రాణిక, మానసిక, అంతరాత్మ సంబంధమైన, ఆధ్యాత్మికమైనవి. విద్యలోని ఈ ఐదు అంశాలు ఒక దానికొకటి పూరకములు. జీవితం అంతిమ కాలం వరకు మనుష్యుని వ్యక్తిత్వానికి పూర్ణత్వాన్ని సమకూరుస్తాయి. బాల్యం నుండి ఈ అయిదింటి పట్ల శ్రద్ధ వహించాలి. ఈ విధమైన జ్ఞానంచేత గుణ సంవర్ధనకు, ఆచారాలు అభిప్రాయాల నియంత్రణకు శాశ్వత వ్యవస్థ ఏర్పాటవుతుంది. మహామానవులయ్యేందుకు మార్గం సుగమం అవుతుంది.

జ్ఞానం వలననే మనుష్యుని వివేకం పెరుగుతుంది. వివేకం పెరిగితే లోపల నిజాయితీ పెరుగుతుంది. నిజాయితీ పెరిగితే మనుష్యునిలో బాధ్యత వస్తుంది. బాధ్యత వస్తే పరాక్రమం వస్తుంది. ఈనాలుగూ ఒక దానికొకటి కలిసిఉన్నాయి. అప్పుడు మనిషిలో శక్తి ఉత్పన్నమై అతడు అవినీతిని వ్యతిరేకించ గలుగుతాడు. దుష్ప్రవృత్తుల, దురాచారాల, దుష్ట సంస్కారాల, దురాలోచనలను సమూలంగా నాశనం చేసేందుకు ప్రాణా లొడ్డేందుకైనా తయారవుతాడు. ఆరోగ్యవంతమైన ఒక సమున్నత సమాజ నిర్మాణంలో నాయకత్వ పాత్ర వహించగలుగుతాడు.

ఎవరు ఇతరులకు విద్వాంసులు, శీలవంతులు, సదాచారులు అయ్యేందుకు జ్ఞానదానం చేస్తారో వారే బ్రాహ్మణులు.

K K K

**ఉత్కృష్టతల పట్ల విశ్వాసాన్ని నిర్మించడం ప్రజాసేవ.**

## ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 1

# భారత్ భాగ్యవిధాత

*జపరమపూజ్య గురుదేవుల జీవిత చరిత్ర "చేతనా కీ శిఖర యాత్రా" అనే శీర్షికతో హిందీలో ఇటీవల వెలువడింది. డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ, జ్యోతిర్మయి ఈ గ్రంథాన్ని రచించారు. విస్తృతమైన పరిశోధన ఫలితంగా రూపొందిన అపురూప గ్రంథం అది. గురుదేవులు స్వయంగా వ్రాయించిన అనుభూతి పొంది రచించిన గ్రంథం అది. గురుదేవుల జీవితంపై ప్రామాణికమైన గ్రంథం అది. ఆ గ్రంథాన్ని "అఖండజ్యోతి" హిందీ మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురిస్తున్నారు. ఆ గ్రంథాన్ని పాఠకులకు ధారావాహికంగా అందిస్తున్నాం. అనువాదకుడు కందర్ప రామచంద్రరావు.*

*- సం॥*

గత శతాబ్దంలో భారతీయ సమాజంలోనే కాక ప్రపంచ చరిత్రలో కూడ ఎంతో సంక్షోభం, లోతయిన పరివర్తన చోటుచేసుకున్నాయి. 1905లో బెంగాలు విభజనకు దేశమంతటిలో తీవ్ర ప్రతిక్రియ చెలరేగింది. తర్వాతి సంవత్సరాలలో జాతీయ చైతన్య జాగరణ జరిగింది. ఫలితంగా 42 సంవత్సరాల తర్వాత దేశానికి స్వరాజ్యం వచ్చింది. బెంగాలు విభజన ఒక స్వల్ప కారణం మాత్రమే. విస్తృత దృక్పథంతో పరిశీలిస్తే - బ్రిటిషు సామ్రాజ్యపు భవిష్యత్తును మార్చివేసే సంఘటన కాదది. ఆరు సంవత్సరాల తర్వాత బెంగాలు విభజన రద్దయింది. అయినా ఆ చిన్న సంఘటన జాతిని మేలుకొలిపింది. జనమానసంలో స్వాతంత్ర్య పిపాస నిరంతరం పెరుగుతూవచ్చింది. బెంగాలు విభజన భారతమాత సంతానంలో లక్షలాది కోట్లాదిమందికి తమను గురించిన అవగాహన కలిగించింది. వారు ఉద్యమిస్తూ వచ్చారు. రౌలట్ చట్టానికి నిరసన, జలియన్‌వాలాబాగ్, సహాయనిరాకరణ ఉద్యమం, సత్యాగ్రహ ఉద్యమం, సైమన్ కమిషన్ బహిష్కరణ, క్విట్ ఇండియా ఉద్యమంవంటి మజిలీలమీదుగా 1947 ఆగస్టు 15 వరకు వివిధ ఉద్యమాలు సాగాయి. ఈ యాత్రలో ఎన్నో ఎగుడు దిగుడులు దాటి జాతి చైతన్యం శిఖరాగ్రాన్ని చేరుకున్నది. ఆ చైతన్య అనుభూతి ప్రతి భారతీయునికీ గర్వ కారణం.

నలభయ్యవ దశకంలో లభించిన స్వరాజ్యం భారతదేశానికేకాక ప్రపంచ సమాజానికీ, మానవాళి అంతకూ క్రొత్త అవకాశాలకు ద్వారాలు తెరిచింది. మన దేశంలో స్వరాజ్య సమరం సాగుతున్న సమయంలో ఇతర దేశాలలోకూడా భారీయెత్తున సంక్షోభాలు ఏర్పడ్డాయి. వాస్తవిక దృష్టితో పరిశీలిస్తే - ఆ సందర్భాలలో మన స్వరాజ్య ప్రాప్తికి ప్రత్యేక ప్రాధాన్యం కనిపించదు. రష్యన్ విప్లవం, చైనాలో రిపబ్లిక్ స్థాపన జరిగి కమ్యూనిస్టు రాజ్యం ఏర్పడడం, ఐర్లండు స్వతంత్రం కావడం, ఇజ్రాయిల్ అవతరణల వంటి మరో అధ్యాయం ఈ ఫలితం, ఈ విజయం, ఈ సంఘటన. చరిత్రలోని వేలాది పుటలలో కొన్ని ప్రత్యేక పుటలు హిమాలయం నుండి సముద్రంవరకు విస్తరించిన భూభాగపు సంఘటనలను తమ లోపల ఇముడ్చుకున్నాయి. వాస్తవానికి - మన స్వరాజ్య ప్రాప్తి మరింత సాధారణమైన సంఘటన. ఆ సాఫల్యం జాతి చూపిన పురుషార్థంతో, పరాక్రమంతో కాక, ప్రపంచ పరిస్థితుల ఒత్తిడివల్ల లభించిందని వాస్తవిక దృష్టితో పరిశీలించే వారికి అనిపిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ నిర్వీర్యం అయిపోయింది. భారత్‌ను పాలించే సామర్థ్యాన్ని అది కోల్పోయింది. భారత్ వంటి వలస దేశాన్ని పాలించే స్థోమత అక్కడి ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితికి లేకపోయింది. తప్పనిసరి పరిస్థితులలో, ఒత్తిళ్లకు లొంగి, విధి లేక బ్రిటన్ భారత్‌కు స్వరాజ్యం ఇచ్చింది. దాని సామర్థ్యం క్షీణించకుండా ఉంటే, దాని పాలకులకు చారిత్రక వివేకం కొరవడి ఉంటే - భారత్ ఆతర్వాత అనేక సంవత్సరాలవరకు, బహుశా నేటివరకు బానిసత్వంలోనే ఉండేది. ఎందుకంటే - ఉద్యమాలు, ప్రదర్శనలు, ధర్నాలు తప్ప ఇక్కడి ప్రజలు ఎలాంటి పోరాట పటిమనూ చూపలేదు. పోరాటం జరిపి, సంఘర్షణ సాగించి స్వరాజ్యాన్ని సంపాదించడం ఇక్కడి స్వభావంలోనూ లేకపోయింది, ఇక్కడి సామర్థ్యానికి అందుబాటులోనూ లేకపోయింది.

స్వరాజ్యానికి కాని, విప్లవాత్మక పరివర్తనకు కాని ఖచ్చితంగా మూల్యం చెల్లించవలసి ఉంటుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలు తమ స్వరాజ్యం కోసం సంవత్సరం పాటు వేయి చదరపు మైళ్ల ప్రాంతంలో ఆంగ్లేయులతో నిరంతర సంఘర్షణ సాగించవలసి వచ్చింది. ఈ యుద్ధం కోసం అయిదు సంవత్సరాల పాటు సన్నాహాలు జరిగాయి. యుద్ధంలో అన్ని వర్గాల ప్రజలూ పాల్గొన్నారు. రైతులు పొలాలలో వాడే పరికరాలను కరిగించి ఆయుధాలు తయారు చేశారు. 'స్వరాజ్య పుత్రులు' అనే సంస్థలో వారితోపాటు కార్మికులూ, బానిసలూ, పాదరీలు, న్యాయవాదులూ, ప్రభుత్వోద్యోగులూ కూడా చేరారు.

18వ శతాబ్దంలో ఫ్రెంచి ప్రజలు ప్రజాస్వామ్య సాధన కోసం ఏడు సంవత్సరాలపాటు వివిధ రంగాలలో పోరాటాలు జరిపారు. ఆ ఆర్థిక, పాలనాత్మక, రాజకీయ, సామాజిక సంఘర్షణలలో పరిసర దేశాలు ఆటంకాలు కల్పించాయి, సంఘర్షణలను మరింత క్లిష్టం చేశాయి. ఫ్రెంచి విప్లవం అక్కడి నాయకుడు నెపోలియన్‌ను సైతం మట్టి కరిపించింది. 12 సంవత్సరాలపాటు సాగిన భీషణ సంగ్రామం

**వ్యక్తి మారితేనే సమాజం,విశ్వం,యుగం మారతాయి.**

ఫ్రాన్స్‌ను ఒక ఒడ్డుకు చేర్చిందని చరిత్ర విద్యార్థులకు తెలుసు. ఆ దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మంత్రం ఆచరణలోనికి రావడానికి ఈ నిరంతర సంఘర్షణ మార్గం చూపింది.

భారత్‌కు తన స్వరాజ్యం కోసం అమెరికావలె యుద్ధం చేయవలసి రాలేదు, ఫ్రాన్స్ వలె ప్రజాస్వామ్యం కోసం సంవత్సరాల తరబడి యుద్ధజ్వాలలలో మ్రగ్గిపోవలసిరాలేదు. ఈ దేశాలు బ్రిటన్‌తోనే యుద్ధాలు చేశాయి. ఫ్రెంచి ప్రజలు బ్రిటన్‌తోపాటు తమ పాలకులతోకూడా పోరాడారు. వారు ద్విముఖమైన సవాలును ఎదుర్కొన్నారు. రెండు రంగాలలోనూ వారు మహత్తరమైన బలిదానం చేయవలసివచ్చింది.

1911లో చైనా విప్లవం, సంవత్సరాల తరబడి సంక్షోభం తర్వాత అక్కడ ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు, రష్యన్ విప్లవం, జపాన్‌లో జాతీయవాద ఆవిర్భావం వంటి అధ్యాయాలను కూడ ఆయా దేశాల ప్రజలు తమ రక్తంతో లిఖించారు. ఈ పరివర్తనల కోసం లక్షలాది ప్రజలు తమ ప్రాణాలను అర్పించి ఉంటారు. మొదటి ప్రపంచ యుద్ధంలోనూ, రెండవ ప్రపంచ యుద్ధంలోనూ జర్మనీ, ఇటలీ, ఆస్ట్రియా, స్పెయిన్, పోలెండ్ మున్నగు దేశాలు దాదాపు ధ్వంసం అయినాయి. ఆ విధ్వంసాన్ని తట్టుకుని, తిరిగి లేచి నిలబడడానికి ఈ దేశాలు జరిపిన తీవ్ర ప్రయత్నంతో, మహత్తర సంఘర్షణతో పోల్చితే, భారత ప్రజలు గట్టి బలిదానం చేయలేదని అనిపిస్తుంది. స్వరాజ్యం కోసం సంఘర్షణ మార్గాన్ని ఎన్నుకున్న విప్లవవీరుల, అమరజీవుల త్యాగాలను ఎంతమాత్రం తక్కువ అంచనా వేయకూడదు. అయితే - ఎవో కొన్ని సంస్థల ఏర్పాటు, కొద్ది సహాయనిరాకరణ, పాలకులకూ భారతీయ నాయకులకూ మధ్య సౌహార్దపూర్వక వాతావరణంలో జరిగిన చర్చలు - వీటిద్వారానే 20వ శతాబ్దంలో భారత్ విముక్తి పొందింది. రెండవ ప్రపంచ యుద్ధపు ఒత్తిడి, బ్రిటన్ నిర్వీర్యం కావడం కూడ కారణాలన్నది నిశ్చయమే. అయితే 1947 తర్వాతకూడ బ్రిటన్ పరిస్థితి అలాగే ఉంది. తరువాతి 40 సంవత్సరాలలో కనీసం రెండు డజనుల దేశాలు తమ అదృష్టాన్నీ, భవిష్యత్తునూ నిర్ణయించుకున్నాయి. అందుకోసం ఆయా దేశాలు తమ అస్తిత్వాన్ని పణంగా పెట్టవలసివచ్చింది.

మామూలు ప్రయత్నాలు, ఉద్యమాలు, ప్రదర్శనలు, ధర్నాలు, బహిష్కరణలవంటి మెత్తని పోరాటం ద్వారానే భారత్‌కు స్వరాజ్యం రావడానికి కారణం ఏమిటి? ఇతర దేశాల ప్రజలవలె ఇక్కడి ప్రజలు బలిదానాలు చేయవలసిన అవసరం ఎందుకు లేకపోయింది? మారిన ప్రపంచ పరిస్థితులు, అంతర్జాతీయ ఒత్తిడులు కారణంగా ఈ దేశానికి సునాయాసంగా స్వరాజ్యం వచ్చిందని ప్రత్యక్ష సంఘటనలు ఆధారంగా పరిణామాలను విశ్లేషించే సమీక్షకులు నిర్ణయించే అవకాశం ఉంది. అంతర్ దృష్టి కలిగినవారి అవగాహన, సూక్ష్మ జగత్తులో జరిగే సంఘటనలను విశుద్ధమైన తమ సిద్ధచేతనతో అర్థంచేసుకునే సామర్థ్యం కలిగిన సిద్ధ పురుషుల అవగాహన మరోవిధంగా ఉన్నట్లు కనబడుతుంది. భారత్‌కు స్వరాజ్యం రావడం ఒక దైవీ యోజనలో భాగమన్నది వారి అభిప్రాయం. ఆ యోజన ప్రకారం ప్రపంచం ఆధ్యాత్మిక యుగంలో ప్రవేశించవలసి ఉంది. నవయుగంలోనికి ఇలా ప్రవేశించడం భారత్ నాయకత్వంలోనే సాధ్యపడుతుంది. ఎందుకంటే ప్రపంచానికి ఇవ్వడానికి ఒక విలక్షణ సందేశం దానివద్ద ఉంది. మానవ జాతికి క్రొత్త దిశను ఇచ్చే సామర్థ్యం దానికి ఉంది - ఇదీ వారి అభిప్రాయం.

భారత్‌కు స్వరాజ్యం రావడం దైవీ యోజనలో భాగం అయితే- ఆ దేశం అసలు ఎందుకు బానిసత్వంలో మ్రగ్గింది? శ్రీఅరవిందులు తమ 'వందేమాతరమ్' పత్రిక 1908 ఏప్రిల్ సంచికలో ఈ ప్రశ్నకు ఇలా జవాబు ఇచ్చారు -

"భారతదేశంలో ఆంగ్లపాలన కాలం పూర్తియింది. ఇంగ్లాండు కొద్దికాలం భారతవర్షాన్ని పాలించాలన్నది భగవానుని ఇచ్ఛ. ఆంగ్లేయులు అవలీలగా ఈ దేశాన్ని వశపరచుకోవడం ప్రపంచమంతటికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆంగ్లేయుల నిరుపమాన ప్రతిభ కారణంగా, వారి అసాధారణ గుణాలు కారణంగా ఇది సాధ్యపడిందని జనం అనుకున్నారు. ఇంగ్లాండు ఈ అభిప్రాయాన్ని పెంచి పోషించింది. దీనివల్ల ప్రయోజనం పొందింది.

"వాస్తవం ఏమంటే - ఇంగ్లాండు భారతవర్షాన్ని ఎన్నడూ జయించలేదు. ఎందుకు, ఎలా అని అది తెలుసుకునేలోగా భారత్ దాని చేతులకు అప్పగించబడింది. ఇంగ్లాండుకోసం పని చేసిన వ్యక్తులు, కొద్దిమందిని మినహాయిస్తే, చాలా చిన్నవాళ్లు. భగవంతుని దయ లేకపోతే వారు యూరప్ చరిత్రలో కాని, మరో దేశం చరిత్రలోకాని తమకు స్థానాన్ని సంపాదించలేకపోయేవారు. ఓడించిన ఘనత గెలిచిన వారి విశేష ప్రతిభా సామర్థ్యాలది అని చెప్పలేము. ఓడినవారి బలహీనత ఇందుకు కారణమనీ చెప్పలేము. ఇది చరిత్రలోని ఒక విచిత్రం. దీనిపై వ్యాఖ్యలకు తావు లేదు. ఎలాంటి ప్రత్యేక గుణాలు లేకుండా కొందరికి ఒక మహాలక్ష్యం అప్పగించబడడం, వారా లక్ష్యాన్ని సాధించేటట్లు అజమాయిషీ జరగడం- అనే ప్రక్రియకు ఇది ఒక ఉదాహరణ అని చెప్పవచ్చు.

"ఆ లక్ష్యం సాధించబడగానే - ఇంగ్లాండును రక్షించడానికి అంతవరకు తన హస్తాన్ని అడ్డుపెట్టిన దేవదూత ఆ హస్తాన్ని తొలగిస్తాడు. భారత్‌కు అవసరం ఉన్నంతవరకే ఇంగ్లాండు ఇక్కడ ఉండగలుగుతుంది. ఆ అవసరం తీరగానే అది వైదొలగవలసి ఉంటుంది. ఎందుకంటే - ఆంగ్లేయ పాలన తన భుజబలం ఆధారంగా ఇక్కడికి రాలేదు, తన బలం ఆధారంగా ఇక్కడ నిలబడ లేదు. ఇంగ్లాండు ఈ దేశానికి సహాయపడగోరితే ఆ సహాయం పొంది, సహాయపడకపోతే ఆ సహాయం లేకుండా, ప్రతిఘటిస్తే ఆ ప్రతిఘటనను తట్టుకుని - భారత్ తన లక్ష్యాన్ని సాధించి తీరుతుంది."

**రంధ్రాన్వేషకునికి మనుషులంతా దురాచారులుగా కనిపిస్తారు.**

విధి విలాసం

20వ శతాబ్దపు తొలి దశాబ్దంలో జరిగిన బెంగాలు విభజన ఉద్యమాన్ని మినహాయిస్తే - నిద్రాణమైన భారతీయ చైతన్యాన్ని మేలుకొలిపిన మరో సంఘటన లేదు. బెంగాలు విభజనకు ప్రతిఘటన విస్తృతంగా జరిగింది. ఆ ఉద్యమం బలీయమైనదే. అయితే, దాన్ని ఆధారంచేసుకుని స్వరాజ్యం వస్తుందని చెప్పగలిగేటంత ప్రచండమైనది కాదది.

బెంగాలు విభజనను ప్రతిఘటించిన విప్లవ వీరులు భగవానుని పరికరములని శ్రీఅరవిందులకు యోగవిద్యలో ప్రారంభిక శిక్షణ ఇచ్చిన విష్ణు భాస్కర లేలే అన్నారు. ఈ ప్రయత్నాలలో పట్టు లేదనీ, భగవానుడు భారత భవిష్యత్తును వ్రాసి ఉంచాడనీ కూడా ఆయన పేర్కొన్నారు. 1909లో విప్లవోద్యమం గురించి అణ్ణాసాహబ్ పట్వర్ధన్‌తో జరిపిన సంభాషణలో లేలే ఇంకా ఇలా వివరించారు - "మీరు ఎంత ప్రయత్నించినా సరే, ఆంగ్లేయులు తమ పని పూర్తి కానిదే దేశం నుండి వైదొలగరు. వారి పని పూర్తయినట్లు కనిపించగానే, వారి బలం క్షీణించిపోతుంది. 1947 నాటికి వారు ఎంత బలహీనపడతారంటే - వారు తమకు తాముగా ఇక్కడ నుండి వెళ్లిపోతారు. వారిని పారద్రోలడానికి పోరాడవలసిన, రక్తం చిందించ వలసిన అవసరం లేదు.''

మరో సందర్భంలో స్వరాజ్యం గురించి ప్రశ్నించినపుడు లేలే ఇలా అన్నారు - "విదేశీయ ఆక్రమణను కాని, విప్లవాన్ని కాని అణచి వేయడానికి ఆంగ్ల ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉంది. వారిని తరిమివేయడానికి విప్లవకారులు చేసిన సన్నాహాలు ఏమాత్రం చాలవు. కొద్దిమంది విప్లవకారులు ఇంత పెద్ద ఆంగ్ల సైన్యాన్ని ఎదుర్కొన జాలరు. మరీ మొండి పట్టుదల చూపితే వీరు తమ ప్రాణాలు కోల్పోతారు. విశ్వానికి భాగ్య విధాత భారత్. భారత్ లేచి నిలుస్తుంది. పూర్తి శక్తితో లేచి నిలుస్తుంది. విప్లవకారులూ, ఉద్యమకారులూ, సామాజిక కార్యకర్తలూ ఆ లేచినిలబడడానికి నిమిత్తమాత్రులు అవుతారు.''

తగు సమయంలో భారత్ స్వరాజ్యాన్ని సాధించడం తప్పనిసరి అని అంతర్ దృష్టి కలిగిన మహనీయులంతా ప్రకటించారు. 1947 ఆగస్టు 15న ఎర్రకోటపై త్రివర్ణపతాకం ఎగురవేయబడింది. అది సహజమైన సంఘటన. జరిగితీరవలసిన సంఘటన. ఎన్నో సంవత్సరాల పూర్వం సూక్ష్మ జగత్తులో ఈ సంఘటన చరిత్రవలె వ్రాసి ఉంచబడింది. వేలాది అమరవీరుల, లక్షలాది విప్లవకారుల, సత్యాగ్రహుల త్యాగాలను ఉపేక్షించడంగా ఈ వాస్తవాన్ని పరిగణించకూడదు. కర్రలు చేపట్టిన గోపబాలుర చర్యలవలె వారి చర్యలు ప్రశంసించదగినవని స్వామి సచ్చిదానంద వర్ణించారు. వారు ఉత్సాహం చూపారు. పరమేశ్వరునికి ప్రియ పుత్రులు అయినారు. భగవానుడు నిర్ణయించిన భారత భవిష్యత్తులో స్వాతంత్ర్య సమర సేనానుల కృషి అంతర్భాగమని భావించాలి. భారత్‌కు స్వరాజ్యం రావడం పరమేశ్వరుని విధి విలాసమని భావిస్తే, ఇక్కడి గతాన్నీ, భవిష్యత్తునూ అవగాహన చేసుకోవడం సులభం అవుతుంది.

భారతదేశపు గతం, భవిష్యత్తు ఏమిటి? గతం అంటే చరిత్ర కాదు, కాలక్రమాన్ని అనుసరించి సమాజంలో జరిగిన సంఘటనల జాబితా కాదు. అది మహత్తరమైన భారతీయ సంస్కృతి, సభ్యత. రాజులూ, మహారాజులూకాని, యోధులూ సంపన్నులూకాని దానిని రూపొందించలేదు. ఋషులూ, మునులూ తీర్చిదిద్దారు దానిని. వారి తపస్సుద్వారా, వారి పురుషార్థంద్వారా భారత్ ఆధ్యాత్మిక, భౌతిక రంగాలలో శిఖరాగ్రాన్ని చేరుకున్నది. ఈ దేశంపై పరమేశ్వరుని అనుగ్రహం వర్షిస్తూ వచ్చింది. దేశం దినదినాభివృద్ధి పొందింది. ఆ వైభవాన్నీ, మహోన్నతినీ వివరించడానికి బదులు - శ్రీ అరవిందుల వాక్యాలను ఉదహరిస్తే సరిపోతుంది. వారిలా వ్రాశారు -

"ప్రాచీన కాలంలో ఈ దేశం ప్రపంచానికి దూరంగా, ఆలోచనలకూ, చేతనకూ క్రొత్త సూత్రాలను అన్వేషించే ఋషుల, మునుల కుటీరాలవలె ఉండేది. ఈ దేశం ప్రత్యేకమైన తన భౌగోళిక స్థితి కారణంగా మిగతా మానవజాతి నుండి వేరు చేయబడింది. ఇది ప్రశాంతమైన ఆశ్రమంలా ఉండేది. ఈ ఆశ్రమంలో తన సమస్యలపై, ప్రపంచ సమస్యలపై లోతయిన ఆలోచన జరిగేది. జీవన రహస్యం వెలికి తీయబడేది. దీని ఆలోచనలు ఆసియా అంతటా వ్యాపించేవి. వేర్వేరు సభ్యతలను నిర్మాణం చేసేవి. ఈ దేశమాత సంతానం ఇతర దేశాలకూ, సభ్యతలకూ వెలుగు ఇచ్చేది. అనంతమైన ఈ దేశపు బుద్ధివైభవ కణాలతో ధర్మశాస్త్రం నిర్మాణం అయింది. అనంతర కాలంలో ప్రమాదాలు విరుచుకుపడ్డాయి. హిమాలయాల కనుమలగుండా ఇతరులు రావడం ప్రారంభమయింది. ఫలితంగా భారత్‌లో శాంతి దెబ్బతిన్నది. భారత్ సంఘర్షణ యుగాన్ని గడపవలసివచ్చింది.

"క్రమక్రమంగా పరాభవ యుగం వచ్చింది. భారతీయ సిద్ధాంతాలనుండి ఉద్భవించిన సభ్యతలు భారత్‌పై ఆక్రమణలు ప్రారంభించాయి. అయితే - గ్రీకు, సిథియన్, ముస్లిం, క్రైస్తవ సభ్యతలను, చివరకి యూరపు విజ్ఞానాన్నీ, జడవాదాన్నీ సైతం భారత్ జీర్ణించుకున్నది. ఇప్పుడు జీర్ణించుకోవలసిన విషయాలు చరిత్రలో అద్వితీయమైనవి, నిరుపమానమైనవి. అయినా, వీటిని జీర్ణించుకోవడం భారత్‌కు బాల్యక్రీడ. భారత్ బుద్ధివైభవం అన్నింటినీ తన భుజస్కంధాలపై మోయగలుగుతుంది. దాని ఆంతరిక మనస్సు ప్రతి విషయపు లోతులనూ తరచి చూడగలుగుతుంది. దాని భౌతికతకు ఎన్నడూ ఎలాంటి హానీ జరగడానికి వీలులేదు. ప్రపంచంలోని ఎంతపెద్ద పనినయినా చేయడానికి అది సమర్థురాలు. భారత్ ఇతరుల మాటలకు చెవి ఒగ్గిన ఆ అకర్మణ్యతా శకం సమాప్తమయింది. ఇప్పుడు అది బయటి వస్తువులను తీసుకుని వాటిని అనుకరించడంతో, వాటిని కొద్దిగా సంస్కరించడంతో తృప్తిపడదు. వాటిని ముడిసరుకుగా స్వీకరిస్తుంది, సాటిలేని తన సృజన శక్తితో భౌతిక ప్రగతిని సాధించేందుకై వాటిని వినియోగిస్తుంది.

**ప్రసన్నంగా ఉండేవాడికి ప్రసన్నంగా ఉండే పరిస్థితులు కూడా లభిస్తాయి.**

H H H

# వసంత పంచమి అనుభూతి

## శిష్యత్వాన్ని సార్థకంచేసిన ఆ వసంతపంచమి

1926 వసంత పంచమి పర్వదినాన హిమాలయవాసి అయిన సద్గురువు ఒక పదిహేనేళ్ల బాలునికి దర్శనం ఇచ్చారు. ఆ శుభ ముహూర్తంలో గురుత్వం ప్రకటితం అయింది. శిష్యత్వం సార్థకం అయింది. దీనితో - వసంత పంచమి గొప్పతనాన్ని చాటిచెప్పే ప్రియాతి ప్రియమైన, మధురాతి మధురమైన కథ ఈ మహాపర్వంతో ముడిపడింది. ఈ పర్వదినం గొప్పతనాన్ని వర్ణించే కథలు మరి అనేకం ఉన్నాయి. వానిలో కొన్ని పురాణాలలో ఉన్నాయి. కొన్ని సంస్కృత కవుల కావ్యాలలో ఉన్నాయి. పెక్కు కథలు జానపద గాథలుగా ప్రచారంలో ఉన్నాయి. అయితే ఈ కథలలో ఏ ఒక్కదాని నుండీ ఆధ్యాత్మిక భావన స్రవించదు. ఆధ్యాత్మిక ధార ప్రవాహం పొంగిపొరలదు. వానిలో ఏ ఒక్క కథనుండీ సద్గురువు ప్రేమ వ్యక్తం కాదు. శిష్యుడు తన సద్గురువుపట్ల చూపిన సర్వస్వార్పణ భావన వ్యక్తం కాదు. కానీ, 1926 వసంత పంచమి బ్రహ్మ ముహూర్తంలో విరచితమైన చరిత్ర కథ ఆధ్యాత్మిక భావనల ఉప్పెనను సృష్టించింది.

నాటినుండి ప్రతి వసంత పంచమీ ఈ ఆధ్యాత్మిక కథలో ఒక కొత్త అధ్యాయాన్ని చేర్చింది. ఒక్కొక్కటిగా 60 సంవత్సరాలు గడిచాయి. 1986 వసంత పంచమి వచ్చింది. లెక్కలేనన్ని హృదయాలు ఆ శుభ ఘడియకోసం ఎదురుచూచాయి. అందరూ ఆశ, ఉల్లాసాల ఊయలలో ఊగుతున్నారు. తమ సద్గురువు దర్శనం జరుగుతుందన్నది వారందరి హృదయాలలోని ఆశ. వారి అమృత వచనాలను వినాలన్నది వారందరి హృదయాలలోని ఉల్లాసం. సంవత్సరాల తరబడిగా ఎదురుచూస్తున్న కళ్లు నేడు ఆ దర్శనం చూచి తృప్తిపడాలని కోరుతున్నాయి. అతి విలక్షణమైన క్షణం అది. సంవత్సరాల సూక్ష్మీకరణ సాధన తర్వాత పరమపూజ్య గురుదేవులు నేడు దర్శనం ఇస్తున్నారు. ఆ సంవత్సరం శాంతికుంజ్‌లోని కణ కణంలో అపురూపమైన ఉల్లాసం, అసాధారణమైన ఉత్తేజం. చూచినవారికే అది తెలుస్తుంది. విన్నవారు దాన్ని కేవలం అంచనా వేయగలుగుతారు. ఈ వాక్యాలు చదువుతున్నవారు ఈ సంఘటనను తమ మనోనేత్రాలతో పరికించ గలుగుతారు.

ఆ వసంత పంచమికి కొద్దిరోజుల ముందునుండే వాతావరణమంతా ఒక విశేష చైతన్యపు స్పందనలతో స్పందించింది. అందుకోగలిగినవారు ఆ స్పందనలను అందుకున్నారు. అలాంటి గ్రహణశీలుడైన ఒక నవాగంతుకుడు ఆ రోజుల్లో ఒక కల కన్నాడు. మనసు పులకించిపోయే మధుర స్వప్నం అది. ఆ కలలో అతడికి ఒక దృశ్యం కనిపించింది : అతడు పై అంతస్థులో ఉన్న గురుదేవుల గదిలోకి వెళ్లి ఉన్నాడు. మెరూన్ రంగు మొజాయిక్ పరచిన నేలమీద సోఫా ఉంది. ఆ సోఫా ప్రక్కన గురుదేవుల మంచం ఉంది. గురుదేవులు సోఫాలో కూర్చొని ఉన్నారు. అతడు గురుదేవులకు భక్తిపూర్వకంగా ప్రణామం చేశాడు. తాను తెచ్చిన లేత గులాబి పువ్వును తన రెండు చేతులతో గురుదేవుల చరణాలకు అర్పించాడు. గురుదేవులు కనుబొమలు కొద్దిగా పైకెత్తి అతడిని చూచారు. గంభీరంగా ఇలా అన్నారు - "నీవు వచ్చావా బాబూ. నిన్ను నేనే పిలిచాను. సక్రమంగా ఉండు. నేను ఎప్పుడూ నిన్ను దృష్టిలో ఉంచుకుంటాను. మంచిది. ఇక వెళ్లు."

గురువుగారి ఆజ్ఞ పొంది అతడు తిరిగివెళ్లసాగాడు. వారు అతడిని ఆపి, "క్రిందికి వెళ్లి, నేను కలుస్తానని, అందరినీ కలుస్తానని అందరికీ చెప్పు. అంతే కాదు. నా గురించి అందరికీ చెపుతాను. నేనెవరినో అందరికీ చెపుతాను."

ఇంతలో కల చెదిరింది. కాని, ఆలోచనల గొలుసులు తెగలేదు. ఆ కల కన్న వ్యక్తి మనసులో ఎన్నో భావాలు మెదిలాయి. గురుదేవులు నిజంగా అందరినీ కలుస్తారా. మరి ఆయన అసలు ఎవరు. 1984 జూన్, 85 ఏప్రిల్ అంఖడజ్యోతి పత్రికలు అతడు చదివి ఉన్నాడు. ఆ పత్రికలలో గురుదేవుల జీవిత చరిత్ర వ్రాసి ఉంది. వాటిలో వారు తమ మూడు జన్మల గాథను వ్రాసి ఉన్నారు. తాము తమ సద్గురువును కలుసుకోవడం గురించి, తమ జీవన సాధన గురించి వారు వర్ణించి ఉన్నారు. ఆ వివరణ కాక ఆయన గుర్తింపు మరేదైనా ఉందా? ఇలా ప్రశ్నలు అతడి మనసును త్రవ్వసాగాయి. అతడు శాంతికుంజ్‌లోని ఒకరిద్దరు వరిష్ఠ కార్యకర్తలతో తనకు వచ్చిన ఆ చిత్రవిచిత్రమైన కల విషయం చర్చించాడుకూడా. అయితే, ఇప్పుడు గురుదేవులు సాధనలో ఉన్నారనీ, వారు బయటికి వచ్చే కార్యక్రమం ఏదీ లేదనీ వారు అతడికి చెప్పారు.

కానీ, వసంత పంచమికి మూడు నాలుగు రోజులముందు - గురుదేవులు అందరినీ కలుస్తారనీ, తప్పక కలుస్తారనీ, కలగానే అయినా, అనిపించసాగింది. ఒక రోజు ముందునుంచే శాంతికుంజ్‌లో జనం నిండసాగారు. అందరూ తమకు తెలియకుండానే ఒక ఆశతో, ఒక నమ్మకంతో వస్తున్నారు - తమ ప్రభువు తమను కలుస్తారని. వసంత పంచమికి ముందురోజు రాత్రి శాంతికుంజ్‌కు వచ్చినవారిలో, శాంతికుంజ్‌లో ఉన్నవారిలో హెచ్చుమంది నిద్రించలేక పోయారు.

**మహోత్సాహం + అవిరళ కృషి = సాఫల్యం.**

వారి మనసులలో పొంగుతున్న భావతరంగాలు నిద్రను దూరానికి తరిమికొడుతున్నాయి. ఆరోజు ఉదయం యజ్ఞంకూడ త్వరగా పూర్తయింది. అందరూ ప్రవచన మండపంలోకి వచ్చి కూర్చున్నారు. జనం బాగా పెరిగిపోవడంతో, అందరూ మండపంలో కూర్చోనడం కష్టమయింది. అయినా అంతా చేరుకున్నారు. అంతా ఆనందంగా ఉన్నారు. ఎందుకు ఉండరు మరి. మనసులో ఆనందం తాండవిస్తూఉంటే శరీరం సంగతి ఎవరికి పట్టింది.

నిర్ణీత సమయానికి వందనీయ మాతాజీతో పాటు పరమపూజ్య గురుదేవులు ప్రవచన వేదికమీదకు వచ్చారు. లెక్కలేనన్ని కళ్ల జంటలు వారిపై లగ్నం అయినాయి. ఎప్పుడూ చంచలంగా ఉండే మనస్సు నేడు సునాయాసంగా స్థిరపడింది. ఈ భావ దశ ఏ ఒక్కరికోకాక, ఒకేసారి అందరికీ కలిగింది. సుదీర్ఘమూ, కఠోరమూ అయిన తపస్సు తర్వాత వారు మొదటిసారిగా సామాన్య ప్రజల ఎదుటకు విచ్చేశారు. వారి ముఖమండలంనుండే కాక, వారి శరీరంలోని కణ కణంనుండి ప్రేరణ ఇచ్చే తపశ్శక్తి ప్రవాహం పారుతోంది. ఆనందమయమైన వారి ఉపస్థితివల్ల అందరూ తాము ధన్యులు అయినామని, కృతకృత్యులు అయినామని అనుభూతి పొందుతున్నారు. ఆయన మాట్లాడుతున్నారు. ఏదో చెపుతున్నారు. అయితే కేవలం శబ్దాలతో కాదు, ప్రాణాలతో. మహాప్రాణం యొక్క తప ప్రాణం ప్రవహిస్తోంది. లెక్కలేనన్ని చిన్నచిన్న ప్రాణ ధారలు దానిలో విలీనం అవుతున్నాయి. పరమ అద్భుతమూ, సుఖప్రదమూ అయిన ప్రాణ-ప్రత్యావర్తన అది.

వారి వాణిలో సద్గురువు లోని ఆర్ద్రమైన వాత్సల్యం ఉంది. దానితో పాటు మహాతపస్వి లోని ప్రచండ ఓజస్సుకూడ ఉంది. ఆ వాణిలో ప్రేమామృత బిందువులు ఉన్నాయి. ధగధగలాడుతూన్న తపోగ్ని జ్వాలలూ ఉన్నాయి. ఇది ఆశ్చర్యకరమైన కలయిక. అయినా నిజమైన కలయిక. ఒక క్షణం వారు తమ శిష్య సముదాయాన్ని గారాం చేస్తున్నారు. సాయపడతానని వారికి వాగ్దానం చేస్తున్నారు. మరు క్షణంలో వారు కాలనేముల కుటిల కుట్రపై విరుచుకుపడుతున్నారు. ఒక క్షణం వారు ప్రపంచపు ఉజ్వల భవిష్యత్తు సుందర చిత్రాన్ని శ్రోతల కళ్లముందు ఉంచుతున్నారు. మరు క్షణంలో - ప్రపంచాన్ని సర్వనాశనం చేసే స్టార్ వార్‌కు ఈనాడు జరుగుతూన్న సన్నాహాలను నేను కాలరాచివేస్తాను - అనే వారి గర్జన వినిపిస్తోంది. ఛాలెంజర్‌ను నేను మట్టిలో కలిపివేస్తాను; సైతాను బలానికి వేయిరెట్లు ఉంటుంది భగవానుని బలం; దుష్టవ్యూహాలు సాగనివ్వబడవు; ప్రపంచాన్ని నాశనం చేయాలని కలలు కనేవారు తామే నాశనం అవుతారు - అనే గర్జన వినిపిస్తోంది.

వారి ఆ వాణి విద్వాంసుడైన మనీషి ఆలోచనల అల్లిక కాదు. సాధన సంపన్నుడైన ఋషి ఉజ్వల దృష్టి అది. వారి ప్రతి మాటలో వారి మహత్తర తపస్సుకు చెందిన అలౌకిక ప్రభ తళతళలాడుతోంది, ధగధగలాడుతోంది.

ఆవిధంగా - ఆ వసంత పంచమి రోజున అమృత కణాలూ, అగ్ని విస్ఫులింగాలూ ఒకేసారి ఒకే సమయంలో కురుస్తూ ఉన్నాయి. ప్రభువు మూర్తి అనేక రూపాలలో ఒకేసారి ఒకే సమయంలో పలువురికి కానవస్తూ ఉంది. ఎవ్వరూ గుర్తించలేకపోయారు - తమ ప్రభువు, తన ఆరాధ్యుల అసలు స్వరూపం, వాస్తవిక స్వరూపం ఏదో. నిజమే మరి. భగవత్ స్వరూపాన్ని సరిగా గుర్తించడం అంత తేలికా. కేవలం భగవత్ కృపవల్లనే అది సాధ్యపడుతుంది. గోస్వామి తులసీదాస్ మహారాజ్ రామచరితమానస్‌లో దాపరికం అనేది లేకుండా చెప్పనే చెప్పారు కదా - **'సో జానహి జోహి దెహు జనా ఈ'** అని. అనగా - ఓ ప్రభూ! ఎవరికి నీవు స్వయంగా నీ స్వరూపాన్ని తెలుపుతావో వారే నిన్ను తెలుసుకోగలుగుతారు.

1986వ సంవత్సరపు వసంత పంచమినాడు 1926నాటి వసంత పంచమి మళ్లీ వచ్చింది. 60 సంవత్సరాల క్రిందటి ఆ క్షణం మరోమారు ప్రత్యక్షం అయింది. చరిత్ర అదే సద్గురు కృప కథను తిరిగి వ్రాసింది. సద్గురువు శిష్య సముదాయం సమక్షంలో తమ నిజస్వరూపాన్ని ప్రకటిస్తూ ఇలా అన్నారు -

**"బాబూ! మాతాజీని చూచినవారు నన్ను చూచారు. నన్ను చూచినవారు గాయత్రీ మాతను చూచారు."**

ఎంతో సూటిగా స్పష్టంగా సద్గురువు తమ శిష్యులకు తమ స్వరూపాన్ని బోధపరచారు. అయితే, ఎవరికి ఈ సత్యం గుర్తున్నదో, ఎవరు ఈ మహాసత్యాన్ని తమ జీవితపు మతిమరపులలో మరిచిపోయారో ఆయావ్యక్తుల పాత్రతపై ఆధారపడి ఉన్నదన్నది వేరే విషయం. కానీ, సాధకుల అనుభూతితో నిండిన సత్యం ఏమంటే - ఈశ్వరీయ సత్తాయే మనకు మన సద్గురువు రూపంలో దిగివచ్చింది. అమరము, అవినాశి అయిన వారి ఆనాటి వాణిలోని కొన్ని భాగాలు కొద్ది రోజులలోనే నిజమైనాయి. ఛాలెంజర్, స్టార్‌వార్‌లు అంతమైనాయన్న వార్తను ప్రపంచంలోని పత్రికలన్నీ ఎర్రని అక్షరాలతో ప్రచురించాయి. ప్రపంచ దేశాలన్నింటిలో అత్యంత శక్తిశాలి అయిన దేశపు మహావైజ్ఞానికులుసైతం అందుకు కారణాన్ని కనుగొనలేకపోయారు. వారి వాణి శివ-వాణి. వారు చెప్పినదంతా నిజమని తగు సమయంలో ఋజువుకావడం తథ్యం.

మనం ఈ శివ వాణిని అర్థం చేసుకోగలిగితే, వారు మనకు చెప్పిన తమ స్వస్వరూపంపై మనం మన దృష్టిని నిలిపిఉంచగలిగితే - ఈ వసంత పంచమి మనకుకూడ అలాంటి చరిత్ర కథనే వ్రాయగలుగుతుంది. సద్గురువు కృప కథ. శిష్యత్వం సార్థకం అయ్యే కథ.

H H H

**సదాలోచనల, సత్‌కర్మల అలవాటే శీలం.**

బోధకథ

# పురందరదాసుగా మారిన శ్రీనివాస నాయక్

భగవంతుడు ప్రతి జీవికి ఏదో ఒక బాధ్యతను అప్పగించి ఆ పని సానుకూల పరిచే నిమిత్తం అతడిని ఈలోకంలో జన్మింపచేస్తాడు. అయితే, అధిక సంఖ్యాకులు ఈలోకంలోని భౌతిక సుఖాలకు, ప్రలోభాలకు దాసులై తాము వచ్చిన పని మర్చిపోతారు. అలాకాక భగవంతుని ఆదేశం ప్రకారం ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా చలించక ఆ కార్యాన్ని సంపూర్తిగా నిర్వహించిన వారిని కారణజన్ములంటారు. అలాంటి కారణజన్ములలో పురందరదాను ఒకరు.

పురందరదాసు అసలు పేరు శ్రీనివాస నాయక్. ఈయన విక్రమ శకం 1401 వ సంవత్సరంలో మహారాష్ట్రంలోని పురందరగఢ్ అనే నగరంలో జన్మించాడు. ఇతడి తండ్రి వరదప్ప నాయక్ రత్నాల వర్తకుడు. చాలాకాలం సంతానం లేక చింతిస్తూఉండగా శ్రీనివాసుని దయవలన ఈ బిడ్డ కలిగాడు.

శ్రీనివాస నాయక్ చిన్నతనంలోనే వ్యాపారంలోని మెలకువలన్నీ తెలుసుకున్నాడు. తండ్రి చనిపోయిన తర్వాత తన బుద్ధి కుశలతతో వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసి సాటివారితో మేటి అనిపించుకున్నాడు. అతడు అమ్మే విలువైన రత్నాలంకారాలకు విజయనగరం, గోల్కొండ మొదలైన రాజాస్థానాలలో మంచి పేరు ఉండేది.

సంపాదన పెరుగుతున్నకొద్దీ శ్రీనివాస నాయక్‌లో లోభగుణం వృద్ధిపొందసాగింది. పైసా పోతే ప్రాణం పోయినట్లు విలవిలలాడిపోయేవాడు. యాచకులను శత్రువులుగా భావించేవాడు. దానధర్మాల మాట కలలోకూడా తలచేవాడు కాడు. జాలి, దయ అనే గుణాలను పూర్తిగా మర్చిపోయి, ధనార్జన ఒక్కటే జీవిత ధ్యేయమన్నట్లు నడుచుకునేవాడు.

భర్త ప్రవర్తన అతడి భార్య లక్ష్మీబాయికి బాధ కలిగించేది. "మనకెటూ సంతానం లేదు. కనీసం దానధర్మాలు చేసి అయినా పుణ్యం సంపాదించుకుందాము." - అని నచ్చచెప్పేది.

"ఆడదానికి డబ్బువిలువ ఏమి తెలుస్తుంది! డబ్బులేని వాడిని ఈలోకంలో ఎవరూ లెక్కచెయ్యరు. గౌరవ మర్యాదలు అసలే ఉండవు. నువ్వు నోరు మూసుకో." - అని అతడు ఆమెను కసిరికొట్టేవాడు.

నిజానికి శ్రీనివాస నాయక్ పుట్టింది అమూల్యమైన ఆధ్యాత్మిక సంపద పోగుచేసి ప్రజలకు పంచిపెట్టడానికిగాని ధనార్జనకోసం కాదు గదా! అందుకే భగవంతుడు అతని దృష్టి మరల్చి కార్యచరణుని చెయ్యాలని సంకల్పించాడు.

ఒకరోజున ఒక పేద బ్రాహ్మణుడు అతని దుకాణానికి వచ్చి అతనితో "అయ్యా! గ్రామాలలోని చదువురాని పిల్లలకు విద్య నేర్పించి వారిని సంస్కారులుగా తీర్చిదిద్దేందుకై ఒక పాఠశాల స్థాపించాలి అనుకుంటున్నాను. మీలాంటి సంపన్నుల సహకారంతోనే నా అభిలాష కార్యరూపం దాలుస్తుంది. తమకు తోచినంత సహాయం చెయ్యండి." - ఎంతో వినయంగా అడిగాడు.

సామాన్యంగా తన దగ్గరకు యాచకులెవరూ రారు. ఇతనెవరో పొరుగూరివాడై ఉంటాడు - అని అనుకొని శ్రీనివాస నాయక్ అతనితో, "ఇప్పుడు నేను చాలా ముఖ్యమైన పనిలో మునిగి ఉన్నాను. రేపురా!" అని చెప్పాడు. తన మాట నిజమేనని నమ్మి మరునాడు వచ్చినా, ఇదే మాట చెపితే విసుగు పుట్టి వాడే పోతాడని అతని ఉద్దేశ్యం.

మరునాడు అదే సమయానికి ఆ బ్రాహ్మణుడు వచ్చి ముందటి రోజులాగే యాచించాడు. ముందుగా అనుకున్నట్లే శ్రీనివాస నాయక్ "రేపురా. ఇప్పుడు మంచి పనిలో ఉన్నాను." అని అన్నాడు. ఆ బ్రాహ్మణుడు మారు మాట్లాడక వెళ్లిపోయి మరురోజు మళ్లీ వచ్చి యాచించాడు. అప్పుడూ అదే సమాధానం. ఆ విధంగా రేపురా, మాపురా అని అతనిని ఆరునెలలు తిప్పాడు. చివరకు శ్రీనివాస నాయక్‌కే విసుగు పుట్టింది. అతడు గల్లాపెట్టెలోనుండి కొన్ని చెల్లని పైసలు తీసి బ్రాహ్మణుడి ముందు ఉంచి "వీటిలో నుండి ఒక పైసా తీసుకొని వెళ్లు" - అన్నాడు. అది చూసిన ఆ బ్రాహ్మణుడు నోట మాట రాక నివ్వెరపడి శ్రీనివాస నాయక్ వైపు ఒకసారి చూసి ఆ పైసా తీసుకోకుండానే వెళ్లిపోయాడు. పీడా వదిలిందని సంతోషపడ్డాడు శ్రీనివాస నాయక్.

అక్కడ నుండి ఆ బ్రాహ్మణుడు తిన్నగా శ్రీనివాస నాయక్ ఇంటికి వెళ్లి లక్ష్మీబాయితో "అమ్మా! పేద పిల్లలకోసం పాఠశాల పెట్టాలనుకుంటున్నాను. తమబోటి ధనవంతుల సహాయంతో ఈ కార్యం నెరవేర్చా లనుకుంటున్నాను" - అని అన్నాడు. ఆమెకు ఎంతో కొంత ధనం ఇవ్వాలన్న కోరిక కలిగింది. కానీ ఏమి లాభం.

**ఆయుధాల వల్ల కాక నిజాయితీ వల్ల ప్రపంచంలో నిజమైన శాంతి లభిస్తుంది.**

భార్య గుణం తెలిసిన శ్రీనివాస నాయక్ ఆమె ఆధీనంలో ఒక్కపైసా కూడా ఉంచేవాడు కాదు. కోటీశ్వరులమై ఉండీ పేదవారికి సాయం చెయ్యలేని స్థితిలో ఉన్నానుకదా! అని ఆమె విచారపడింది. తన ఒంటిమీద ఉన్న ఆభరణాలలో ముక్కున ఉన్న ముక్కుపుడక పుట్టింటివా రిచ్చిందని ఆమెకు గుర్తువచ్చింది. ఆమె సంతోషపడుతూ అది తీసి ఆ బ్రాహ్మణుని కిచ్చి "స్వామీ! దీనిని అమ్మి సొమ్ము చేసుకొనండి" అని చెప్పింది.

ఆ బ్రాహ్మణుడు పీడా వదిలిందని సంతోషపడుతున్న శ్రీనివాస నాయక్ దగ్గరకు మళ్లీ వచ్చాడు. తన చేతిలోని ముక్కుపుడక ఇచ్చి, "అయ్యా! దీనిని తీసుకొని నాకు నాలుగువందల వరహాలిస్తారా?" - అని అడిగాడు. అది తన భార్యదని గుర్తుపట్టిన శ్రీనివాస నాయక్‌కి అంతులేని కోపం వచ్చింది. నేను ఆరుమాసాలు తిప్పి ఒక్కపైసా కూడా ఇవ్వకుండా వెళ్ల గొడితే, తాను జాతిరత్నం పొదిగిన బంగారు ముక్కుపుడక దానమిచ్చిందంటే - ఇది మామూలు అపరాధం కాదు. మరొకసారి ఇటువంటి పనులు చేయకుండా తీవ్రంగా దండించితేగాని ఆమెకు బుద్ధిరాదు - అని అనుకొని బ్రాహ్మణుడితో "ఈ ముక్కుపుడక నాదగ్గరుంచి రేపురా, నీకు నూరు వరహాలిస్తాను." - అన్నాడు. సరేనని వెళ్లిపోయాడు బ్రాహ్మణుడు.

శ్రీనివాస నాయక్ నిముషం కూడా ఆలస్యం చెయ్యకుండా ముక్కుపుడక ఇనప్పెట్టెలో పెట్టి, తాళం వేసి, కొట్టు కట్టేసి, ఇంటికి వెళ్లాడు. లోపలకు అడుగు పెడుతూనే, "లక్ష్మీ! నీ ముక్కున ఉండే ముక్కుపుడక ఏమైంది?" అని అడిగాడు.

ఆమె భయపడుతూనే, "స్నానం చేసేటప్పుడు తీశాను. ఎక్కడ పెట్టిందీ జ్ఞాపకం లేదు"- అన్నది. "అలా అయితే ఇప్పుడే వెదికి నాకు చూపించు. లేకపోతే ఏంచేస్తానో నాకే తెలియదు." - అన్నాడు మండిపడుతూ.

లక్ష్మీబాయికి ఏమి చేయాలో తోచలేదు. దానమిచ్చిన వస్తువు తిరిగి ఎలా తేగలదు! విషయం తెలిస్తే భర్త కఠినంగా శిక్షించక మానడు. ఇప్పుడు తనకు ఆత్మహత్య ఒక్కటే మార్గం - అని ఆలోచించుకొని లోనికి వెళ్లింది. గిన్నెలో విషం కలుపుకొని దేవుని మందిరం ముందు కూర్చొని, "ఓ దేవా! నాకు మృత్యుభయం లేదు. నా మరణంతోనైనా నా భర్తకు సద్బుద్ధి కలిగేలా చెయ్యి." అని ప్రార్థించి గిన్నె పైకెత్తి త్రాగబోగా, అందులో ధగధగ మెరుస్తున్న ముక్కుపుడక కనపడింది.

కలా? నిజమా? - అని దానిని పైకితీసి చూసింది. భగవంతునికి తనపై ఉన్న అపార కరుణకు ఆనందపడింది. ఆయనను పరిపరి విధాల కీర్తించి సాష్టాంగ నమస్కారం చేసి, ముక్కుపుడక తీసుకువచ్చి భర్త చేతి కిచ్చింది. దానిని చూసిన శ్రీనివాస నాయక్ ఆశ్చర్యానికి అంతు లేదు. నా చేతులతో నేను స్వయంగా దానిని పెట్టెలో పెట్టి తాళంవేసి వచ్చాను. అది ఈమె చేతికెలా వచ్చింది? - అని తికమక పడుతూ, "లక్ష్మీ! నిన్ను నేనేమీ అనను. అసలు జరిగినదేమిటో వివరంగా చెప్పు" - అన్నాడు.

లక్ష్మీబాయి తాను బ్రాహ్మణునకు ముక్కుపుడక దానమిచ్చినట్లు, ఆత్మహత్య చేసుకోబోగా విషపు గిన్నెలో ముక్కుపుడక కనపడినట్లు - అన్ని విషయాలూ వివరంగా చెప్పింది. భార్య చెప్పినదంతా విన్న శ్రీనివాస నాయక్‌కు ఆ వచ్చిన విప్రుడు సామాన్య మానవుడు కాడని, శ్రీమన్నారాయణుడే అజ్ఞానాంధకారంలో కొట్టుకుపోతున్న తనకు వెలుగుబాట చూపవచ్చాడని అర్థం అయింది.

పశ్చాత్తాపంతో కన్నీరు కారుస్తూ చేతులు జోడించి, "ఓ దేవాదిదేవా! రుక్మిణీకాంతా! అధముడనైన నన్ను యాచింపవచ్చావా! నీచ బుద్ధితో నిన్ను ఆరునెలలు తిప్పి ఒక్కపైసా అయినా ఇవ్వక పోగా, ముక్కుపుడక ధర్మం చేసిన నా భార్యను దండించబోయాను. పరంధామా! పావనరూపా! నా తప్పులు క్షమించు" - అంటూ పరిపరి విధాలుగా ప్రార్థించాడు.

అదే సమయంలో వారింటికి యతి శ్రేష్ఠులైన వ్యాసరాయలు వేంచేశారు. భార్యాభర్తలిద్దరూ ఆయనను సగౌరవంగా ఆహ్వానించి పూజించారు. జరిగిన సంఘటన వివరించారు. అప్పుడా యతి ఇలా అన్నారు - "శ్రీనివాసా! ధనసంపదలు అమృతంలాగాను పనిచేస్తాయి, విషంలాగానూ వికటిస్తాయి. శ్రేష్ఠమైన రీతిలో, న్యాయపూర్వకంగా సంపాదించిన ధనం సత్ప్రవృత్తులను పెంచడానికీ, లోకహితం కొరకూ వినియోగిస్తుంటే అది అమృతతుల్యమై ఆ వ్యక్తినీ సమాజాన్నీ జీవింపజేస్తుంది. మరోప్రక్క - దొంగతనం, దోపిడీలు, మోసం, అన్యాయం మొదలైన వాటిద్వారా ఆర్జించి విలాసాలకు, వైభవ ప్రదర్శనలకు ఉపయోగించినా, అసలు ఖర్చుపెట్టకుండా మూట కట్టినా - అది విషపూరిత పదార్థం వలె సమాజానికీ మనిషికీ కీడు చేస్తుంది." - అని అన్నారు.

మానసిక పరివర్తన కలిగిన శ్రీనివాస నాయక్ తన కున్న అంతులేని సంపదను నగరంలోని గురుకులాలకు, చికిత్సాలయాలకు, పేదలకు పంచిపెట్టాడు. కట్టుబట్టలు తప్ప పూచిక పుల్ల కూడా ఉంచుకొనక అన్నింటినీ దానం చేశాడు. దృఢ

**అదృష్టాన్ని నమ్ముకుని కూర్చునేవాడు జీవితాంతం కూర్చునే ఉంటాడు.**

సంకల్పులైనవారు ఏపని చేసినా సంపూర్తిగా చేస్తారుగదా.

భార్యను వెంట బెట్టుకొని అతడు పండరీపురం వెళ్లాడు. విఠలనాథుని సేవిస్తూ, భిక్షాటనతో ఆకలిబాధ తీర్చుకుంటూ జీవితం గడపసాగాడు. కానీ అప్పుడా ప్రాంతంలో మహమ్మదీయుల హింసాకాండ అధికంగా ఉండడంతో అక్కడనుండి బయలుదేరి విజయనగరం వెళ్లాడు.

విజయనగరం చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలకు రత్నాభరణాల కొనుగోలు సందర్భంగా శ్రీనివాస నాయక్‌తో బాగా పరిచయం ఉండేది. అంతటి ధనవంతుని యాచకుని రూపంలో చూసి ఆయన ఆశ్చర్యపడ్డారు. శ్రీనివాస నాయక్ మనసులో కలిగిన మార్పు తెలుసుకొని తన గురువైన వ్యాసరాయలుతో మంత్రోపదేశం ఇప్పించారు.

వ్యాసరాయలు శిష్యుడికి వేదశాస్త్రాలన్నీ పూర్తిగా నేర్పి పూర్వాశ్రమంలో ఉన్న పేరు మార్చి "పురందర విఠలుడు" అని నామకరణం చేశారు, ఆ పేరే కాల క్రమంలో పురందరదాసుగా మారింది.

పురందరదాసులోని ప్రగాఢ భక్తిని, నిరపేక్షగా బిక్షాటనతో జీవిస్తున్న అతని సర్వసంగ పరిత్యాగ గుణాన్ని వ్యాసరాయలు తన కవిత్వంలో ప్రశంసించాడు. "పురందరదాసువంటి భక్తుడు, లక్ష్మీబాయి వంటి సాధ్వి ఇంతవరకు పుట్టలే"దని వర్ణించాడు.

పురందరదాసు బిచ్చమెత్తిన ఆహారపదార్థాలలో తాము తినగా మిగిలినదంతా పేదలకు పంచిపెట్టేవారు. రేపటికని మాపటికని ఏమీ నిలువ ఉంచుకునేవారు కారు. అందుకే దక్షిణదేశంలో ఇప్పటికీ దరిద్రుని ఇంటిని పురందరదాసు నట్టిల్లులా ఉన్నదని హేళనగా అంటూ ఉంటారు.

సరళీస్వరములైన "స.రి.గ.మ.ప.ద.ని.స"లను కనిపెట్టి పురందరదాసు కర్ణాటక సంగీతానికి శాశ్వత యశస్సు ఆర్జించి పెట్టారు. ఆయనను కర్ణాటక సంగీతోద్ధారకుడని ప్రజలు కీర్తించారు. ఆయన రచించిన కవిత్వం ప్రజలకు అత్యంత ప్రియమై అలరారింది. ఆయన నాలుగు లక్షల డెబ్బయ్ అయిదు వేల శ్లోకాలను వ్రాశారు. కర్ణాటక భాషలో "లోకభిక్ష", "వైరాగ్యము", "తత్వజ్ఞానము", "భగవద్భక్తి" మొదలైన గ్రంథాలను గంభీరమైన భావాలతో వ్రాసి సాటిలేని కీర్తిని సంపాదించారు. ఇప్పటికీ దక్షిణ భారతంలోని ప్రతి ఇంటిలో పురందరదాసు కీర్తనలు మారు మ్రోగుతున్నాయి.

పురందరదాసు సుమారు నలభై సంవత్సరాలు తీర్థాటనలు చేసి, తన ఎనభయ్యవ యేట విక్రమ శకం 1562వ సంవత్సరంలో భగవత్సాన్నిధ్యం పొందారు. ఆయన శిక్షణ, ఆయన పదములు, ఆయన గ్రంథములు జగన్మంగళకరములై విలసిల్లుతున్నాయి. కన్నడ భాషలోని ఆయన సాహిత్యం భక్తులకు కొంగు బంగారం.

అనువాదం: విజయ కుమారి

## అధ్యక్ష పదవికి అర్హతలు

**నది పూర్తిగా నిండి ప్రవహిస్తోంది. ఒడ్డున ఉన్న ఇద్దరు పిల్లలు నీటిలో పడి కొట్టుకుపోతున్నారు. తల్లి ఒడ్డు నుండి కేకలువేస్తూ రోదిస్తోంది. కానీ ప్రాణాలకు తెగించి ఉరకలువేస్తున్న నదిలోనికి దూకి, ఆ పిల్లల్ని రక్షించే సాహసవంతులెవ్వరూ లేరక్కడ. లిప్తకాలంలో ఒక యువకుడు మెరుపులా వచ్చి అమాంతం నదిలోకి దూకి పిల్లల్ని వీపు మీద కెక్కించుకొని, ప్రవాహానికి ఎదురీది ఒడ్డున చేరుకొన్నాడు. పనికిరాని పరామర్శలతోగాని, అక్కరలేని పరిశీలనతోగాని క్షణకాలం వృథాచేయక అవసరాన్ని గుర్తించి కార్యరంగంలోకి దూకిన ఈ యువకుడు ఎవరోకాదు, జార్జి వాషింగ్‌టన్. ఈయన అమెరికా అధ్యక్షుడు కావటానికి కలిగిఉన్న అర్హతలు ఇటువంటివేకానీ ఓట్లు, కోట్లు కాదు.**

**భగవంతుడు మనిషిని దీనునిగాను, హీనునిగాను, నిర్వీర్యునిగాను సృష్టించలేదు. మహోన్నతమైన సంస్కారాలు ప్రతి ఒక్కరికీ ప్రసాదించాడు. కానీ ఈ అనంతమైన సంస్కార సంపదను ఎవరు ఎంత వరకు ఉపయోగించుకోగల్గుతున్నారో దానిని బట్టే వారి జీవితాలు ఉంటాయి. ఉదారులు మనకు ఎంతో ఈయవచ్చు. వారిచ్చినంత మాత్రాన మనం గొప్ప వాళ్లము కాలేము. దానిని సక్రమంగా ఉపయోగించుకోవటము కూడా తెలియాలి. ఉన్నదాన్ని ఉపయోగించుకోవటాన్ని బట్టి, వ్యక్తి ఉత్కృష్టుడు కాగలడు కానీ లభించిన దానిని బట్టి ఉత్కృష్టుడు కాలేడు.**

**- ప్రజ్ఞాపురాణం నుండి**

**సంతోషం సగం బలం.**

# భావవిప్లవ మహోద్యమం : యువతరానికి పిలుపు

యువతకు ఇదే ఆహ్వానం. యువశక్తికి ఇదే పిలుపు.

21వ శతాబ్దపు ఈ ప్రభాత వేళలో దేశంలోని యువతీ యువకులు స్వార్థం అనే నిద్రలో మునిగిపోయి స్వంత పేరు ప్రతిష్ఠల కలలు కంటూ ఉండడం అన్నది ఏవిధంగా చూచినా అనుచితమే. మన భారతమాత మూలుగులను, వేదనతో నిండిన పిలుపులను వారే పెడచెవిన పెట్టితే, వారిని సుపుత్రులనీ, సుపుత్రికలనీ ఎలా పిలువగలం? నేడు దేశం తీవ్రమైన సంక్రమణ సంక్షోభంలో చిక్కుకున్నది. నేడు కానవస్తున్న సిద్ధాంతరాహిత్యం ఈ దేశపు రాజకీయ చరిత్రలో మున్నెన్నడూ కానరాలేదు. అవకాశవాదం విలయ తాండవం చేస్తోంది. కులతత్వ, మతతత్వాల కుత్ర సమాజంలోని సామరస్యాన్ని కబళించివేస్తోంది. చీలికల, విభజనల వ్యథ సమాజాన్ని పట్టి పీడిస్తోంది.

ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటూన్న సవాలు తక్కువదేమీ కాదు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ఒత్తిళ్లు, ఎరలు, తళుకు బెళుకుల వ్యూహంలో చిక్కుకున్న పాలకవర్గం దేశంలోని ప్రకృతి వనరులనూ, ఆర్థిక వ్యవస్థలోని ప్రముఖ రంగాలనూ తక్కువ ధరలకు తెగనమ్ముతోంది. దేశంలో ఫ్యూడల్ రాజకీయ సంస్కృతి వ్యాపిస్తోంది. ప్రజాసేవ, ప్రజలకు జవాబుదారీ అనే భావనలు నశించిపోయాయి. ధనికులకూ పేదలకూ మధ్య ఉన్న తేడా పెరిగింది. మరోప్రక్క - దేశంలోని కొన్ని స్థలాలలో మాత్రమే కనీస వేతనం లభిస్తోంది. రైతులకు నిన్నటి వరకు కనీస మద్దతు ధర లభించేది. ఇప్పుడది సమాప్తం అవుతోంది.

నీళ్లవంటి ప్రకృతి వరం, అందరికీ అందుబాటులో ఉండవలసిన వరం, నేడు అమ్ముడుపోతోంది. నీళ్ళు అమ్మి అక్రమ లాభాలు ఆర్జించడానికి బహుళజాతి సంస్థలకు స్వేచ్ఛ లభిస్తోంది. ఇది ఎంతవరకు వెళ్లిందంటే - నదులను అమ్మే ప్రక్రియ ప్రారంభమయింది. అవినీతి అన్ని హద్దులనూ అతిక్రమించింది. రేషన్ బియ్యం, వృద్ధాప్య పెన్షన్, వితంతువుల పెన్షన్ వంటి అట్టడుగు వ్యక్తులకు అందే సౌకర్యాలు లంచగొండుల గుప్పిళ్లలో చిక్కుకున్నాయి. ప్రభుత్వోద్యోగులూ, అధికారులూ ప్రజలకు పనులు చేయడం అనుగ్రహంగా భావిస్తున్నారు. ఆ పనులకు భారీయెత్తున డబ్బు వసూలుచేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు పూర్తి సమయం ఇవ్వడం లేదు, మందులు దర్శనం ఇవ్వడం లేదు. మహిళలపై హింస పెచ్చుపెరిగిపోయింది.

దళితులపేరిట, పీడితుల పేరిట పాలిస్తూన్న నేతలు ఫ్యూడల్ భావాలలో మునిగితేలుతున్నారు. వారి ఆడంబరాలకూ, అట్టహాసాలకూ అంతే లేదు. వారికి వోట్లు ఇచ్చిన ప్రజలు మాత్రం ఎప్పటిలా వెనుకబడినతనంలో మ్రగ్గుతున్నారు. సామాన్య ప్రజలు ఆస్తిపాస్తుల తగాదాలతో పోలీసు స్టేషన్‌ల చుట్టూ, న్యాయస్థానాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. అక్కడ నిలువు దోపిడీకి గురి అవుతున్నారు. వ్యవస్థ ఎంత జటిలంగా తయారయిందంటే - పైరవీదారులూ, మధ్యదళారులూ లేకుండా పనులు జరగడంలేదు. ఓడిపోయి, అలసిపోయి వారిని శరణువేడవలసి వస్తోంది. పరిస్థితులు నానాటికీ మెరుగుపడడానికి బదులు విషమిస్తున్నాయి. అందరూ కీలుబొమ్మలుగా, నిస్సహాయులుగా మారిపోతున్నారు.

ఇప్పుడు ఏమి చేయాలన్నది ప్రశ్న. మనం మౌన దర్శకులుగా ఉండిపోదామా? ఏదో పెద్ద ప్రమాదంకోసం ఎదురుచూస్తూ కూర్చుందామా? లేక - మౌనాన్ని భంగపరచి, ఈ వ్యవస్థను మార్చడంలో మన పాత్ర ఏమిటో నిర్ణయించుదామా? ఈ దేశంలో ప్రజాసేవకుల మహత్తర సంప్రదాయం సదా సాగుతూ ఉన్నది. విలువలపై ఆధారపడిన, ఆలోచనాశక్తితో నిండిన జీవనానికి ప్రాతినిధ్యం వహించే సంప్రదాయం అది. దాని ఆలోచన ఎప్పుడూ చిట్టచివరి వ్యక్తిపై కేంద్రీకరించబడి ఉంటుంది. స్వార్థం లేనందువల్ల ఈ సమాజసేవకుల సంప్రదాయం మంచిని మంచి అనీ, చెడును చెడు అని ధైర్యంగా ప్రకటించగలుగుతుంది. ఈ నైతిక సాహసమే దాని ప్రత్యేకత. అదే దాని ప్రయోజనం. అదే దాని బలం.

ఆచార్య చాణక్యుడు, సమర్థగురు రామదాసు, జాతిపిత మహాత్మాగాంధీ, వినోబాజీ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌లు ప్రజాసేవకుల ఈ సంప్రదాయాన్ని కొనసాగించి ఉన్నారు. జాతీయ వ్యవస్థను సంస్కరించడంలో మహత్తర పాత్రను నిర్వహించి ఉన్నారు. భారతీయ సమాజపు, మానవ సమాజపు ఉజ్వల భవిష్యత్తు గురించి కలలు కన్నారు. వినోబాజీ 13 సంవత్సరాలపాటు

**రోజంతా దురాచారాలకు, దురాలోచనలకు దూరంగా ఉండడం రాత్రంతా భజన కన్న మిన్న.**

పాదయాత్ర జరిపి, నిర్విరామంగా కృషి చేసి, ఒక జటిల సమస్యకు మానవీయమైన పరిష్కారం ఏమిటో చూపారు. వినోబాజీ కృషివల్ల భూమి లేనివారికి లభించినంత భూమి మరొకరి కృషివల్ల లభించలేదు.

నేటి పరిస్థితుల కారుచీకట్లలో కాంతిపుంజం ఎక్కడ ఉన్నదన్నది ప్రశ్న. పరిష్కారం వెదకడానికి పనికివచ్చే దుర్భిణి యంత్రం ఎక్కడ ఉంది?

శాంతికుంజ్ సాగిస్తూన్న భావ విప్లవ మహోద్యమంలో ఈ ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానం ఇమిడి ఉంది. నైతిక విప్లవం, బౌద్ధిక విప్లవం, సామాజిక విప్లవం ఈ మహోద్యమంలో అంతర్భాగాలు. వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణం ఈ మహోద్యమ లక్ష్యాలు. ఆరోగ్యకరమైన శరీరం, స్వచ్ఛమైన మనస్సు, సభ్య సమాజం - అనేవి ఈ మహోద్యమంలోని కార్యకలాపాలకు ఆధారాలు. సాంస్కృతిక సంవేదన అనే ఆర్ద్రమైన భావధార ఈ జాతీయ ప్రజా ఉద్యమానికి శక్తి కేంద్రం. ఆధ్యాత్మిక జీవన దృక్పథం, ప్రగతిశీల జీవన దర్శనం ఆధారాలుగా ఈ మహోద్యమ వ్యవస్థ అంతా నిర్మాణమయింది. ఈ ప్రజా ఉద్యమం నుండి నిర్మాణమయే నవ్య యువశక్తి సమాజానికి క్రొత్త ఆశాకిరణం అవుతుంది.

నవసృజనకోసం సాగుతున్న ఈ జాతీయ, మానవీయ మహోద్యమంలో ఆదర్శవాదులైన యువతీ యువకులకు మహత్తర పాత్ర ఉన్నది. ఒక ఆదర్శ సమాజ రచన అనే స్వప్నాన్ని దర్శిస్తూన్న అలాంటి యువతీ యువకులు తమ సంకుచిత స్వార్థాన్ని అధిగమించవలసి ఉంది. వారు తమనూ, తమ కుటుంబాన్నీ అధిగమించి, సమాజానికీ, దేశానికీ అగ్ర ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుంది. తమతమ అభిరుచులను అనుసరించి కొన్ని నిర్మాణాత్మక సంఘర్షణాత్మక కార్యక్రమాలకు తమను అంకితం చేసుకోవలసి ఉంటుంది. ఉదాహరణకు - అక్షరాస్యత, ఆరోగ్యం, స్వచ్ఛత వంటి రంగాలలో ఏస్థలంలో అయినా పనిచేయవచ్చు. వరకట్న నిరోధం, మత్తు నిర్మూలనవంటి దుష్ప్రవృత్తి నిర్మూలన కార్యక్రమాలకు తమను తాము సమర్పించుకోవచ్చు.

యువ శక్తి నేడు ఏమి చేయాలి? ఇందుకోసమై శాంతికుంజ్ విస్తృతమైన ఒక బ్లూ ప్రింట్ (నమూనా పథకం) తయారుచేసింది. యువశక్తిని సద్వినియోగపరచడానికీ, యువతరం సామర్థ్యాన్ని నిర్మాణాత్మక పథకాల అమలులో క్రియాశీలం చేయడానికీ ఈ బృహత్ యోజనను రూపొందించారు. ఇక కావలసిందల్లా - యువజనుల అంతఃకరణలలో ఉత్సాహం ఉరకలువేయడం, పొంగిపొరలడం, జాతీయ నవనిర్మాణంలో పాల్గొనే సాహసం, సమర్పణ భావం పెల్లుబకడం. మీకా ధైర్యం, ఆ ఉత్సుకత ఉంటే - నేడే మీరు నవనిర్మాణ ఉద్యమంలో పాల్గొనవచ్చు, భావ విప్లవ మహోద్యమంలోని క్రియాశీల కార్యకర్తలు కావచ్చు. యువశక్తి ద్వారా ప్రేరణ పొంది అమలుజరుగుతూన్న భావవిప్లవ మహోద్యమంలో యువతీ యువకులు ఇలా విస్తృతంగా పాల్గొనడంవల్ల ఈ దేశాన్ని రక్షించే, నిర్మించే ఒక బ్రహ్మాండమైన ఉద్యమం దేశమంతటికీ విస్తరిస్తుంది. 21వ శతాబ్దంలో వస్తూన్న ఉజ్వల భవిష్యత్తుకు ఇదే మూలాధారం అవుతుంది.

„ HHH

## పెన్షన్ వద్దు

[illegible]

[illegible]

**సమయం సోమరితనం వల్ల తగ్గి, కార్య నిమగ్నత వల్ల పెరుగుతుంది.**

మాతాజీ దివ్య జీవనం - 3

# ధ్యాన తీవ్రతలో దర్శించిన గతం

## బాలక్రీడలలో దివ్యభావనలు

భగవతి బాలక్రీడలలో ఆమె దివ్యభావనలు తొంగి చూసేవి. ఆమె ఆడే అనేక ఆటలలో ఆమెకు ఇష్టమైనది "శివపూజ". ఈ ఆట ఆవిడ రోజుకి కనీసం ఒక్కసారైనా ఆడి తీరేది. అప్పుడప్పుడు ఆమెకు ఇష్టమైన ఈ ఆట రోజుకి రెండు, మూడు సార్లు ఆడేది. ఆటకి ప్రారంభం భగవాన్ మహాదేవుని ప్రతీక చిహ్నం తయారు చేయడం ద్వారా మొదలు అయ్యేది. తన అక్క ఓంవతితో, చిన్ననాటి స్నేహితురాలు సుఖమతితో కలిసి మట్టితో శివప్రతీక తయారుచేసేది. దానిని విధి పూర్వకంగా స్థాపించిన తరవాత దానిని పుష్ప, దీప, నైవేద్య, బిల్వ పత్రాలతో పూజ చేసే క్రమం మొదలిడేది. ఈ పూజ చాలా భక్తిగా, ప్రేమగా చేసేవారు. పూజ అయిన తరవాత అందరూ భగవాన్ శివుని పంచాక్షరీ మంత్రం "ఓం నమః శివాయ" జపం చేసేవారు.

ఆటలో పాలుపంచుకునే మిగతా బాలికలు చేసే జపం చాలా తొందరగా సమాప్తం అయిపోయేది. కానీ భావసమాధిలో మునిగిపోయిన భగవతి చాలా సేపు 'ఓం నమః శివాయ' మంత్ర జపం చేసేది. ఒకొక్కసారి గంటలు గంటలు గడిచేవి. ఆటలో పాల్గొనే మిగతా బాలికలకు విసుగు వచ్చేది. అలసి పోయేవారు. ఒకొక్కసారి ఆమెనలాగే ఒంటరిగా వదిలేసి మౌనంగా వెళ్లిపోయేవారు. ఆ రోజు లేక మరుసటి రోజు మళ్లీ కలిసినప్పుడు వాళ్లు భగవతిని అడిగేవారు - "శివపూజ చేస్తూ ఉంటే ఏమవుతుంది? జపం చేయడానికి కళ్లు మూసుకున్న నీవు లేచే ప్రసక్తే లేదా? మేము కూడా నీతో పాటు పూజకి కూర్చుంటున్నాము కదా! ఇలా మైమరచి పోవడం లేదే." జవాబుగా భగవతి చిన్నారి మొహం మీద ఒక రహస్యాత్మకమైన చిరునవ్వు వెలసేది.

ఈ చిరునవ్వులో దాగి ఉన్న రహస్యాలు ఆమెతో పాటు ఆడే బాలికలకు తెలియవు. ఎవరికి ఈ పూజ? మహాశక్తి ఆరాధ్యదైవమైన ఆ మహాశివుని కొరకు ఉన్న ఆంతరిక అనురాగ అభివ్యక్తి అని తెలిసేదికాదు. ఈ పూజలో 'ప్రీతిపురాతన లఖైన కోయీ' పూర్తిగా సార్థకం అవుతుంది. అప్పుడప్పుడు ఆమె పెద్ద వదిన ఆమెను అడుగుతూ ఉండేది - "లాలి! నువ్వు ఇంతసేపు పూజలు ఎందుకు చేస్తున్నావురా? ఎప్పుడు చూసినా శివుని చిత్రము, ప్రతీక ముందు కళ్లు మూసుకుని కూర్చుని ఉంటావు." ఈ ప్రశ్నకు జవాబుగా ఆమె నవ్వేది. ఇలా జవాబు ఇచ్చేది - "అరే, నేను ఏమీ పూజలు చేయుట లేదు. ఇది ఆట మాత్రమే. కానీ అన్ని ఆటలలో ఈ ఆట నాకు చాలా ప్రియమైనది." ఈ మాటలకు ఎవరూ ఏమీ అనేవారు కాదు. ఇలాగే రోజూ ఈ ఆట కొనసాగుతూ ఉండేది.

ఈ ఆటలో క్రొత్తదనం కలపడానికి ఆమె తన నాన్న జస్వంతరావు సహాయం తీసుకునేది. ఆమె ఆయనను శివపురాణంలోని గాథలు వినిపించమని కోరేది. శివుని లీలా చరిత్ర వినడం ఆమెకు చాలా ఇష్టం. భగవాన్ మహాకాలుని దివ్య చరిత్ర ఆమె మనోప్రాణాలకు, అంతరాత్మకు చాలా సుఖాన్ని చేకూర్చేది. ఆమె మళ్లీ మళ్లీ వాటిని వినిపించమని అడిగేది. జస్వంతరావుగారు కూడా తన గారబుపట్టికి చాలా రసవంతంగా శివుని లీలలు వినిపించేవారు. ఆ లీలామయి తన ముందే స్వయంగా బాలరూపంలో ఉండి తన ఆరాధ్యదైవము, తన సర్వస్వమూ అయిన శివుని చరిత్ర వింటున్నదని ఆయన ఎన్నడూ గుర్తించలేదు. ఈ ఆంతరికమైన భావసత్యం ఎవరికీ తెలిసేది కాదు. ప్రత్యక్షంగా తెలిసే సత్యం ఏమిటంటే వినేవారు, చెప్పేవారు ఇద్దరూ భగవంతుని లీలలు వింటూ, చెప్పుకూంటూ భక్తి రసంలో మునిగిపోయేవారు.

ఈ శివలీలలలోని ఏదో ఒక అంశం శివపూజలో జోడించబడేది. ఒకసారి శివరాత్రి సందర్భం కలపబడితే, ఇంకోసారి శివ వివాహ కథ కలపబడేది. ఈ విధంగా ఆటలో నూతనత్వం వచ్చేది. తనతో ఆడుకునే బాలికలలో ఉత్సాహం వచ్చేది. అందరూ ఆటకి కావలసిన వాతావరణం పూర్తిగా కష్టపడి తయారు చేసుకునే వారు. ఆమె చిన్ననాటి స్నేహితురాలు, సుఖమతి ఆమె సహచరే కాక, అనుచరి కూడా. ఆమెను మాతాజీ చాలా ప్రేమతో "సుఖమన్" అని పిలిచేవారు. తన ప్రాణప్రియ సఖి భగవతికి ఏది ఇష్టమో, సుఖమన్ అదే చేసేది. భగవతి సాన్నిధ్యం వల్ల ఆమెకు శివపూజలో పరిపూర్ణమైన విశ్వాసం ఏర్పడింది. శివపూజకి సంబంధించిన ఏ పనినైనా ఆమె చాలా ఆనందంగా చేసేది.

భగవతికి ఈ ఆటలో అనేక దివ్య అనుభూతులు వచ్చేవి. కాని వాటి రహస్యం, అర్థం పూర్తిగా ప్రకటితం అయ్యేవి కావు. శివపూజ చేస్తూ భావమగ్నమైనప్పుడు ఆమె అంతఃచేతనలో అనేక దృశ్యాలు కనిపిస్తూ ఉండేవి. ఆమెకు ఇలా అనిపించేది. శివభగవానులు ఒక తెల్లని పొడుగైన సన్నని శరీరం కలిగిన యువకునిగా రూపం దాల్చినట్టు కనిపించేవారు. మొదట ఈ

**మూల్యం చెల్లించడానికి సిద్ధపడిన వాడికి అదృష్టం అందుతుంది.**

యువకుని రూపం అస్పష్టంగా కనిపించేది. కానీ తరవాత చాలా స్పష్టంగా రూపం కనిపించేది. ఈ యువకుడు సాధారణంగా ఆమెకు ఒక చిన్న గదిలో పూజా వేదిక మీద ప్రజ్వలితమై ఉన్న సాధన వేదిక మీద ఉన్న దీపం ముందు ధ్యానస్థితిలో ఉండి కనిపించేవాడు. అతని ముఖమండలం మీద ఆమెకు అపూర్వమైన తేజస్సు కనిపించేది. ఈ దృశ్యం ఆమెకు అంతర్ మనస్సులో మళ్లీ మళ్లీ కనిపించేది.

మళ్లీ మళ్లీ ఈ దృశ్యాన్ని చూసి ఆమె అశ్చర్యచకితురాలు అయ్యేది. శివపూజ చేస్తుంటే ఈ విచిత్రానుభూతి ఎందుకు వస్తోంది అని ఆలోచించుకునేది. అప్పుడప్పుడు మనస్సులో శివుడు స్వయంగా అవతరించాడా అని ఆమెకు అనిపిస్తూ ఉండేది. ప్రభువు స్వయంగా తన సృష్టిలో యుగప్రత్యావర్తనం చేయుటకు ఒక నూతనయుగ ప్రవర్తన చేయుటకు వచ్చాడా అనిపించేది. తన ఈ ఆలోచనల గురించి ఆవిడ మళ్లీ మళ్లీ ఆలోచిస్తే ఇది నిజం అనిపించేది. ఆమెకు ఆ మహాయోగి యువకుని రూపంలో శివుని స్వరూపం ప్రత్యక్షం అయ్యేది. మనస్సులోనే అతనికి శివశివా అనుకుంటూ నమస్కారం చేసుకునేది. పంచాక్షరీ మంత్రమైన ఓం నమః శివాయ జపం చేస్తూ ఆమె ప్రగాఢ భావదశలోకి వెళ్లినప్పుడు ఆమె మనోపటలం మీద ఈ దృశ్యం ప్రత్యక్షం అయ్యేది.

రోజు రోజు తన అంతః చేతనలో వచ్చే సాధనలో లీనమైన ఈ యువకునకు ఆమె పేరు కూడా పెట్టారు - "మహాయోగి శివ్". ఇది ఆమె తన భావసమాధిలో సాక్షాత్కరించిన సత్యానికి ఇచ్చిన పేరు. ఈ "మహాయోగి శివ్" ప్రతిరోజు ఆమె అంతర్భావనలలో ప్రత్యక్షమైనప్పటికీ, ఇతను ఎవరు? ఎక్కడ? మరి ఏమి చేస్తాడు? అనేది ఆమెకు తెలియలేదు. కానీ ఎప్పుడు ధ్యానంలోకి వెళ్లినా, శివపూజలలో ధ్యానమగ్నం అయినా, ఆమె హృదయంలో ఈ మహాయోగి శివ్ ఎవరైనప్పటికీ ఖచ్చితంగా ఈయన భగవాన్ శివుడే అన్న తీవ్ర స్ఫురణ ఆమెకు కలిగేది. అంతేకాక ఏదో విధంగా తన భవిష్యత్తు ఈయనతో తప్పని సరిగా జోడింపబడి ఉంది అని స్పష్టం అయ్యేది. వీరిద్వారా చెయ్యబడే ఏదో ఒక పనిలో సహకరించడానికే తను జన్మించిందేమో అని అనుకునేది.

ఆటపాటలలోనే ఆమె శివపూజ మొదలు పెట్టింది. ఆ పూజ ఆమెను దివ్య భావానుభూతులలో ముంచేస్తోంది. ఈ అనుభూతులు ఆమెను జీవితం, భవిష్యత్తు గురించి జాగురూకం చేశాయి. ఆమె బాలక్రీడలో దివ్యత్వతత్వములు ఘనీభవిస్తున్నాయి. ఈ విధంగా ఆమె క్రీడామయమగు చిన్నతనం, కిశోరావస్థకు వెళ్లుచున్నది. ఆటలలో ఏయోగసాధన తత్వములు అంకురితం అయ్యాయో అవి ఇప్పుడు పల్లవిస్తున్నాయి. ఆమె హృదయంలో సాధనామయ జీవితం కొరకు తీవ్ర అభిలాష ప్రారంభం అయ్యింది. తన ఆరాధ్య దేవుని కలవడానికి పిలుపు తీవ్రమగుచున్నది. ఈ పిలుపులో భక్తి పరాకాష్ట, ప్రేమ తరళత, అనురాగ సజలత ఉండేవి. బాలిక భగవతి ఒక ప్రఖర యోగసాధకురాలుగా రూపాంతరం చెందుతున్నది. ఆ ప్రభువు గురించి భావమయమైన పిలుపులో తన యోగ సాధన స్వరసంగీతం మారు మ్రోగుతోంది.

## పూర్వ జన్మల దృశ్యాలు

శివపూజ ఆటలో పొందిన భావానుభూతులు ఆమె వయస్సు పెరుగుతున్న కొద్దీ ఇంకా ప్రగాఢమవడం మొదలు పెట్టాయి. కిశోరావస్థకు చేరిన భగవతి మనఃప్రాణాలలో, అంతఃకరణలో ఒక పిలుపు జనించింది. ఆమె ప్రాణాలు తన శివుడిని పిలుస్తున్నాయి. ఉండిఉండి మనస్సు ధ్యానచేతనలో చూసిన దృశ్యాలను మళ్లీ మళ్లీ చూసేది. అనేక రకాల ప్రశ్నలు అంతఃకరణాన్ని తొలిచేవి. నేను రోజూ ధ్యానంలో చూసే ఈ మహాయోగి శివ్ ఎవరు? అని ఆమె ఆలోచించేది. ధ్యానం చేస్తున్నప్పుడు శివుని బదులు ఈ సుదర్శన వ్యక్తిత్వం గల మహాయోగి రూపం ఎందుకు ప్రకటితమౌతోంది? నిజంగానే భగవాన్ శివుడు పృథ్విపై అవతరించాడా? ఇలాంటి అనేక ప్రశ్నలు ఆ రోజులలో ఆమె అంతః చేతనలో అంకురిత మయ్యేవి. ఈ ప్రశ్నలకు జవాబు పొందుటకు ఆమె తన ధ్యాన సాధన ఇంకా తీవ్రతరం చేయుటకు నిశ్చయించుకొన్నది.

ఈ నిశ్చయంతో ఆమెలో ఒక విచిత్రమైన భావ ప్రవర్తన జరిగింది. ఇంటిలోని సభ్యులందరూ దీనిని అనుభూతి చెందారు. ఈ రోజులలో ఆమె దినచర్య అస్తవ్యస్తమైపోయింది. కానీ ఈ బాహ్య అస్తవ్యస్తతలో ఒక ఆంతరిక సువ్యవస్థ సాకారం అగుచున్నది. ఆమె తన ధ్యాన సాధనలో ఎంతగా మునిగి ఉండేదంటే లేవటం,స్నానం చేయటం, భోజనం చేయటం లాంటివి కూడా మర్చిపోయేది. కుటుంబ సభ్యులకు ఆమెలోని ఈ అంతరిక పరివర్తన గురించి ఏమియూ తెలియటం లేదు. పెద్దవదిన తల్లి వలె ఆమెను సంరక్షించింది. ఆమె లాలికి ఈ విధంగా తెలియచెప్పేది - "లాలీ! నీవు ఇది వరకు ఇలా లేవు. ఏమయ్యింది నీకు ఇప్పుడు? నీవు ఇదివరకు పొద్దున లేచి స్నానం చేసి తయారయి ఆడుకునే దానివి, ఇంటి పనులు చేసేదానివి. కాని ఈ రోజులలో నిన్ను గురించి నీవు పట్టించుకోవట్లేదు అని అనిపించుచున్నది".

వదినగారి ఈ మాటలు విని ఆవిడ నవ్వుతూ దాటవేసేది. ఏదో విధంగా ఆవిడను మరిపించేది. ఆమెకు తెలుసు. సువ్యస్థిత రీతిలో ఆమె కూర్చుని, రేయింబవళ్లు ధ్యానసాధన చేస్తే అందరూ కంగారు పడతారని. ఆమె తన కుటుంబ సభ్యులలో ఎవరినీ కంగారు పెట్టదలచుకోలేదు. అందువల్ల ఆమె ఈ విచిత్రమైన

**ప్రతి క్షణం కార్య నిమగ్నుడవైతే శీలం నిర్మాణమవుతుంది.**

విధానాన్ని పాటించింది. రోజురోజుకు ఆమె ధ్యానసాధన లోతులలోనికి ప్రవేశించుచున్నది. ప్రతి క్షణం అనేక దివ్యానుభూతులు ఆవిడని చుట్టుముట్టి ఉండేవి. బయటికి ఎంతో సామాన్యంగా కనిపించినప్పటికీ, ఆమె ఆంతరిక జీవితమంతా అసామాన్యం, అలౌకికం అయిపోయింది.

ఒక విశేష సందర్భంలో ఆమె తన శిష్యులకు ఆరోజుల గురించి కొన్ని ముఖ్య విషయాలు చెప్పింది. సాధనా, తపస్సు గురించి చెప్తూ ఆమె ఇలా అంది - "ఈ విషయాలు ఎంత గోప్యంగా ఉంచితే అంత మంచిది. ప్రపంచానికి దీనిగురించి తెల్పటం, చూపించడం వల్ల ఏమి లాభం? గురువుగారు లోకశిక్షణ చేయవలసి ఉంది కనుక, మీ అందరికి నేర్పించాలి కనుక వారి గురించి ఈ చిన్నచిన్న విషయాలు చెప్పాను. ఆయన చేసిన విశేష తపస్సుల గురించి ఇంకా ఏమీ తెలియదు. నా గురించి అసలు ఎవరికీ ఏమీ తెలియదు. నిజానికి నా సాధన 11, 12 ఏండ్ల వయస్సులోనే మొదలైంది. ఇందులో ఏ విధమైన ప్రదర్శన ధోరణీ లేదు. నిద్రపోతున్నప్పుడు, మెలకువగా ఉన్నప్పుడు, నిల్చుని, కూర్చుని, తింటూ, తాగుతూ నిరంతరం ధ్యానించేదాన్ని. శరీరం గురించి ఏమీ తెలిసేది కాదు. ఆ రోజులలో చాలా విచిత్ర స్థితిలో ఉండేదాన్ని."

అస్తిత్వపు ప్రతి కణంలో అణు, పరమాణువులలో నిబిడీకృతమైన అవ్యక్తనాదం ఆమెకు అన్ని వేళలా వినిపించేది. ఒకసారి భేరీనాదం వినిపిస్తే, ఇంకోసారి మృదంగం, వేరొకసారి వీణ, ఇంకోసారి శంఖధ్వని వినిపిస్తూ ఉండేది. అవన్నీ కలిసి ఒక అద్భుతమైన వాద్యబృందంగా ఏర్పడి అలౌకికమైన సంగీతం వినిపించేది. ఆమె దేహంలో, మనస్సులో సర్వత్రా అణుపరమాణువుల విద్యుత్ కణాల నృత్య రవళి నిరంతరం వినిపిస్తూ ఉండేది. ఈ లీలామయికి తన అంతఃకరణంలో ఈ అణుపరమాణువుల నిరంతర వేధన, ధ్వంసన, కొత్త కొత్త సముదాయాలుగా ఏర్పడి అనంత పదార్థముల సృష్టి, వికాసం, లయముల చిత్రములు కనిపించేవి. ఆమె చిత్‌శక్తి చైతన్యతలో అన్నీ స్పష్టంగా కన్పించేవి. ఈ రోజులలో ఆమెకు తన జన్మ, జీవితముల అనేక రహస్యములు సాక్షాత్కరించినవి.

ధ్యాన తీవ్రతలో ఆమె సాధనకు సంబంధించిన అనేక దివ్య దృశ్యములను తిలకించెను. గంగానది తరంగాలు, మందిరంలోని ఘంటా నినాదములతో పాటు కనిపించిన అనేక దృశ్యాలు చాలా అస్పష్టంగా ఉండేవి. క్రమక్రమంగా దక్షిణేశ్వర మందిరంలో రామకృష్ణ పరమహంసతో జీవించిన దృశ్యం స్పష్టంగా కనిపించెను. పరమహంస దేవునితో పాటు వారి భక్తులు శిష్యులు గుమిగూడి ఉండడం ఆమె గమనించింది. అందరూ ఆమెను చూసి 'మా' అని భక్తితో ప్రణమిల్లినట్లు కనిపించేది. ఈ అద్భుత దృశ్యావళిని చూస్తూ ఆమె తనని తాను మర్చిపోయింది.

హఠాత్తుగా ఆమె ధ్యానస్థ చేతనలో దృశ్య పరివర్తన జరిగింది. గంగా తరంగాలు, మందిరంలోని గంటల రవళి అలాగే ఉన్నవి. కొన్ని దృశ్యములు మారాయి. అంతే. ఆమెకు బెనారస్‌లో ఎక్కడో ఉన్నట్లు కనిపించింది. సంత్ కబీర్ జీవితంతో తన జీవితం ముడిపడి ఉన్నదా అని అనిపిస్తోంది. అతి పేదవాడుగా ఉన్న కబీరుతో పాటు ఆమె ఉన్నది. అనేకులు ఆమెకు శ్రద్ధతో నమస్కరిస్తున్నారు. ఆయన గుడిసె వద్దకు యోగులు, ధనంలేని వాళ్ళు, చదువులేనివాళ్ళు జ్ఞానం పొందడానికి వచ్చేవారు. లోతైన ధ్యానంలో ఉబికి వస్తున్న ఈ దృశ్యాలను ఆమె గమనిస్తూ ఉండేది. ఈ కాలశూన్యతలో కాలబోధ ప్రశ్నే లేదు.

ఇక్కడ కూడా దృశ్య పరివర్తనలు ఉన్నవి. చిత్‌శక్తి లీలావిలాసం ఇక్కడ కూడా సక్రియంగా ఉన్నది. ధ్యానంలోని ఈ భావభూమిలో ఎవరైతే కబీరో ఆయన శ్రీరామకృష్ణ పరమహంస అని, ఆయనే అనేక సంవత్సరాల బట్టీ ఆమెకు కన్పిస్తున్నటువంటి మహాయోగి అని స్పష్టమైనది. ఈయనతోనే తన భవిష్యత్తు సూత్రం బంధింపబడి ఉన్నది అని తెలిసినది. ఆ రెండు జన్మలలో సుపరిచితం అయిన సాన్నిధ్యం ఆమెకు ఈ జీవితంలో కూడా దొరకనున్నది అని తెలిసింది. సంత్ కబీర్ లీలా సహచరి "లోయి", శ్రీరామకృష్ణ పరమహంస లీలా సంగిని "శారద" ఈమెయే. ఏ ఆత్మ చేతన లోయిగా జన్మించినదో, శారదగా జీవించినదో, ఆమె భగవతీ నామరూపం స్వీకరించి, దేహం ధరించింది.

అనేక సంవత్సరాల తీవ్ర ధ్యాన సాధన తర్వాత ఆమెకు తన ప్రశ్నలకు జవాబు దొరికింది. ఆమె జీవనచర్య మళ్ళీ బాహ్యరూపంగా సువ్యవస్థితమయ్యింది. కుటుంబ సభ్యులందరికీ స్వస్థత లభించింది. ఒకే మార్పు మొదటికీ ఇప్పటికీ వారికి కనిపించింది. వారి లాలి పొద్దున్న తొందరగా స్నానం చేసి శివపూజతో పాటు నియమంగా ధ్యానం చేయడం మొదలు పెట్టింది. తన ఆరాధ్యునితో కలవడానికి ఆమెలో తీవ్ర ఉత్కంఠ ఉన్నదని ఎవరికీ తెలియలేదు. నిరంతరం ఉత్పన్నమవుతున్న ఈ ఆంతరిక పిలుపు గురించి కుటుంబ సభ్యులు ఎవ్వరికీ తెలియదు. ఈ మధ్యన కాలచక్రం వేగంగా తిరుగుచున్నది. ఆ రోజులలోని పద్ధతి ప్రకారం జస్వంతరావు శర్మ తన ముద్దుల కూతురి వివాహం గురించి చింతించడం మొదలు పెట్టారు. కిశోరి భగవతి అంతర్‌చేతనలో పెల్లుబుకుచున్న అలౌకిక జ్యోతి సాగరంలో ఒక పిలుపు సఘన స్వరంతో మారుమ్రోగుచున్నది. ఆరాధ్యుని చరణముల మీద ఆమె అనురాగం నిరంతరం వృద్ధి చెందుచున్నది. ఆమెలో ఆధ్యాత్మిక ప్రేమ బీజాలు అంకురించడం మొదలిడినవి.

K K K

**జీవించే కళ కార్యశూరుడినే వరిస్తుంది.**

ఆశ్రమ ధర్మం

# సగం జీవితం సమాజ సేవకే

భారతవర్ష వైభవం ఒకనాడు శిఖరాగ్రానికి చేరుకున్నది. ఈ పుణ్యభూమిని 'స్వర్గాదపి గరీయసి' (స్వర్గంకన్న మిన్న)గా పరిగణించారు. దీని సాంస్కృతిక సామ్రాజ్యం ప్రపంచమంతటికీ విస్తరించింది. భారతవర్షాన్ని స్వర్ణభూమిగా పరిగణించారు. భారతవర్షం ప్రపంచమంతటికీ భౌతిక విజ్ఞానాన్నీ, ఆధ్యాత్మిక జ్ఞానాన్నీ ప్రదానం చేసింది. తద్వారా వికాసాన్నీ, సంస్కృతినీ పొందిన ప్రపంచ ప్రజలు కృతజ్ఞతాపూర్వకంగా భారతవర్షాన్ని జగద్గురువుగా పేర్కొన్నారు. ఈ దేశంలోని 33 కోట్లమంది పౌరులు ఆనాడు 33కోట్ల దేవతలుగా ప్రసిద్ధి పొందారు. జ్ఞాన విజ్ఞానాలలో, దర్శనంలో, వైభవంలో భారతవర్షం గొప్పతనం అంబరాన్ని చుంబించింది. భారతవర్షం తన వెలుగుతో భూమండలాన్ని అంతటినీ ప్రకాశవంతం చేసింది. ఇక్కడి వ్యక్తిగత జీవనం, కుటుంబ జీవనం, సామాజిక జీవనం ఉన్నతోన్నతంగా విలసిల్లాయి. సుఖ శాంతులతో తులతూగాయి. కనుకనే కృతయుగం వర్ణన ఆ జీవనానికి అన్నివిధాలా అన్వయించింది.

ఈ వికాసానికీ, ఈ వైభవానికీ మూలకారణం ఇక్కడి వర్ణాశ్రమ వ్యవస్థ. ఆ వ్యవస్థ ప్రకారం వ్యక్తి తన జీవితంలో సగం తనకోసం తన కుటుంబంకోసం, సగం లోకకళ్యాణం కోసం ఖచ్చితంగా కేటాయించవలసి ఉంటుంది. మన సనాతన వైదిక ధర్మం వర్ణాశ్రమ ధర్మమే. ఇందులోకూడ ఆశ్రమ వ్యవస్థ ముఖ్యమైనది. జీవితంలో మొదటి నాలుగోవంతు బ్రహ్మచర్యం. శరీరాన్ని, మెదడునూ పరిపుష్టం చేయడంకోసం క్రీడలు, వ్యాయామం, ఇంద్రియ నిగ్రహం ఇందులో నేర్పుతారు. రెండవ నాలుగోవంతు గృహస్థం. ఇందులో కుటుంబాన్ని ఏర్పరచుకోవడం, దాన్ని పోషించడం మున్నగు బాధ్యతలను నిర్వహించవలసి ఉంటుంది. బ్రహ్మచర్యం వ్యక్తి నిర్మాణం. గృహస్థం కుటుంబ నిర్మాణం. ఈ రెంటికీ సగం ఆయుష్షు పడుతుంది. మిగతా ఆయుష్షు ఖచ్చితంగా సమాజ నిర్మాణానికి కేటాయించబడింది. మూడవ నాలుగోవంతు వానప్రస్థం కోసం, నాల్గవ నాలుగోవంతు సన్యాసం కోసం. జీవితంలోని రెండవ సగాన్ని ఈ రెండు అనుశాసనాలకు లోబడి గడపవలసి ఉంటుంది.

వానప్రస్థ ఆశ్రమంలో కుటుంబాన్ని పూర్తిగా వదిలివేయరు. కుటుంబానికి మార్గదర్శనం చేస్తారు. అత్యధిక సమయాన్ని లోక కళ్యాణానికి వినియోగిస్తారు. సాధారణంగా 50 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి పిల్లల బాధ్యత పూర్తవుతుంది. లేదా - పెద్ద కొడుకు తన తమ్ముళ్ల, చెల్లెళ్ల బాధ్యత స్వీకరిస్తాడు. అప్పుడు ఆ మధ్య వయస్సులో వ్యక్తి తన దృష్టిని లోక కళ్యాణ కార్యాలపై, ఆ పనులు చేయడానికి తగిన సామర్థ్యాన్ని సంపాదించడంపై లగ్నం చేస్తాడు. అయితే, కుటుంబంతో పూర్తిగా తెగతెంపులు చేసుకోడు. దాన్నికూడా పర్యవేక్షణ చేస్తూ ఉంటాడు. క్రొత్తవారు ఆయా కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహించేటట్లు అజమాయిషీ చేస్తాడు. ఈ బాధ్యతల మార్పిడి ఇబ్బంది లేకుండా జరిగేలా జాగ్రతలు తీసుకుంటాడు.

సన్యాసం అంటే కుటుంబ బాధ్యతలనుండి పూర్తిగా విముక్తి పొందడం. లోక కళ్యాణ కార్యాలకు అవసరమైన జ్ఞానం, అనుభవం, అభ్యాసం పరిపక్వం అయిన తర్వాత వ్యక్తి పరివ్రాజకుడుగా జనసంపర్కంకోసం ధర్మయాత్ర ప్రారంభిస్తాడు. ఈ కార్యకలాపాలతో వ్యక్తి జీవితాన్ని పూర్ణాహుతి చేయాలి. తనను విశ్వసంపదగా పరిగణించుకోవాలి. విశ్వపౌరుడుగా తన కర్తవ్యాన్ని నిర్వహించాలి. ఆత్మ కళ్యాణం, సమాజ కళ్యాణం అనే ద్విముఖ లక్ష్యంకోసం తన్మయంగా కృషిచేయాలి. తన శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా సమాజానికి సమర్పించాలి. సంస్కరించబడిన దృక్పథం, భోగాలతో తృప్తి చెంది వాటినుండి నివృత్తి పొందిన శరీరం, విస్పష్టమైన జ్ఞానం, అనుభవం, పరిపక్వమైన వ్యక్తిత్వం అతడికి ఈ సాధన ద్వారా లభిస్తాయి. ఇలాంటి ప్రత్యేకతలు కలిగిన వ్యక్తులు, నిస్వార్థ భావంతో, దివ్య భావనలతో నిండిఉన్న వ్యక్తులు సమాజాన్ని ఉత్కృష్టంగా రూపొందించే యోగ సాధనలో, పరమేశ్వర ఉపాసనలో నిమగ్నులు అవుతారు. ఫలితంగా - సమాజ నిర్మాతలు తగినంతమంది లభ్యమవుతారు. వారి నాయకత్వంలో ప్రచారాత్మకములూ, నిర్మాణాత్మకములూ, సంఘర్షణాత్మకములూ అయిన అనేక ప్రవృత్తులు వికాసం పొందుతాయి. దేశానికీ, ప్రపంచానికీ వాటి ప్రయోజనం అందుతుంది. యోగ్యులూ, సంస్కారవంతులూ, పరమార్థ పరాయణులు అయిన ప్రజాసేవకులు భారీ సంఖ్యలో తమ జీవితం అంతనూ నిష్ఠతో అర్పణ చేసినపుడు - సత్ప్రవృత్తులను పెంపొందించడం సులభం అవుతుంది. అలాంటి స్థితిలో జ్ఞాన విజ్ఞానాలు, వైభవం, సుఖ శాంతులు, ప్రగతి, సమృద్ధి శిఖరాగ్రాన్ని చేరుకుంటాయి. ప్రాచీన భారతవర్షంలో జరిగింది ఇదే. ఈ నాలుగు ఆశ్రమాల వ్యవస్థ క్రమబద్ధంగా అమలు కావడంతో - రేపు జరిగేది కూడా ఇదే.

నేడు ప్రభుత్వ శాఖలలో పనిచేసే జీతగాళ్లు సగం మనస్సుతో సగం సగం పనులు చేస్తూ ఉండడం మొక్కుబడి తప్ప మరొకటి కాదు. ఇందుకు భిన్నంగా - ప్రాచీన కాలంలో సమాజ కళ్యాణానికి సంబంధించిన అవసరాలన్నింటినీ వానప్రస్థులు సహజంగా పూర్తి చేసేవారు. పాలకుల చేతుల్లో సరిహద్దుల రక్షణ, దండన విధానం వంటి కొద్దిపాటి చిన్న చిన్న పనులు ఉండేవి.

పరమపూజ్య గురుదేవులు ప్రస్తుత పరిస్థితిని సమీక్షిస్తూ 1974 నవంబరులో ఇలా వ్రాశారు - భారతవర్షం సర్వతోముఖ ప్రగతి విషయంలో ప్రఖ్యాతి పొందడంవెనుక గల రహస్యం ఇదే. ప్రపంచమంతా దాని ప్రతిభనుండి, ఔదార్యంనుండి పూర్తి ప్రయోజనం పొందింది. వర్ణాశ్రమ ధర్మమే ఆ రహస్యం. నేడు వర్ణాశ్రమ అనుశాసనం నశించిపోయింది. మానవ గరిమ కుంచించుకుపోయి సంకుచిత స్వార్థపరత్వంలో బందీ అయింది. చిన్న వయస్సులోనే పిల్లలు కాముక చర్యలలో ఆసక్తి చూపుతున్నారు. గృహస్థుని మానసిక, శారీరక భూమికలో రహస్యంగా, బహిరంగంగా ప్రవేశాన్ని పొందుతున్నారు. ఈ కాముక క్రియ శారీరకంగా కాకపోయినా మానసికంగా

**లోపల ఆత్మ ప్రకాశిస్తే బయటి అనుశాసనం అనవసరం.**

మరణించే క్షణంవరకు కొనసాగుతూ ఉంటోంది. ఊహ వచ్చినప్పటినుండి ఊహ కోల్పోయేవరకు జనం గృహస్థులుగానే వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు మిగిలింది ఒకే ఆశ్రమం - గృహస్థ ఆశ్రమం. మిగతా ఆశ్రమాలు మూడూ సమాప్తం అయిపోయాయి. ఇలాగే - నాలుగు వర్ణాలలో ఒకే వర్ణం జీవించి ఉంది - వైశ్య వర్ణం. వైశ్యులు జీవితమంతా ధనసంపాదన, ధన సంరక్షణ, ధన అభివృద్ధి, ధన వినియోగం అనే ఒకే ఒక విషయంపై తమ శక్తులన్నింటినీ కేంద్రీకరిస్తారు. ఎంతటి దౌర్భాగ్యం దాపురించింది! హిందూ ధర్మం ప్రాణాలతో ఉన్నమాట నిజమే. దాని అనుయాయులు కోట్లాదిగా ఉన్నారు. కానీ, ఆ మహా తత్వదర్శనం ప్రాణాన్ని కోల్పోయిందని చెప్పాలి. దాని శవం కుళ్లిపోయి పడి ఉంది. వానప్రస్థ సన్యాస ఆశ్రమాలు, బ్రాహ్మణ క్షత్రియుల తేజస్సు ఎటు పోయిందో మరి. జ్ఞాన చేతన జ్యోతిని వెలుగుతూ ఉంచే బ్రాహ్మణులూ, అన్యాయంతో పోరాడుతూ మరణించే క్షత్రియులూ ఇప్పుడు ఎంత వెదికినా ఎక్కడా కానరావడం లేదు. నాటకాలలో బూటకాలలో మునిగి, జనాన్ని ముంచుతూ భిక్షావృత్తి పరాయణులైన జనం తాము బ్రాహ్మణులమని చెప్పుకుంటున్నారు. విశృంఖలంగా విహరించే ఆతతాయిలు, అహంకారులు తాము క్షత్రియులమని చెప్పుకుంటున్నారు. కానీ, ఈ వర్ణాశ్రమాల మహత్తర బాధ్యతలను నిర్వహిస్తున్న ఉదార హృదయులైన మహామానవులు నేడు వెదకినా దొరకడం లేదు. ఇదీ మన పుణ్యభూమి దురవస్థ. ఇదీ మన కర్మ సంస్కృతి దురవస్థ. మనం వీటిని దయనీయమైన ఈ దుస్థితిలోకి నెట్టివేశాం. ప్రాచీన కాలంనాటి మన స్థితినీ, నేటి మన స్థితినీ పోల్చుకుంటే ఏడుపు వస్తుంది. సిగ్గుతో తల వంగిపోతుంది.

పరమపూజ్య గురుదేవులు ప్రజలకు పిలుపు ఇస్తూ ఇలా వ్రాశారు- "ఈ పరిస్థితిని మార్చాలి. పతనపు అంచునుండి సమాజాన్ని వెలికితీయాలి. ఈ సర్వనాశనకర భయానక పరిస్థితిని ప్రతిఘటించాలి. మన ప్రాచీన వైభవాన్ని తిరిగి పొందడానికై సాహసాన్ని ప్రదర్శించాలి. ఈ సంకల్పంతో మనం ముందడుగు వేస్తే ఒకే ఒక ప్రాథమిక అవసరం మన ముందు వచ్చి నిలుస్తుంది - సంస్కారవంతులైన ప్రజాసేవకులను పెద్ద సంఖ్యలో తిరిగి నిర్మాణం చేయడం. వానప్రస్థ అనుశాసనాన్ని తిరిగి నెలకొల్పడం. తమ జీవితాలను లోక కళ్యాణంకోసం అర్పించడానికి వయసు మళ్లిన యోగ్య వ్యక్తులకు ప్రేరణ ఇవ్వగలిగితే - ఆ సృజన సేనద్వారా మనిషిలో దేవత్వ ఆవిర్భావం, ధరిత్రిపై స్వర్గ అవతరణ అనే కలను నిజం చేయగలుగుతాము. లక్ష్యం పూర్తి కాగలుగుతుంది."

పరమపూజ్య గురుదేవులు ఈనాటి స్థితిని 1974లోనే వర్ణిస్తూ ఇలా వ్రాశారు - "ఈనాడు మనిషి పచ్చి స్వార్థపరుడు అయిపోయాడు. లోభ మోహములే అతడి లక్ష్యములు. కడుపు నింపుకోవడం, పిల్లల్ని కనడంతప్ప మరే విషయంలోనూ అతడికి ఉత్సాహం లేదు. మనస్సులో రెండే ఆకాంక్షలు ఉంటున్నాయి - ఒకటి వాసన, రెండవది తృష్ణ. ధర్మం, అధ్యాత్మ బ్రతికే ఉన్నాయి. కానీ వాటి స్వరూపం రోత పుట్టించేదిగా ఉంటోంది. ఆదర్శవాదాన్నీ, తేజస్సునూ జనింపజేసే సామర్థ్యాన్ని మనిషి పూర్తిగా కోల్పోయాడు. గ్రుడ్డి నమ్మకం, బూటకాలు, పలాయనవాదం, పరావలంబన, అకర్మణ్యత, భిక్షావృత్తి, ఊహాలోకంలోని రంగురంగుల కలలు - ఇవే నేడు ఆ రంగం సాధించిన విశేషాలు. ఈ పరిస్థితులలో ఏవిధంగా, ఏఆధారంపై, ఏవర్గం ప్రజలను ప్రజాసేవకోసం, పరమార్థ పరాయణతవైపు సాహసంతో ముందడుగు వేసేందుకు ఆహ్వానిస్తే సఫలత లభిస్తుందనే ప్రశ్న మరింత జటిలం అవుతోంది. అన్నివైపులా వ్యాపించి ఉన్నది నిరాశ అనే అంధకారమే. అయినా ఏదో ఒకటి చేయక తప్పదు. ఎక్కడి నుంచి అయినా, ఏవిధంగా అయినా దారి ఏర్పరచుకొనక తప్పదు."

పరమపూజ్య గురుదేవులు ఇందుకు మార్గదర్శనం చేస్తూ ఇలా వ్రాశారు - "ఆశ నిరాశల ఊయలలో ఊగుతూ ఉండేకన్న - భారతీయ సంస్కృతిలో ప్రాణం ఏ మూల అయినా మిగిలి ఉంటే - పోలికేక వేసి దానిని ఆహ్వానించడం అవసరమని అనిపించింది. భారత భూమి పూర్తిగా గొడ్రాలు కాలేదు, పూర్తిగా బంజరు భూమి కాలేదు. ఇందులో ఎక్కడో అక్కడ జీవకణం ఉంటుంది. ఎక్కడో ప్రాణాల స్పందన మిగిలే ఉంటుంది. దాని అస్తిత్వం మిగిలి ఉన్న చోటికి యుగం పిలుపు అందుతుంది. ఆ ఆహ్వానానికి జవాబు లభించి తీరుతుంది. సంస్కృతికి తిరిగి ప్రాణ ప్రతిష్ఠ చేసే యజ్ఞంలో తమను అధ్వర్యులుగా, ఉద్గాతలుగా మలచుకోవడానికై రెండడుగులు ముందుకు వేయవలసిందిగా సజీవమైన ఆత్మలకు పిలుపు ఇవ్వబడింది."

పరమపూజ్య గురుదేవులు సమాజపు అవసరాన్ని పేర్కొంటూ ఇలా వ్రాశారు - "నిరంతరం పతనం చెందుతూన్న, సామూహిక ఆత్మహత్య ప్రయత్నంలో నిమగ్నమైన మానవ జాతికి ఈ భూమిపై తన అస్తిత్వాన్ని నిలిపిఉంచుకునే అర్హతను కల్పించడానికి తీవ్ర కృషి నేడు అవసరం. వానప్రస్థ చైతన్యానికి తిరిగి జీవంపోయడం ఆ కృషిలో అంతర్భాగం కావాలి. సమాజ ప్రవాహాన్ని మలుపు త్రిప్పడానికై ఎందరో కర్మవీరులు అవసరం అవుతున్నారు. వారు వానప్రస్థ చైతన్యం అనే ఈ గనినుండే వెలికివస్తారు. పేరు ప్రతిష్ఠలకోసం పడిచచ్చే వాగుడుకాయ నాయకులూ, నటులూ తమ చౌకబారు కప్పిగంతుల ద్వారా చెప్పుకోదగిన సత్ఫలితాలను సాధించలేరు. ఇందుకోసం భగీరథులు, హరిశ్చంద్రులు, దధీచుల వారసత్వాన్ని అందిపుచ్చుకునే మహామానవులు అవసరం అవుతారు. ఈ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ఇప్పుడు సూర్య చంద్రులు రాకపోతే, చిన్న చిన్న దీపాలం మనం ముందుకువచ్చి కారుచీకటి సవాలును ఎదుర్కొనాలి. మన యుగ నిర్మాణ యోజన కుటుంబానికి చెందిన సద్గృహస్థులే ఆ లక్ష్యాన్ని సాధించడానికై తమ పనుల ఒత్తిడిని ప్రక్కకుపెట్టి విశ్వ మానవులకు ఉజ్వల భవిష్యత్తును నిర్మాణం చేయడానికై తమను తాము సమర్పించుకోవాలి. సరిహద్దుల రక్షణకోసం లక్షలాది వీర జవాన్‌లు నేడుసైతం ప్రాణాలు అరచేత పట్టుకొని ముందుకు వస్తూనే ఉన్నారు కదా. మరి, భావనాత్మక నవ నిర్మాణ రంగం ఎందుకు శూన్యంగా పడి ఉండాలి?"

జీవం జవం కలిగిన పరిజనులు మీరందరూ సీనియర్ సిటిజన్‌ల, వృద్ధుల గోష్ఠులు నిర్వహిస్తారనీ, పరమపూజ్య గురుదేవుల భావాలను వారికి వినిపిస్తారనీ, వారందరికీ ఆలోచించుకోవడానికి వ్యవధి ఇచ్చి, ఆతర్వాత మరోమారు వారిని వ్యక్తిగతంగా కలుసుకుని, ఆత్మీయ భావనతో శేష జీవితాన్నీ, ప్రతిభనూ, సమయాన్నీ సద్వినియోగం చేయగోరేవారి, సమాజసేవ చేయగోరేవారి పూర్తి పరిచయాన్ని, వివరాలను శాంతికుంజ్‌కు పంపుతూ ఉంటారనీ మేము విశ్వసిస్తున్నాం.

,, KKK

**క్రోధం ఒకరకమైన పిచ్చి, సత్ సంస్కారాలను నాశనం చేసే పిచ్చి.**

## మన సాంస్కృతిక వారసత్వం

# రామ రాజ్యానికి రాచబాట ఆస్తికత

ఆస్తికత మానవ సమాజ సుఖశాంతులకు మూలాధారం. అది జీవితం అంతరాళంలో ప్రవేశించి సరియైన ప్రేరణను, సరియైన మార్గదర్శనాన్ని అందిస్తుంది. వ్యక్తిగతమైన అవసరాలను పూర్తి చేయడం దగ్గర నుంచి సామాజిక కర్తవ్యపాలన వరకు కావలసిన ఆంతరిక శిక్షణ ఇచ్చేది అదే. సమాజ వ్యవస్థను, దూషితములైన మనోవృత్తులను నియంత్రిత మొనరించడానికి అంతర్దర్శనం, ఆత్మనియంత్రణం అవసరం. వాటిని ఆస్తికతయే అందిస్తుంది.

'దేవుడున్నాడు' - కేవలం ఈ మాత్రం అనుకోవడమే ఆస్తికత కాదు. ఈశ్వర సత్తాలో విశ్వాసముంచడమే ఆస్తికత కాదు. కారణం ఆస్తికత విశ్వాసం కాదు. అది ఒక అనుభూతి. 'ఈశ్వరుడున్నాడు' అన్నది బుద్ధికి సంబంధించిన ఒక నమ్మకం. ఈశ్వరుని తన హృదయంలో అనుభూతం చేసుకోవడం, ఆ ఈశ్వర సత్తాను కదలని, కదిలే జగత్తులో అంతటా చూడడం, ఆ విధమైన అనుభూతిలో రోమాంచితమగుటలు నిజమైన ఆస్తికతకు లక్షణాలు. ఆస్తికుడైన వాడు జగత్తును ఈశ్వరునిలోను, ఈశ్వరుని జగత్తులోను కలిసిపోయి ఉండడం చూస్తాడు. అట్టివాడు దేవుని తనకు వేరుగా ఉన్నవాడుగాను, తాను దేవునికి భిన్నమైన వాడుగాను అనుకోడు. ఆ విధమైన అనుభూతిని కలిగి ఉండడు. అతనికి జడ, చేతనమయమైన విశ్వమంతా పరమేశ్వర స్వరూపమే. అతనికి దేనిని చూచినా, ఎక్కడ చూసినా పరమాత్మ తప్ప మరొకటి కనిపించనే కనిపించదు.

ఆస్తికత వలన ధర్మప్రవృత్తి జాగృతమౌతుంది. ఐతే ధర్మకర్మలు చేసేవారందరూ ఆస్తికులు కాకపోవచ్చు. ఇతరులకు ప్రదర్శించుకోడానికి కూడా పలువురు ధర్మకార్యాలు చేస్తూ ఉంటారు. భగవంతుని యందు విశ్వాసాన్ని, శ్రద్ధను, భక్తిని చూపుతూ ఉంటారు. కానీ అది వట్టి మిథ్య, కేవలం ప్రదర్శన మాత్రమే. అది అవసరాన్ని బట్టి, పరిస్థితులను బట్టి, స్వార్థం కోసం ఒక వ్యక్తి యందు మనసులో లేకున్నా స్నేహాన్ని, ప్రేమను, భక్తి గౌరవాలను నటించడం వంటిది. ఆస్తికత వలన పుట్టిన ధర్మం ప్రదర్శన కాదు, నటన కాదు. అణువణువులో ఈశ్వర సత్తా అనుభూతిని అనుభవించే వ్యక్తి, ప్రేమించే వ్యక్తి నాటకమాడే సాహసమే చేయలేడు. నిజమైన ధార్మికుడు, ఎవరి ధార్మికత ఆస్తికత నుంచి పుట్టిందో అట్టి వ్యక్తి స్వతః ధర్మాచరణ కలవాడుగానే ఉంటాడు. అతడు ప్రయత్న పూర్వకంగా ఆవిధంగా ప్రవర్తించవలసిన అవసర ముండదు. ధర్మాచరణ అతని ప్రవృత్తిగా ఉంటుంది. ప్రతి జీవి తన వంటిదని, సంపూర్ణ జగత్తు పరమాత్మ స్వరూపమని భావించే వారిద్వారా పనికి రాని, అనుచితమైన, చేయకూడని పని జరగడమే అసంభవం.

ఒక్క క్షణమైనా బయటకు కనబడే విధంగా ధర్మకర్మల నాచరించక పోయినా - మనుషులను సరిగా అర్థం చేసుకుని, విలువ కట్టి, సమాజం పట్ల తన కర్తవ్యాన్ని నెరవేరుస్తూ, సర్వులను ఈశ్వర స్వరూపాలుగా భావిస్తూ, ఈర్ష్యా, ద్వేషాలను పరిహరిస్తూ, ప్రేమానుభూతులను హృదయంలో నింపుకున్నవాడే నిజమైన ధార్మికుడు, ఆస్తికుడు. ఆస్తికత మనిషిని దైవం వైపుకు మళ్లించినట్లే దైవాన్ని కూడా మనిషి వైపుకు మళ్లిస్తుంది. దాని వలన మనిషి, దేవుళ్ల మధ్య తేడా అంతమైపోతుంది. ఆస్తికుడు భగవంతుని వద్దకు, భగవంతుడు ఆస్తికుని ద్వారం వద్దకు చేరడానికి ఒకసారే బయలుదేరతారు. తన బాధ్యతను దృష్టిలో పెట్టుకుని పరమాత్మ ఆస్తికుడైన వ్యక్తిని ఎల్లప్పుడూ పనికిరాని పనులు చేయడం నుంచి కాపాడుతూ సత్కర్మలవైపు నడిపిస్తాడు. తన ఉనికిని పరమాత్మలో లీనం చేయడం వల్ల ఆస్తికునికి తన జీవితానికి సంబంధించిన సఫలత, అసఫలతల చింత ఉండదు. ఆస్తిక భావం కలగడమంటే అర్థం పరమాత్మ ఒడిలో చేరడమే. అక్కడ ఆనందమే ఆనందం.

నిజమైన ఆస్తికుడు ప్రతిప్రాణినీ తన సోదరుడిగానో, సోదరిగానో భావిస్తాడు. దాని కనుగుణంగా ప్రేమతో వ్యవహరిస్తాడు. తనతో కలిసే ప్రతి వ్యక్తి తన సోదరుడో, సోదరియో అయినపుడు వారితో కఠినంగాను, క్రూరంగాను, దొంగనాటకంతోను వ్యవహరించగలడా? అట్టివాడు అందరితో ప్రేమతోను, నిశ్చలమైన పద్ధతిలోను వ్యవహరిస్తాడు. బంధుభావనతో అతడు అందరికీ సహాయం చేయటానికి ప్రతిక్షణమూ తయారుగా ఉంటాడు. అతడెవ్వరితోను స్వార్థంతో కూడిన, అవిశ్వాసంతో కూడిన వ్యవహారమును ఎప్పుడూ చేయడు. ఈ విధంగా నిజమైన ఆస్తికుడు ఆత్మకళ్యాణ భావనకు అధికారి అవుతాడు. మనిషి మనసు

**మానవత్వం అమూల్యం. దాన్ని రక్షించుకోవడం పరమ కర్తవ్యం.**

మలినమైతే కామ, క్రోధ, లోభములన్న శత్రువులు దానిని ఆక్రమిస్తాయి. ఆస్తిక వ్యక్తిలోని ఈశ్వరీయ విశ్వాసం, దైవానుభూతులు అతని హృదయాన్ని ఉజ్వలం, ప్రసన్నం చేయడంలో సహాయకారులౌతాయి. అతని భావనలలో ప్రతి క్షణం పరమాత్మ నివాసముంటాడు. కాపాడబడిన అతడి హృదయం మీద ఆసురీ ప్రవృత్తులు ఆక్రమణ చేయలేవు.

ఆస్తికత సదాచారానికి తల్లి. ఎవడు ఆస్తికుడో, ఎవడు అందరిలోను అన్నిచోట్లా భగవంతుని దర్శిస్తాడో అట్టి వ్యక్తి ఏ విధమైన దురాచారానికీ సాహసించడు. నిరంతరం అతడు నిజమైన ఆస్తికుడుగా, ఈశ్వరునికి అనుయాయిగా అటువంటి పనులనే చేస్తూ అట్టి భావాలతోనే ఉంటాడు. ఈశ్వరీయ నిర్దేశాలు, ఆదర్శాలు అయిన సత్యం, శివం, సుందరాలు తప్ప మరేవీ అతడిలో ఉండనే ఉండవు. ప్రేమ, సానుభూతి, సహకారం, సత్యం, సేవాభావం ఆస్తికునికి ఉండే విశేష గుణాలు. మోసం, దొంగనాటకం, ఈర్ష్యా ద్వేషాలు, లోభ, మోహ, కామాది దూషిత ప్రవృత్తులతో ఆస్తికునికి ఏ విధమైన సంబధం ఉండదు. ఆస్తికత ద్వారా భగవంతునితో భావనాత్మకమైన సంపర్కం పెట్టుకున్న వ్యక్తి దానికనుగుణంగానే తన జీవితాన్ని ఉన్నతంగా, ఉత్కృష్టంగా తయారు చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఈనాడు జగత్తుకు శాంతి, చక్కని అమరిక, సహకార భావనల అవసరముంది. అవి ఆస్తికత వల్లనే లభిస్తాయి.

లోకంలోని ప్రతి వ్యక్తి సంపూర్ణంగా ఆస్తికుడై దైవ ఆదర్శాలతో నడవగలిగితే ఒకరినొకరు సతాయించడం గాని, వంచించడం గాని ఉండదు. ప్రతి వ్యక్తి తన హద్దుల్లో ఉండి, సంతృప్తితో శాంతియుతంగా జీవిస్తాడు. నేడు లోకంలో వ్యాపించిన అన్నిరకాల అనాచారాలకు కారణం ప్రతి మనిషి స్వార్థపరుడు కావడం, ఇతరుల సుఖ సౌకర్యాలను పట్టించుకోకపోవడమే. నేడు ఆస్తికత విరివిగా ప్రచారం చేయబడితే, లోకులు నిజంగా ఈశ్వరుని తెలుసుకుని ఆరాధిస్తే, దైవభీతి కలవారయితే - రేపే అపరాధులందరి అంతం జరుగుతుంది. కలకాలంగా కలలు కన్న రామరాజ్యం ప్రత్యక్షమౌతుంది.

L L L

## విద్యాసాగర్ విలక్షణ ప్రతిభ

**విద్యాసాగర్ తండ్రి మూడు రూపాయల నెల వేతనానికి పని చేసేవాడు. ఒకవైపు అసమర్ధత, మరొకవైపు విద్యపట్ల పిల్లవాని ఆసక్తి - ఈ రెండింటితో తండ్రి హృదయం తల్లడిల్లేది. తండ్రి బాధను గమనించిన విద్యాసాగర్, తన చదువుకు తానే మార్గాన్ని అన్వేషించాలనుకొన్నాడు. బడికి వెళుతున్న పిల్లలతో స్నేహంచేసి వారి పుస్తకాల సహాయంతో విద్యాభ్యాసం ప్రారంభించాడు. నేలమీద బొగ్గుతో వ్రాసి చదువుకొంటున్న కొడుకు ఆసక్తికి తండ్రి హృదయం ద్రవించింది, స్తోమత లేకపోయినా ఎలాగోలా కష్టపడి చదివించాలని గ్రామంలోని పాఠశాలలో చేర్పించాడు. గ్రామ పాఠశాలలోని పరీక్షలన్నిటిలో విద్యాసాగర్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై ప్రజలను ఆశ్చర్యచకితుల్ని చేశాడు.**

**తరువాతి చదువుకు ఆర్థిక పరిస్థితులు ఏమాత్రం కలిసిరావని, మోయలేని భారాన్ని మోసి తండ్రి క్రుంగి పోతున్నాడని గుర్తించిన విద్యాసాగర్ తల్లితండ్రుల నుండి ఆశీర్వాదాన్ని మాత్రం కోరి, పై చదువుకు తన దారి తాను ఏర్పరచుకొన్నాడు. విద్యాసాగర్‌ను తండ్రి కలకత్తాలోని సంస్కృత విద్యాలయంలో చేర్పించి వదిలివేశాడు. తన దీక్ష, ప్రతిభ, పరిశ్రమ, సేవ వంటి శుభ లక్షణాలతో విద్యాసాగర్ గురువులను అత్యంత ప్రభావితుల్ని చేశాడు. ఫీజు అవసరం లేకుండానే అతని చదువు సాగిపోసాగింది. స్నేహితుల, ఆత్మీయుల సహకారంవల్ల పుస్తకాల సమస్య ఎప్పుడూ రాలేదు. ఖాళీ సమయంలో కూలి పనిచేసి మిగిలిన అవసరాలు తీర్చుకొనేవాడు.**

**ఇంతటి అభావగ్రస్త పరిస్థితులలో కూడా విద్యాసాగర్ విద్యపట్ల ఎంతటి కృషి చేశాడంటే - 19వ సంవత్సరంలో అడుగు పెట్టేసరికి ఆయన వ్యాకరణం, సాహిత్యం, స్మృతి, వేద శాస్త్రాలలో అపారమైన పాండిత్యాన్ని సంపాదించాడు. ఈ బాలుడు తరువాత ఈశ్వరచంద్ర విద్యాసాగరుడుగా విశ్వ విఖ్యాతి నొంది తన పేరును సార్థకం చేసికొన్నాడు.**

**- ప్రజ్ఞాపురాణం నుండి**

**అందరినీ మంచి చేసుకోవాలంటే చెడు అలవాట్లను వదులుకోవాలి.**

## బోధకథ

# కళాకారుని అంతఃకరణ ఒక నిర్మల సరోవరం

మహారాజు మండిపడుతూ కుమారుడి చెంపమీద బలంగా కొట్టాడు. ఐదేళ్ల రవి ఆ దెబ్బకు తట్టుకోలేక కళ్లు తిరిగి క్రింద పడిపోయాడు. మహారాజు మండిపడడం, కోప్పడడం, రవిని కొట్టడం అన్నీ వింటూనే ఉన్నది రాణి. ఆమె పరదా వెనుక ఏదో పనిలో నిమగ్నమై ఉన్నది. రవి క్రింద పడగానే ఆమె మాతృ హృదయం తల్లడిల్లి పోయింది. ఇక ఆగలేక పరిగెత్తుకుని వచ్చింది. మహారాజుగారి గంభీర వదనం చూడగానే అడుగు ముందుకు పడలేదు. ఆమెను చూస్తూనే మహారాజు తీక్షణ స్వరంతో ఆదేశమిచ్చాడు. - "రవితో ఎవరూ మాట్లాడరాదు".

బిడ్డ చేసిన తప్పేమిటో ఆమెకు అర్థం కాలేదు. సున్నితమైన వాడి మనసు ఆమెకు బాగా తెలుసు. వాడు అల్లరివాడు కాదు. ఎవరినీ నొప్పించడు. దేనికీ ఇబ్బంది పెట్టడు. ఆ విషయం కూడా తెలుసు. కేవలం ప్రకృతి దృశ్యాలు, దేవీదేవతల చిత్రాలు చూసి ముగ్ధుడౌతాడు. తన్ను తాను మరిచిపోతాడు. అంతే. అప్పుడప్పుడు మట్టితో, సీమ సున్నంతో అలాటి చిత్రాలే గీయాలని ప్రయత్నం చేస్తుంటాడు. బాల్యచాపల్యంతో వేసిన ఈ చిత్రాలలో కూడా హృదయ సంవేదన తొణికిసలాడుతూ ఉంటుంది.

అతడిలోని ఈ ప్రవృత్తి మహారాజుకు ఎంత మాత్రం ఇష్టం ఉండదు. ఈ రోజు కూడా ఇందువల్లనే ఆయన వ్యాకులుడైనాడు. మేడమీద తిరుగుతూ ఆయన ఆలోచించసాగాడు. రవిని బాగు చేయడానికి తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు. అతడొక సైనికుడు కావాలని తన కోరిక. వీరాధి వీరుడైన సైనికుడు కావాలని. కాని ఆ బుడతడు తన మాట ఖాతరు చేయడం లేదు. మనసు మార్చుకోవడం లేదు. మహారాజు దీర్ఘంగా నిట్టూర్చాడు.

గదిలోకి వచ్చి సింహచర్మపు ఆసనం మీద కూర్చున్నాడు మహారాజు. రవికి ఎవరితోనైనా నచ్చచెప్పించాలన్న ఆలోచన కూడా వచ్చింది. మళ్లీ ఇలా అనుకున్నాడు. విధివ్రాతను తప్పించడం ఎవరితరం? పరిపరివిధాల ఆలోచించాడు. చివరకు అతని పితృ హృదయం కొడుకు పట్ల సానుభూతితో నిండిపోయింది. ఆసనం మీద నుండి దిగ్గున లేచాడు. పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ రవి దగ్గరకు వెళ్లాడు. ఇప్పుడాయన చేయి కుమారుడి తల నిమరసాగింది. ఈ రోజు జరిగిన సంఘటన వల్ల మహారాజుకు మానసికంగా ఎంతో బాధ కలిగినప్పటికీ మనసులోని మరో కోణం నుండి ఇలా అనిపించసాగింది : 'ప్రతి మనిషికీ తనదంటూ ఒక మౌలికత ఉంటుంది. వ్యక్తి అభిరుచులు,ప్రవృత్తులు,సంస్కారాలే అతడి జీవన దిశను నిర్ణయిస్తాయి. మిగతావన్నీ కేవలం వాటి పరిశోధన, పరిమార్జనల్లో సహాయకారులౌతాయంతే. కాబట్టి ఇకనుండీ నేను రవి విషయంలో నిరంకుశంగా వ్యవహరించకూడదు. అతడి ఇష్టప్రకారం, అతని మనసుకు నచ్చినట్టు పోనివ్వడమే మేలు.' ఆ ప్రకారం నిశ్చయించుకున్నాడు మహారాజు.

రవి పినతండ్రి రాజవర్మ కళాప్రవృత్తి కలవాడు. బాలుడైన రవి నేలమీదా, గోడల మీదా, ఆవరణలో ఎరుపు - పసుపు రంగులతో చిత్రాలు గీస్తుంటే రాజవర్మ అతనిని కోప్పడడం, అదిలించడం లాంటివి చేసేవాడు కాదు. ఆనందించేవాడు. రవి తన బొమ్మలు చూసుకుని చప్పట్లు కొట్టి మురిసిపోతుంటే, రాజవర్మ కూడా పిల్లవాడితో పాటు సంతోషంగా గంతులు వేసేవాడు.

రాజవర్మ స్వయంగా మంచి చిత్రకారుడు. అంజోర్ కళలో ఆరితేరిన వాడుగా ఆయనకు పేరు ప్రఖ్యాతులున్నాయి. ఈ కళను ఆయన అంజోర్ కళా పోర్ట్రెట్ చిత్రకారుడు అలవిరీ నాయుడు దగ్గర నేర్చుకున్నాడు. రవి తల్లి అంబాబాయి కూడా మంచి చిత్రకారిణి. రవిలో గొప్ప చిత్రకారుడు అయ్యే లక్షణాలున్నాయని రాజవర్మ అంబాబాయితో అంటుండేవాడు. ఆ మాటలు విన్నపుడు ఆమె ఆనందంతో ఉప్పొంగిపోయేది.

ఈ వర్మ కుటుంబం కేరళ రాష్ట్రంలోని "కిలమనూర్" అనే గ్రామంలో ఉండేది. అది చెప్పుకోదగ్గ పెద్ద ఊరేమీ కాదు. కానీ ఈ వర్మ కుటుంబీకుల వలన దాని ఖ్యాతి దూరదూర ప్రాంతాలకు వ్యాపించింది. దానికి కారణం ఏమిటంటే తిరువాన్కూరు రాజ కుటుంబ కన్యల వివాహానికి ఈ వర్మ వంశస్థులలోని వారినే ఎన్నుకుంటారు. అందుకని ఈ కుటుంబ సభ్యులను కూడా రాజాలనే సంబోధిస్తారు. ఆ రోజుల్లో తిరువాన్కూరుకు తిరువనంతపురం రాజధానిగా ఉండేది. రాజధాని కావడాన ఆ నగరం కళలకు, ప్రగతి, సమృద్ధి మొదలైన వాటికి ముఖ్యకేంద్రంగా భాసిల్లింది.

రవిలోని చిత్రకళను మరింతగా నిగ్గు తేల్చడానికి రాజవర్మ అతడిని తనతో పాటు తిరువనంతపురం తీసుకువెళ్లాడు. అప్పటికి రవి వయస్సు పధ్నాలుగు సంవత్సరాలు. ఇన్ని రోజులూ అతడు పినతండ్రి సహాయంతో ఉత్తమ కళను సాధన చేస్తూ వచ్చాడు. ఇప్పుడు రాజవర్మను కూడా మించిపోయి అద్భుతమైన చిత్రాలు గీయసాగాడు. రాజా రాజవర్మకు తిరువాన్కూరు రాజ దర్బారులో గౌరవ ప్రదమైన

**నిజాయితీ, భగవానుడూ మనిషికి నిజమైన మిత్రులు.**

స్థానం ఉన్నది. మాటల సందర్భంలో ఆయన మహారాజుతో తన అన్నకొడుకు గొప్పదనం గురించి చెప్పాడు. మహారాజుకు మొదట నమ్మకం కుదరలేదు. పద్నాలుగేళ్ల వయసులోనే చిత్రకళలో అంత నిపుణత ఎలా సంపాదించగలిగాడో ఆయనకు అర్థం కాలేదు. ఆయనకు నమ్మకం కలగడానికి రాజవర్మ రవి వేసిన కొన్ని చిత్రాలు ఆయనకు చూపించాడు.

ఆ చిత్రాలను చూసి మహారాజు ఎంత ప్రభావితుడయ్యాడంటే, వెంటనే రవిని చూడాలన్న కోరికను వెలిబుచ్చాడు. దర్బారులో రవికి రాచమర్యాదలు జరిగాయి. ఆ సంతోషంలో తెలియకుండా రోజులు గడిచిపోసాగాయి. కానీ, దర్బారులోని ఇతర చిత్రకారులకు తనపై అసూయా ద్వేషాలు కలుగుతున్నట్లు అతడికి నెమ్మదిగా అనుభవం కాజొచ్చింది. దీనిని తొలగించడం చాలా కష్టమైన పని. ఒక్కోసారి మహారాజు కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోవలసి వస్తున్నది.

రామస్వామినాయుడు అనే చిత్రకారుడు వారిలో ఒకడు. దర్బారులో ఆయన కళకు మంచి చమక్కు ఉన్నది. అంత గొప్ప కళాకారుడైనా మనసులో వికృతమైన ద్వేషం నిండి ఉండేది. కళ అతడికి పేరుప్రఖ్యాతులు తెచ్చిపెట్టే సాధనమయిందే కాని భావ ప్రవృత్తికి సంబంధించినది కాలేకపోయింది. రవి తరచుగా అతడి ద్వేషానికి గురికావలసి వచ్చేది. మహారాజుకు దగ్గరి చుట్టం అవడం వలన కావాలనుకుంటే రవి ఈ విషయం ఆయనకు ఫిర్యాదు చేయవచ్చు. శిక్ష పడేలా కూడా చేయవచ్చు. కానీ సున్నితమైన అతడి కళాహృదయం అందుకు సమ్మతించేది కాదు. ఇతర కళాకారుల అత్యాచారాలను అతడు మౌనంగా సహిస్తుండేవాడు. తన కళాసాధనను మాత్రం ఏ పరిస్థితిల్లోనూ కుంటుపడనివ్వలేదు. అది రోజురోజుకు అభివృద్ధి చెందసాగింది.

రవిలోని కళ బాహ్య పరిస్థితులకు చెందినది కాదు. అది దైవదత్తమైనది. భారతీయ దైవీ భావనలను అందరి హృదయాలలో ప్రతిష్ఠించాలన్నదే అతడి ధ్యేయం. పురాణ కథలు, గాథలు అతడి చిత్రాలకు విషయాలు. తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఒక లలిత కళా ప్రదర్శనంలో రవివర్మ చిత్రాలను కూడా ప్రదర్శించారు. ప్రేక్షకులు వాటిని చూసి శిలా ప్రతిమల్లా నిలబడిపోయారు. ఆనంద లోకాల్లో విహరిస్తున్నట్టు అద్భుతమైన అనుభూతిని పొందారు. తోటి చిత్రకారులు కూడా అతడిని అభినందించకుండా ఉండలేకపోయారు. వారు తమలోని అసూయకు తామే సిగ్గుపడ్డారు.

1866లో మహారాజు తన సోదరిని రవివర్మ కిచ్చి వివాహం చేశాడు. అప్పటి నుండి అతడు రాజా రవివర్మగా పిలువబడసాగాడు. ఆ రోజుల్లోనే "థియోడోర్ జాన్సన్" అను ఒక ఆంగ్లేయ చిత్రకారుడు తిరువనంతపురం వచ్చాడు. ఆ చిత్రకారుడు చిత్రకళలోని ఒక ప్రత్యేకమైన శైలిలో సిద్ధహస్తుడు. రాజా రవివర్మ ఒకరోజు ఆ విదేశీ చిత్రకారుడి చిత్రశాలకు వెళ్లాడు. అతడి కళాకౌశల్యం చూసి అప్రతిభుడయ్యాడు. ఆ పద్ధతి నేర్చుకోవాలన్న కోరిక అతడికి బలంగా కలిగింది. కళలోని ఆ విశిష్ట శైలిని తనకు నేర్పమని ఎంతో వినయపూర్వకంగా కోరాడు రవివర్మ. కానీ జాన్సన్‌కు తన పద్ధతి పట్ల విపరీతమైన గర్వం. అందులో తనకు పోటీగా మరొకరుండరాదన్నది అతని భావన. అందుచేత అతడు రవివర్మ కోరికను నిర్మొహమాటంగా తిరస్కరించాడు. రవివర్మ కావాలనుకుంటే మహారాజు చేత ఆదేశం ఇప్పించవచ్చు. కానీ అలా చేయడం అనుచితంగా అతడు భావించాడు. ఎవరి మీదా ఒత్తిడి తేవడం అతడి సున్నిత మనస్తత్వానికి విరుద్ధం కదా! అతడు మరొక ఉపాయం ఆలోచించాడు. ఈసారి జాన్సన్‌తో మరింత వినమ్రంగా - 'మీ కళ నేర్పకపోతే పోనీ, మీరు చిత్రాలు గీసే సమయంలో నేను చూడడానికి అంగీకరించండి' అని అడిగాడు. జాన్సన్‌కు అందులో అభ్యంతరం చెప్పడానికేమీ కనపడలేదు. అప్పుడు కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ సరే అన్నట్లు తల ఊపాడు తప్ప ఏమీ మాట్లాడలేదు. రాజా రవివర్మ అదేమీ పట్టించుకోలేదు. తనకు కావలసింది విద్య. జాన్సన్ ప్రత్యేక శైలిలోని సూక్ష్మత, అతని ప్రతిభలోని ప్రఖరత, నిరంతర పరిశ్రమలోని పూనిక అతడు లోతుగా పరీక్షించసాగాడు. మనిషి వ్యక్తిత్వం అపరిమితమైన సామర్థ్యములకు భాండాగారమని అతడి నమ్మకం. ఏకాగ్రత, నిరంతర కృషి ఉన్నపుడు ఏ మనిషికైనా అసాధ్యాలు, అసంభవాలు అంటూ ఉండవని అతడి విశ్వాసం. ప్రతిరోజూ జాన్సన్ స్టూడియోకు వెళుతున్నాడు. గంటల కొద్దీ ఒకేచోట కలిసి ఉన్నా జాన్సన్ రవివర్మతో ఒక్క మాట కూడా మాట్లాడేవాడు కాడు. అది అతడి జాత్యహంకారం కావచ్చు. స్టూడియోలో నిశ్శబ్దం ఆవరించి ఉండేది. అది రవివర్మకు లాభదాయకమే అయింది. గాఢ తన్మయత్వంతో జాన్సన్ బ్రష్ కదలికలను, రంగుల మేళవింపును చూస్తూ అందులోని ప్రత్యేకతను అతడు గుర్తించసాగాడు. కొంతకాలం తర్వాత జాన్సన్ తన దేశానికి తిరిగి వెళ్లిపోయాడు. అయినా రవివర్మ చాలాకాలం వరకు ఆ నూతన విద్యను సాధన చేశాడు.

ఇప్పుడు ఆయన చిత్రకళలో అనేక క్రొత్త పోకడలు ప్రకటితమవసాగాయి. ముగ్ధమనోహరమైన ఈ చిత్రకళా రహస్యం తెలుసుకోవాలని చాలామంది ప్రయత్నం చేశారు. రవివర్మ జవాబుగా చిరునవ్వు నవ్వుతూ, ప్రశ్న వేయవలసింది కళా సఫలత గురించి కాదు. కళారంగంలో అయినా, జీవితంలోని మరో రంగంలో అయినా సఫలత సాధించడానికి మూల సూత్రం ఒక్కటే : వ్యక్తి తన సమస్త శక్తులను ఒకే లక్ష్యంపై కేంద్రీకరించడం - అనేవాడు. అయితే దారిలో ఎన్నో అడ్డంకులు, అవరోధాలు ఎదురవుతాయి కదా! అప్పుడెలా?

**ఉన్నతంగా, ఉదాత్తంగా పని చేసే ఉత్సాహం పొంగిపొరలేదే నిజమైన జీవితం.**

అన్న ప్రశ్నకు సమాధానం మరింత ఇంపుగా ఉండేది. సంకల్పం దృఢంగా ఉంటే, నిరంతర కృషి దానికి తోడైతే ఎన్ని అవరోధాలు ఎదురైనా ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా అవి ప్రవాహంలో కొట్టుకుపోతాయే తప్ప కార్యసాధనకు అడ్డంకులు కావు - అనేవాడు.

కళాసాధనలో రవివర్మకున్న తన్మయత్వం అన్ని అవరోధాలను ఎదుర్కొని ముందుకు సాగింది. 1876లో తిరువాన్కూరులోని ఆంగ్లేయ రెసిడెంట్ మద్రాస్‌లో ఏర్పాటైన రవివర్మ లలిత కళా ప్రదర్శనం చూశాడు. అందులో "సింగారించుకుంటున్న ఒక నాయర్ స్త్రీ" చిత్రం ఉన్నది. ఆ చిత్రంలో స్త్రీలోని సున్నితమైన, స్పందన శీల భావాల అద్భుత చిత్రీకరణ ఎంత మనోహరంగా ఉందంటే ఆయన దాని నుంచి చూపు తిప్పుకోలేక పోయాడు. ఆ చిత్రానికి ఆయన తరపున ప్రథమ బహుమతిగా స్వర్ణ పతకం లభించింది. ఆయన కోరికపై రవివర్మ ఇదే చిత్రాన్ని వియన్నాలోని లలితకళా ప్రదర్శనానికి పంపించాడు. అక్కడ ఈ చిత్రానికి భూరి భూరి ప్రశంసలు లభించాయి. ఈ విజయాల ప్రోత్సాహంతో, ప్రేరణతో రవివర్మ అలంకరించుకుంటున్న తమిళ స్త్రీ చిత్రం వేశాడు. ఈ రెండు చిత్రాలు ప్రిన్స్ ఆఫ్ వేల్స్ తిరువనంతపురం వచ్చినపుడు ఆయనకు బహుమతిగా ఇవ్వబడ్డాయి.

తైలవర్ణ చిత్రాలలో పూర్తి నైపుణ్యం సంపాదించిన తర్వాత రాజా రవివర్మ తన దృష్టిని భారతీయ పౌరాణిక గాథలపై కేంద్రీకరించాడు. మానవుడిలో దైవత్వాన్ని ప్రోత్సహించే అంశాలన్నీ మన దేశపు వైదిక - పౌరాణిక వాఙ్మయంలో ఉన్నాయని ఆయన నమ్మకం. కనుక వాటి పట్ల ఆయనకు పూజ్య భావం ఉండేది. 'ఏ దేశమైనా, ఏ సమాజమైనా తన పూర్వ వైభవాన్ని మరిచిపోకూడదు. కళ ద్వారా ఈ దైవతత్వాలను సహజ సుందరంగా ఆవిష్కరించడమే నా లక్ష్యం' - అని అంటాడాయన.

రాజా రవివర్మలోని చిత్రకళ అతి సహజమైనది. ఆయన మనసు సంవేదనతో నిండిన నిర్మల సరోవరం. అందులో ప్రాకృతిక సౌందర్యం, దైవీభావం స్పష్టంగా ప్రతిబింబించడాన్ని మనం చూస్తాము. ఈ నైర్మల్యం ఆయనకు గొప్ప చిత్రకారుడుగా కీర్తిని సంపాదించిపెట్టింది. చూస్తూండగానే ఆయన పేరుప్రఖ్యాతులు దేశం నలుమూలలా వ్యాపించాయి. రోజురోజుకు ఆయన చిత్రాలు కోరేవారి సంఖ్య పెరిగిపోసాగింది. వాటిని పూర్తి చేయడం కోసం రవివర్మ బొంబాయిలో "ఆర్లియోగ్రాఫిక్" అను పేరుతో ఒక ప్రెస్సు స్థాపించాడు. రవివర్మ చిత్రాలు లేని భారతీయుల గృహాలు లేవంటే అతిశయోక్తి కాదు. ఆయన వేసిన పౌరాణిక చిత్రాలు ఎంత భావ పూర్ణంగా, ఆకర్షవంతంగా ఉంటాయంటే - రవివర్మ మాకు సాక్షాత్తు దేవతల దర్శనం చేయించాడని ఎంతో భక్తి భావంతో ప్రతివ్యక్తి కొనియాడతాడు. 1906 అక్టోబరు 5న ఆ మహానుభావుని దివ్య వ్యక్తిత్వం దైవ చేతనలో ఏకమైపోయింది.

ఐదు సంవత్సరాల వయసులో ఏ సహజ సంవేదన, శీల స్వభావం వలన దెబ్బలు తినవలసి వచ్చిందో ఆ స్వభావం, ఆ కళా ప్రకృతి అతడిని ఒక మహా విభూతిగా ప్రతిష్టించింది. తన నిజ ప్రకృతిలోని మౌలికతను గుర్తించి దానిని కళాత్మకంగా రూపకల్పన చేసుకోగలిగినట్లయితే, ప్రతివ్యక్తి జీవితం శతాధికంగా, సహస్రాధికంగా వికసితమవుతుందన్న మాట అక్షర సత్యం.

అనువాదం : విజయకుమారి.

## తన భాగ్యవిధాత తానే

**మనిషి తన భాగ్యవిధాత తానే. నేడు మన చుట్టూ ఉన్న పరిస్థితులు మంచివైనా, చెడ్డవైనా అలాంటి పరిస్థితులు ఏర్పడడంలో ప్రముఖ పాత్ర వహించినది మనమేగాని, ఎవరో ఎంతమాత్రం కాదు.**

**ఒక శ్రామికుడు రాళ్లు కొట్టి కొట్టి అలసిపోయి, మరొక పెద్ద ఆసామిని పట్టుకొంటే ఇంతకంటె తక్కువ శ్రమతో ఎక్కువాదాయం పొందవచ్చునని ఆలోచించసాగాడు. ఆ ఆలోచనలతో అతడు పర్వత శిఖరాన్ని చేరి అక్కడ కొలువైఉన్న దేవతను తన కోర్కె తీర్చమని యాచించసాగాడు. ఆమె ఎంతకూ పలకటం లేదని, మరికాస్త పెద్ద దేవతను ఆరాధిస్తే బాగుంటుందని అనుకొన్నాడు. పెద్ద ఎవరని ఆలోచించగా, ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడేనని తోచింది. సూర్యారాధన మొదలుపెట్టాడు. ఒకనాడు ఆకాశం మేఘావృతమై మేఘాలు సూర్యుణ్ణి కప్పివేశాయి. దానితో అతడు సూర్యునికంటే మేఘాలు గొప్పవని భావించి మేఘాలను ప్రార్థించసాగేడు. అనతి కాలంలోనే అతనికి మేఘాలు పర్వతాన్ని ఢీకొని సమాప్త మౌతున్నాయనే సంగతి గోచరించింది. అందువల్ల పర్వతాలను భజించసాగేడు. క్రమంగా రోజూ తన గొడ్డళ్ళతో ముక్కలు చేయబడుతున్న ఈ పర్వతంకంటే తానే గొప్పవాడనే సంగతి స్ఫురణకు వచ్చింది. వెంటనే ఆలోచనా విధానం మారిపోయింది. తన పురుషార్థంతో స్వల్పకాలంలోనే ప్రముఖ వ్యక్తులలో ఒకడుగా గుర్తించబడే స్థాయికి చేరుకొన్నాడు.** -

**ప్రజ్ఞాపురాణం నుండి**

వ్యక్తి ఔన్నత్యానికీ,సామాజిక శాంతికీ ఆధారాలు సజ్జనత్వం,సదాచారం.

## వ్యక్తి నిర్మాణం

# కృతజ్ఞత ఒక దైవీ గుణం

సద్గుణాలన్నిట్లోకి కృతజ్ఞతా భావం శిరోమణి. కారణం - ఉపయోగ కరమైన వస్తువులన్నిటి వల్లా మనం లాభం పొందుతున్నాం. వాటివల్ల పొందిన ప్రయోజనాన్ని గుర్తుంచుకోవాలి. దానికి బదులివ్వాలనే కోరిక దానంతటదే కలుగుతుంది. ఆ వ్యక్తికి గాని, వస్తువుకు గాని, వర్గానికి గాని ఏదో చేయాలనే కోరిక ఉంటుంది.

మనం చేసే సేవ వల్ల అహంకారం కలగవచ్చు. కాని మనం పొందిన దానికి బదులు కృతజ్ఞతగా ఏదో సేవ చేస్తున్నామనే భావన కలిగితే అది నమ్రత, నిరహంకారం అనిపించుకుంటుంది. దానితో పాటు ఇతరుల వల్ల మనం పొందిన ఉపకారాన్ని గుర్తుంచుకుంటే ఎందరి వల్ల ఎంతటి సహకారం పొందితే ఈ స్థితిలో ఉన్నామో గుర్తుంటుంది. అటువంటపుడు ఋణవిముక్తి భావనతో చేసే సేవ లేదా కృతజ్ఞతాభావం ఉన్నత శ్రేణికి చెందినది.

పరమార్థ కృత్యాల్లో కలసి ఉన్న భావనలకు గొప్ప మహత్తు ఉన్నది. తిరస్కార పూర్వకంగా, మొక్కుబడిగా, పేరు ప్రతిష్ఠల నిమిత్తం, ప్రతిఫలం కోరుతూ, మోసపూరితంగా దానం చేయటం సాధారణంగా కనిపిస్తుంటుంది. ఆత్మలాభం లేదా పుణ్యఫలం కోరి చేయడమైనా జరుగుతుంటుంది. చూస్తుంటే పిట్టల్ని కొట్టేవారు, చేపల్ని పట్టేవారు కూడా గొప్ప దానకర్ణులుగా పోజులు పెడుతున్నారు. వారి ఉద్దేశ్యం వేరుగా ఉంటుంది. కాని విశ్లేషణ చేసేవారి ఉద్దేశ్యానికే ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. తోడుగా ఆత్మ, పరమాత్మల దర్బారులో గూడా వారి పరిగణన భావస్థాయికి అనుగుణంగానే ఉంటుంది. అందువల్ల పరమాత్మ కృత్యాలను చేసే సమయంలో ఎటువంటి కోరిక ఉండకూడదు. ఈశ్వరుని యెడ సమర్పణా భావం మాత్రమే ఉండాలి. ఈ భావన ఈ క్రింది దోహాలో కనిపిస్తుంది.

**మేరా ముఝ్‌కా కుఛ్ నహీ, జో కుఛ్ హై సో తోర్ ।**
**తేరా తుఝ్‌కో సౌంప్‌తే, క్యా లాగత్ హై మేర ।**

కృతజ్ఞతా స్మరణలో ప్రత్యక్షంగా కనిపించేది పితృఋణం. శరీరాన్ని వారే పెంచారు, పోషించారు, యోగ్యుని చేశారు. వారి ప్రత్యక్ష సేవ వల్లనే మనం ఇలా యోగ్యులుగా ఉన్నాం. దివంగతులైన పితరులకు శ్రాద్ధ తర్పణం చేసే ఆనవాయితీ ఉన్నది. కాని శ్రద్ధాంజలి పూజా,ఉపచారాల సరళతమమైన ప్రయోగం. ఇతర ఉపచారాలలో వస్తువుల అవసరం ఉంటుంది. అవి ఒకప్పుడు దొరకవచ్చు, దొరకకపోవచ్చు. కాని జలం మనకు ఎక్కడైనా లభిస్తుంది. అందువల్ల పుష్పాంజలి వంటి శ్రద్ధాంజలులలో జలాంజలి సర్వసులభమైనదిగా గుర్తించాలి. దాని ప్రయోగంలో అలసత్వం,అశ్రద్ధ లేకుండా చూచుకోవచ్చు.

అందువల్ల సూర్యనారాయణునికి అర్ఘ్యం, తులసీ వృక్షంలో జలదానం, అతిథులకు అర్ఘ్యం, పితృ గణాలకు తర్పణ విధానం ఉన్నాయి. వారికి జలం ఆవశ్యకత ఉన్నదా లేదా అన్నది కాదు ప్రశ్న. ప్రశ్న కేవలం తన అభివ్యక్తి గురించినది. దానిని నిర్ధారితమైన మంత్రం చదువుతూ గాని, గాయత్రీ మంత్రం చదువుతూ గాని,మంత్రం లేకుండానైనా గాని ఇవ్వవచ్చు. ఇది వారియెడ సులభతరమైన అర్చా విధానం. శాస్త్రీయ పరిభాషలో దీనికి తర్పణమని పేరు. ఈ తర్పణం పూర్వజులకు చెందుతున్నదా,లేదా అని గుంజాటన పడవద్దు. కేవలం మన శ్రద్ధను వ్యక్తం చేయటం ముఖ్యం.

పితృ ఋణం తీర్చుకోటానికి మరో కృత్యం ఉన్నది శ్రాద్ధమని. శ్రాద్ధం బ్రాహ్మణ భోజనానికే పరిమితమవుతున్నది. కాని అది సరిగాదు. తమ సాధన సంపత్తిలో ఒక అంశను పితృ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని లోక కళ్యాణానికి ఉపయోగించాలి.

అటువంటి శ్రాద్ధకృత్యంలో వృక్షారోపణ బ్రాహ్మణ భోజనం కన్న మిన్న. అందువల్ల ప్రాణులకు ఎంతో ప్రయోజనం కలుగుతున్నది. సేద్యానికి పనికి వచ్చే సారవంతమైన భూమిని ఎంపిక చేసుకుని మామిడి, రావి,ఉసిరి,అశోకాది వృక్షాలను నాటాలి.

వృక్షాలు వాయువును శుద్ధి చేస్తాయి. నీడనిస్తాయి. పచ్చి ఆకులు జంతువులకు ఆహారంగా పనికివస్తాయి. ఎండు ఆకులు ఎరువుగా పనికి వస్తాయి. కట్టెలు ఎంతగానో ఉపయోగిస్తాయి. వృక్షాల వల్ల వర్షాలు కురుస్తాయి. పక్షులు గూళ్ళు కట్టుకోటానికి, మనుషులు, పశువులు విశ్రాంతి తీసుకోటానికి పనికి వస్తాయి. ఈ విధంగా చెట్లను పెంచటం ప్రాణికోటికి సేవ చేయటంతో సమానం. అలాగే చెరువులు త్రవ్వించవచ్చు. బావులు త్రవ్వించవచ్చు. చెరువుల వల్ల అంతటా నీటి మట్టం పెరుగుతుంది. పశువులకు నీటి సమస్య తీరుతుంది. త్రవ్విన మట్టి గృహ నిర్మాణానికి ఇతర ప్రయోజనాలకు పనికి వస్తుంది. చెరువులో తామర,కలువ పూలు పూయిస్తే ఆహ్లాదకరంగా ఉంటుంది.

ఈ విధంగా సమాజ సేవా కార్యాలతో జీవించిఉన్న లేదా దివంగతులైన పితృగణం నిశ్చయంగా ప్రసన్నులవుతారు. కృతజ్ఞతా భావంతో ఈ విధంగా చేయటం వల్ల పుణ్యాం,పరమార్థం కూడా ప్రత్యక్షంగా లభిస్తాయి.

అనువాదం : డి.వి.ఎన్.బి.విశ్వనాథ్

G G G

**బాధలను, వైఫల్యాలను అధిగమించి లక్ష్యం వైపు సాహసంతో పురోగమించడమే గొప్పతనం.**

## కుటుంబ నిర్మాణం

# కుటుంబంలో సత్సంస్కారాల నిర్మాణం

కుటుంబాలలో కలహాలను, అవ్యవస్థను చూసి జనం విసుగు చెంది అసలు కుటుంబ వ్యవస్థనే రద్దు చేయాలని సలహాలు ఇస్తున్నారు. కానీ వారు ఈ విషయంలో పాశ్చాత్య దేశాల అనుభవాల నుండి గుణపాఠాన్ని గ్రహించాలి. ఆ దేశాలలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేసి సుఖ శాంతులు పొందాలనే ప్రయోగం జరుగుతోంది. అయితే వారు ఆశించిన సుఖ శాంతులు కరవవుతున్నాయి.

వివాహం తరువాత కొత్త దంపతులు తల్లి తండ్రులను, అన్నదమ్ములను వదలి వేరు కాపురం పెడతారు. కొంతకాలం సుఖ సంతృప్తులతో గడుస్తుంది. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య కలతలు, కలహాలు తలెత్తుతాయి. అందుకు ఒక కారణం ఉంది. కొత్త దంపతులు వేరు కాపురం పెట్టినపుడు సమస్యలను వారిద్దరే ఎదుర్కోవలసి వస్తుంది. అందు వల్ల చిక్కులు,చికాకులు ఏర్పడతాయి. సమస్యల పరిష్కారంలో పాలుపంచుకునేవారు ఎవరూ ఉండరు. ఉమ్మడి కుటుంబంలోనే ఆ సౌకర్యం ఉంటుంది. ఆయా చిక్కుముడులు విప్పడంలో అందరూ పాల్గొంటారు. ఆ బరువు ఇద్దరి మీదనే పడదు. బరువు బాధ్యతలను అందరూ పంచుకుంటారు. అందువల్ల వాటిని మోయడం సులభమవుతుంది.

వేరయిన దంపతులకు ఈ సౌలభ్యం ఉండదు. వారు సమస్యల బరువుతో సతమతమవుతూ పరస్పరం తగాదా పడుతూ ఉంటారు. ఈ ఘర్షణలు ఒకోసారి విడాకుల వరకు వెళతాయి. ఇందుకు మరో కారణం ఉంది. ఉమ్మడి కుటుంబంలో పెద్దల ఒత్తిడి ఉంటుంది. భార్యాభర్తల మధ్య తగాదాలు శృతి మించి రాగాన పడవు. వారు సిగ్గుతో, సంకోచంతో తగాదాలు పడడానికి జంకుతారు. ఎప్పుడైనా మాటామాటా వచ్చినా ఇతరులు మధ్యస్థులుగా ఉండి వారికి సర్దిచెపుతారు. ఆ సమస్య అక్కడితో సమసిపోతుంది. అది పెరిగి పెద్దదై విడాకుల వరకు వెళ్లదు.

కొత్త దంపతులు వేరు కాపురం పెడితే వృద్ధులైన తల్లితండ్రులకు కూడా సమస్యలు ఎదురవుతాయి. సంపాదించిన దానిని పొదుపుగా వాడుకుని ముసలితనం కోసం కొంత మిగుల్చుకుంటే పరవాలేదు. లేకపోతే మాత్రం వారి జీవితం కష్టాల కడలి అవుతుంది. ఈ విధంగా పాశ్చాత్య దేశాలలో యువకులు తమ తల్లితండ్రులను అనాథలుగా వదిలివేసి పాపం చేస్తారు. కుటుంబంలో సుఖ శాంతులు కరవవుతాయి.

కుటుంబం ఉమ్మడిదా, వేరుకాపురమా అన్నది ఒక్కటే సుఖ శాంతులకు కారణం కాదు. మరింత ప్రముఖ కారణం కుటుంబ సభ్యులు గుణవంతులు కావడం. కుటుంబ సభ్యులు గుణవంతులయితే కుటుంబం ఉమ్మడిదైనా విడిదైనా సుఖశాంతులు నిలిచి ఉంటాయి. వారు దుర్గుణాలు కలిగి ఉంటే ఏ స్థితిలోను సుఖ శాంతులు ఉండవు. ఏమైనా అందరూ కలిసి ఉండి,కుటుంబ సభ్యులందరిలో సద్గుణాలు వికసింపచేయడం అన్ని విధాలా శ్రేయస్కరం.

వేరు కాపురాల పద్ధతి పాశ్చాత్య దేశాలలో సఫలం కావడం లేదు. ఆ దేశాలలో మరిన్ని సౌలభ్యాలు ఉన్నప్పటికీ. ఆ దేశాలలో వితంతువుల సమస్య లేదు. వృద్ధుల సమస్యా లేదు. నిరాధారులైన వృద్ధులకు ఆ దేశాలలో ప్రభుత్వంనుండి పెన్షన్ లభిస్తుంది. జబ్బుపడితే ఆసుపత్రులలో నర్సులు చక్కగా సేవ చేస్తారు. కానీ, మన దేశంలో ఈ సౌలభ్యాలు లేవు. వితంతువుల సమస్యకు సరైన పరిష్కారం లేదు. మూఢాచారాలు ఇందుకు అడ్డు నిలుస్తున్నాయి. అనాథాశ్రమాల పరిస్థితి క్షీణించిపోయింది. వృద్ధులకూ, అనాథలకూ పెన్షన్ సౌకర్యం తక్కువ.

కనుక - ఉమ్మడి కుటుంబాల వ్యవస్థను నిలిపి ఉంచుకోవడం భారతీయ సంస్కృతికీ, సమాజ రచనకూ ఒక సవాలు. ఇందుకై కుటుంబ వాతావరణాన్నీ, గృహస్థుల స్వభావాన్నీ ఉమ్మడి కుటుంబాల వ్యవస్థకు అనుకూలంగా మలచడం అవసరం.

తమ కుటుంబ సభ్యులు శ్రేష్ఠవ్యక్తులుగా తయారు కావాలని, వారు పరస్పర ప్రేమాభిమానాలతో కలసిమెలసి జీవించాలని సంరక్షకులూ, కుటుంబ పెద్దలూ కోరుకుంటారు. అలా ఉండాలని వారు అందరికీ నచ్చజెపుతారు. మంచి చెడుల గురించి వివరిస్తారు. తగాదాపడే కుటుంబ సభ్యులకు ప్రేమాభిమానాల గొప్పతనాన్నీ, కలసికట్టుగా ఉండవలసిన అవసరాన్నీ తెలియజెపుతారు. ప్రతి సందర్భంలో ఏదో ఒక ఉపదేశం ఇస్తూనే ఉంటారు. అయితే వాటివల్ల శాశ్వత ప్రయోజనం కనిపించదు. కుటుంబ సభ్యులు ఒకటి రెండు రోజులు ప్రశాంతంగా ఉంటారు. ఆ తర్వాత మళ్లీ తగాదాలు మొదలవుతాయి. ఇలా ప్రభావం లేకపోవడానికి కారణాలు రెండు. ఈ ఉపదేశాలను తగాదాలు వచ్చినప్పుడు మాత్రమే ఇవ్వడం మొదటి కారణం. ఆ తర్వాత ఆ ఉపదేశాలు ఉండవు. తగాదాలు ఉన్నా లేకపోయినా ఈ ఉపదేశాలు

**పరమేశ్వర ఉపాసన ద్వారా మనిషి ప్రపంచాన్ని మరింత సూక్ష్మంగా,వివేకవంతంగా పరిశీలిస్తాడు.**

నిరంతరంగా సాగుతూఉంటే, అవి సంస్కారాలను నిర్మాణం చేస్తాయి. క్రమక్రమంగా పరిస్థితి మెరుగవుతుంది. కుటుంబ పెద్దలు ఉపదేశాలు ఇచ్చినా తాము ఆవిధంగా ఆచరించకపోవడం రెండవ కారణం. ఆచరణ కాని ఉపదేశానికి ప్రభావం ఉండదు. దీపం దీపంతో వెలుగుతుంది. వెలుగుతున్న దీపంతోనే వెలుగుతుంది. ఆరిపోయిన దీపంతో వెలగదు. స్వయంగా గుణవంతుడు అయినవాడు ఇతరులను గుణవంతులుగా మార్చగలుగుతాడు. ఉపదేశం ఉపదేశకుని ఆచరణలో అమలు కాకపోతే అది రవంతైనా ప్రభావం చూపదు. ఈ విషయమై ఒక ఉదాహరణ ఎంతో ప్రసిద్ధి పొందింది.

ఒక సాధువు ఉండేవాడు. ఆయన ఉపదేశం వినేవారిపై మంచి ప్రభావం కలిగిస్తుందనే నమ్మకం ప్రజలలో కలిగింది. ఈ ప్రభావం గురించి విని ఒక మహిళ తన పదేళ్ల కొడుకును తీసుకుని ఆయన వద్దకు వెళ్లింది. 'అయ్యా! ఈ పిల్లవాడు బెల్లం అతిగా తింటాడు. బెల్లం తినడం మానకపోతే ఇతడికి రోగం వస్తుందని వైద్యులు చెప్పారు. వీడు నా మాట వినడం లేదు. దయఉంచి మీరు వీడికి ఆ విషయం నచ్చజెప్పండి.'' - అన్నది.

సాధువు ఆలోచనలో పడ్డాడు. "ఇతడిని పది రోజుల తర్వాత తీసుకురా. అప్పుడు ఇతనికి ఆ మాట చెపుతాను'' - అన్నాడు.

పది రోజుల తర్వాత ఆ మహిళ పిల్లవాడిని తీసుకుని మళ్లీ వచ్చింది. సాధువు బెల్లం తినవద్దని అతడికి నచ్చ జెప్పాడు. పిల్లవాడు అందుకు ఒప్పుకున్నాడు. "ఈ మాట మొదటి సారే చెప్పవచ్చుకదా. ఆమెను ఎందుకు తిప్పించారు?'' - అని అక్కడ కూర్చున్న వ్యక్తులు సాధువును అడిగారు.

సాధువు ఇలా అన్నాడు - "నేను స్వయంగా బెల్లం తింటాను. బెల్లం తినవద్దని నేనా పిల్లవాడికి మొదటిరోజునే చెపితే, దాని ప్రభావం ఉండేది కాదు. ఈ పది రోజులలో నేను బెల్లం తినడం మానివేశాను. దానిమీద అయిష్టం కలిగించుకున్నాను. ఆవిధంగా బెల్లం తినవద్దని ఉపదేశించే అధికారం సంపాదించాను. కనుక నా ఉపదేశాన్ని పిల్లవాడు పాటిస్తాడనే నమ్మకం నాకు కలిగింది.''

కనుక ఉపదేశం వెనుక ఆచరణ ఉండాలి.

దుర్గుణాలు కలిగిన కుటుంబ సభ్యుడు - శరీరానికి వచ్చిన రోగంలా - బాధపెడతాడు. రోగానికి మందు వేయడం అవసరమైనట్లే కుటుంబ సభ్యులను సంస్కరించడం అవసరం. రోగం, మంట, దుర్గుణం త్వరగా పెరిగే వస్తువులు. రోగాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు కలుగవచ్చు. చిన్న నిప్పుకణమేకదా అని అశ్రద్ధ చేస్తే అది మెల్ల మెల్లగా రాజుకుని దావానలంగా పరిణమిస్తుంది. అలాగే - దుర్గుణం ప్రవేశించిన వెంటనే దాన్ని సవరించకపోతే, అది కొద్ది సమయంలోనే స్వభావంలో అంతర్భాగంగా మారిపోతుంది. అప్పుడు దాన్ని తొలగించడం కష్ట సాధ్యం అవుతుంది. కనుక, కుటుంబ సభ్యులను సంస్కరించే పని నేటినుండే ప్రారంభించాలి. అయితే ఈ పని ఉపదేశాలవల్ల కాదు. కుటుంబ పెద్ద స్వయంగా తన ఆచరణను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకున్నప్పుడే గుణాల విషయంలో కుటుంబానికి కాయకల్ప చికిత్స జరుగుతుంది.

తన పిల్లలు సజ్జనులుగా, ఆజ్ఞాబద్ధులుగా, బుద్ధికుశలురుగా, సమాజ సేవకులుగా ఉండాలని, వారి శీలం, స్వభావం సముజ్వలంగా ఉండాలని, తన కుటుంబ సభ్యులందరిలో పరస్పర ప్రేమ, త్యాగం, ఔదార్యం పెరగాలని కుటుంబ పెద్ద కోరుకుంటే- అతడు స్వయంగా తనలో ఆయా గుణాలను పెంపొందించుకోవాలి. లేకపోతే ఆ కోరిక అత్యాశగానే మిగిలిపోతుంది. డబ్బులేని సోమరిపోతు సిరి సంపదలు కోరుకున్నట్లు.

కుటుంబాన్ని సంస్కరించే ప్రయత్నంలో పిల్లలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వయసు వచ్చిన తర్వాత సంస్కారాలు బలపడిపోతాయి. వాటిని మార్చడానికి విశ్వ ప్రయత్నం చేయాలి. కానీ, పిల్లలు వికాసానికి సిద్ధంగా ఉంటారు. వారి మనస్సులు మెత్తగా ఉంటాయి. ఇచ్చిన సంస్కారాన్ని వారు త్వరగా గ్రహిస్తారు. విద్యార్థికి చదువు రాకపోతే, అది ఉపాధ్యాయుని తప్పు. పిల్లవాడికి చెడు అలవాట్లు ఏర్పడితే, అతడి స్వభావం కుటుంబ భావనకు భిన్నంగా ఉంటే, అది తల్లి దండ్రుల తప్పు. పిల్లవాడు ఉపాధ్యాయుని నుండి అక్షరజ్ఞానం పొందుతాడు. తల్లి దండ్రుల నుండి స్వభావాన్ని పొందుతాడు. తల్లిదండ్రుల మధ్య కలహం, ఘర్షణ, మనస్పర్థలు కొనసాగుతూ ఉంటే, పిల్లలలో ద్వేషం, అసూయ, కటుత్వం ఏర్పడతాయి. వారిలో అశ్రద్ధ ఏర్పడుతుంది. వారికి ఆదర్శాలు అంటవు. ఆ గుణాలు తరువాత తరువాత కుటుంబంపట్ల, సమాజంపట్ల, చివరికి ధర్మంపట్ల, పరమేశ్వరునిపట్ల నిర్లక్ష్యంగా పరిణమిస్తాయి. దుర్గుణాలు కలిగిన అలాంటి పిల్లవాడు తాను సుఖంగా బ్రతకలేడు. కుటుంబాన్ని సుఖ శాంతులతో బ్రతకనీయడు.

అతి గారాబంవల్ల, ఉపేక్షవల్ల పిల్లలు తిరుగుబాటుదారులుగా తయారవుతారు. స్వార్థంవల్ల, ఔదార్యరాహిత్యంవల్ల, అధికార భావప్రదర్శనవల్ల తిరుగుబాటుదారులుగా తయారవుతారు. కనుక- కుటుంబ పెద్ద తనలోపల సద్గుణాలను వికసింపజేసుకుని, పిల్లలను సజ్జనులుగా తీర్చిదిద్దాలి. అప్పుడే కుటుంబంలో సుఖ శాంతులు వెల్లివిరుస్తాయి.

K K K

**తన ప్రతి కర్మను భగవానునికీ, ఆదర్శాలకూ అర్పించినవాడే యోగి.**

## బోధకథ

# గరుడ గర్వభంగం

"నేనేం సామాన్యుడినా! జగత్ప్రభువు, సర్వేశ్వరుడయిన శ్రీమహావిష్ణువుకు వాహనాన్ని" – అని గరుడుడు అనుకోగానే నిలువెల్లా గర్వం పొంగి పొరలింది. అవును – నేనే లేకపోతే విష్ణుమూర్తికి ఒక్క పనైనా జరిగేదా! ఒక్క అడుగు ముందుకు వేయగలడా? అందుకే విష్ణుమూర్తి నా ఆధీనంలో ఉంటాడు. నన్నెవరూ చెరపలేరు. నేనే కార్యమైనా నిర్విఘ్నంగా చేయగలను. నాకు నేనే సాటి"– అనుకుని గరుడుడు సర్పాలనన్నిటిని అంతం చేయటం ప్రారంభించాడు. ఎక్కడైనా సర్పం కనిపించితే చంపి గుటుక్కున మింగివేసేవాడు. సర్పాలు ఈ సంగతి విని హాహాకారాలు చేయసాగాయి. గరుడుని తప్పించుకోవాలని భీతిల్లి అటూఇటూ పరిగెత్తి ప్రాణరక్షణ కోసం విలవిలలాడడం ప్రారంభించాయి. బయట పడకుండా దాక్కున్నాయి. అయినా భయంతో చుట్టుకుపోయి సర్పాలన్నీ కలసి ఒక సభ చేశాయి.

శివుని సర్పమణిని సభకు అధ్యక్షుడిని చేశాయి. గరుడుని ఆక్రమణ నుంచి ఎలా తప్పించుకోవాలో చర్చ మొదలుపెట్టాయి. అందరూ ఎన్నో ఆలోచనలు,సలహాలు,ఉపాయాలు చెప్పారు. కాని నిజంగా గరుడుని పట్టుకుని వశపరచుకోవటం ఎలాగో ఎవరికీ తట్టలేదు. చివరికి అధ్యక్షుడు సర్పమణి లేచి,"సర్పవంశ నాశనాన్ని నేను అరికడతాను. మీరు దిగులు చెందకండి" అని హామీ ఇచ్చాడు. సభ సమాప్తమయింది.

మణి శివుడిని ప్రార్థించాడు. మణి ప్రార్థనకు శివుడు ఆనందించాడు. మణిని వరం కోరుకో మన్నాడు. "పరమశివా! గరుత్మంతుడు నన్ను చంపకుండా వరమియ్యండి" అన్నాడు. శివుడు "తథాస్తు" అని వెళ్లిపోయాడు.

మణి తిరుగుతూ తిరుగుతూ విష్ణులోకం చేరుకున్నాడు. విష్ణులోకంలో తన ఇచ్చ వచ్చినట్లు తిరగసాగాడు. గరుత్మంతుడు మణిని చూడనేచూశాడు. అతని కోపం హద్దు మీరింది. తన శత్రువు తన కళ్ల ఎదుట తన లోకంలో ఇంత స్వేచ్ఛగా తిరుగుతాడా! అతనిని పిలిచి "ఓరీ! మణీ! ఇలారా! నా లోకంలో నా ఎదుట ఇలా తిరిగే ధైర్యం నీకు ఎలా వచ్చింది?" అని అడిగాడు.

"అంత కోపం తెచ్చుకోకండి మహాప్రభూ! శాంతించండి. ఇంతకీ మా జాతిని అంతం చేస్తే మీకు వచ్చే లాభం ఏమిటి?" అని మణి వినయంగా అడిగాడు.

"నేను పాములకు శత్రువును. నేను వాటిని సమూలంగా చంపితే గాని శాంతిగా నిద్రపోలేను. నిన్ను కూడా ఉన్నఫళంగా చంపగలను. కాని నాకు ఇప్పుడు ఆకలిగా లేదు. ఈ రోజు సాయంత్రం నీ మెత్తమెత్తని, వెచ్చని మాంసంతో నా ఆకలి తీర్చుకుంటాను" అని మణిని సురక్షితంగా దాచిపెట్టాడు గరుత్మంతుడు.

సాయంకాలమయింది. శివుడి దగ్గర సర్పమణి కనిపించలేదు. ఆ సంగతి నందీశ్వరుడికి తెలిసింది. శివుని వద్దకు వెళ్లాడు. సర్పమణి శివలోకంలో కనిపించడం లేదనే సంగతి శివుడికి విన్నవించాడు. శివుడు ధ్యాన నిమగ్నుడై చూశాడు. విష్ణులోకంలో సర్పమణి బందీ అయి ఉందని తెలుసుకున్నాడు. "నందీశ్వరా! మణిని విష్ణులోకంలో బందీని చేశారు. గరుడుడు ఈ సాయంత్రం మణిని ఆహారంగా చేసుకోవాలనుకుంటున్నాడు. నువ్వు సత్వరం విష్ణులోకానికి వెళ్లు. మణిని గరుత్మంతుని బారి నుండి తప్పించమని మా సందేశంగా విష్ణుమూర్తికి వినిపించు" అన్నాడు.

నంది వెళ్లి విష్ణుమూర్తికి సంగతంతా వివరించాడు. విష్ణుమూర్తి గరుడుని పిలిచి మణిని విడిచిపెట్టమని ఆజ్ఞాపించాడు. గరుత్మంతుడికి కోపం వచ్చింది. "ఏమని ఆజ్ఞాపిస్తున్నారు మీరు? మణిని వదిలి వేయమనా? నేను విడువను. దానిని భక్షించి నా ఆకలిని తీర్చుకుంటాను. నేను మీకెంతో సహాయం చేశాను. మీ ప్రయాణాలన్నీ, యాత్రలన్నీ నా వలననే జరిగాయి. మీ అపూర్వ విజయశ్రీ పరంపరలన్నిటికీ నేనే కారణభూతుడిని అనే మాట మరిచిపోకండి" – అన్నాడు.

విష్ణుమూర్తికి తెలిసిపోయింది. గరుత్మంతుడికి అహంకారం పెరిగిపోయింది. మనం ఏం చెప్పినా వినే స్థితిలో లేడు అనుకొని జాలిపడ్డాడు. తను కోపం వ్యక్తం చేయలేదు. వీనిలో అహంకారాన్ని పెకిలించి వేయకపోతే వీనికే అరిష్టం. గరుడుని శాంతించమని చెప్పి శాంతించాక– "ఖగరాజా! నువ్వంటే నాకు చాలా అభిమానం. నీ వల్లనే కదా నేను వేలవేల యోజనాలు లిప్తపాటులో ప్రయాణం చేసి విజయ పరంపరలు అందుకున్నాను. కాదని ఎవరనగలరు? పాపం – నా బరువైన శరీరాన్ని ఎంతో దూరం మోసావు. నీ ఋణం ఎలా తీర్చుకోను!" అని ప్రేమగా పలికి విష్ణుమూర్తి తన కుడిపాదం ఎత్తి బొటనవేలు గరుత్మంతుడి వీపుపై పెట్టాడు. బొటనవేలు వీపుకి తగలగానే గరుత్మంతుడు విలవిల కొట్టుకున్నాడు. కొండలు వీపుకెత్తినట్లు అయ్యింది. ఆ బరువు తనను పాతాళానికి త్రొక్కివేస్తుందని, ప్రాణాలు కూడా తీస్తుందని వణికిపోయాడు. భగవంతుడితో వేలు తీయమని చెప్పలేడు, బరువు భరించలేడు. దీనంగా ప్రార్థించాడు – "స్వామీ.... వేలు.... కాస్త.... తీయండి, నేను అణిగిపోతున్నాను" అన్నాడు.

"వేలా! వేలేం చేసింది? నా శరీరాన్ని ఎన్నో యోజనాల దూరం ఎన్నోసార్లు మోసావు కదా! వేలు ఆన్చితే భరించలేవా! ఇంతకంటే ఆశ్చర్యం ఏం ఉంటుంది?" – అన్నాడు విష్ణుమూర్తి.

అప్పుడు గరుత్మంతుడికి అర్థం అయింది. "నన్ను క్షమించండి ప్రభూ! అహంకారంతో విర్రవీగాను. నా అహంకారాన్ని మీ బొటన వేలుతో అణచి వేశారు. నేను మణిని ఇప్పుడే విడుదల చేస్తాను" – అన్నాడు.

పరమాత్మ వేలు తీయగానే ఆగిపోయిన గరుత్మంతుడి శ్వాస కదలడం ప్రారంభించింది. "నేనెంత పిచ్చివాణ్ణి, మూర్ఖుడిని. భగవత్కార్యంలో అందరూ నిమిత్తమాత్రులే, కానీ "కర్త" లెవరూ కారు. ఈ విషయం ఎప్పుడూ మర్చిపోకూడదు. మనం ఎంత మహత్కార్యం చేసినా, మనం కేవలం నిమిత్త మాత్రులం. అంతా ఆయనదే అనుకొంటే అహంకారం తలెత్తదు." – అనుకొని – "ప్రభూ! తిరిగి నా మనసులో ఎప్పుడూ అహంకారం మొలకెత్తకుండా అణచివేయండి" అని ప్రార్థించాడు.

అనువాదం : టి.జ్ఞానప్రసూన

**గౌరవంగా, ఆత్మగౌరవంతో జీవించడంలోనే ఆనందం ఉంది.**

## శతసూత్ర కార్యక్రమం: 21-30

# అజ్ఞాన అంధకారాన్ని అంతంచేద్దాం

జీవితాన్ని వికసింపచేయాలంటే మనసు వికసించాలి. అందుకోసం శిక్షణ (విద్య) అత్యవసరం. శిక్షణ పొందిన తర్వాత దానిని సద్వినియోగం చేయని వారు పలువురు ఉన్నమాట నిజమే. అయినా మానసిక వికాసానికి విద్య అవసరమని ఒప్పుకుని తీరాలి. విద్యద్వారానే జ్ఞాన జ్యోతి అంతరాత్మలో ప్రవేశిస్తుంది. భౌతిక వికాసానికి కూడా విద్య తప్పనిసరి. విచారకరమైన విషయం ఏమంటే మన దేశంలోని ప్రజలందరూ విద్యావంతులు కారు. వయోజనులలో ఏ ఒక్కరూ నిరక్షరాస్యులుగా ఉండకుండా చేయడం యుగ పరివర్తనకు అత్యవసరం. ఇందుకోసం దిగువ పది కార్యక్రమాలు అమలు జరగాలి.

**పిల్లలను బడికి పంపాలి** - పాఠశాలలో చదివే వయసు వచ్చిన పిల్లలను బడికి పంపేందుకు వారి తల్లితండ్రులను ఒప్పించాలి. చదువు ఆపివేసిన వారిని తిరిగి బడిలో చేర్పించాలి. లేదా వారు ప్రయివేటుగా చదువుకునేటట్లు చేయాలి. వయోజనులైతే వారిని వయోజన పాఠశాలలో చేర్పించాలి. కుటుంబంలోని చదువుకున్నవారు తమ ఇంటిలోని చదువుకోని వారికి విద్య ఎంత అవసరమో నచ్చచెప్పాలి. వారు చదువుకునేటట్లు చేయాలి.

**విద్యావంతుల భార్యలు నిరక్షరాస్యులుగా ఉండకూడదు** - తమ ఇంటిలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయవలసిందిగా విద్యావంతులకు నచ్చచెప్పాలి. వారిని చదివించేందుకు సమయం కేటాయించేందుకై వారిని తయారు చేయాలి. పెక్కు కుటుంబాలలో స్త్రీలకు చదువు రాదు. వచ్చినా కొద్దిగా వస్తుంది. భార్య నిజంగా అర్ధాంగి కావాలంటే ఆమెకు చదువు చెప్పడం కాని చెప్పించడం కాని తమ పవిత్ర కర్తవ్యమని విద్యావంతులు గుర్తించాలి.

**వయోజన పాఠశాలల ఏర్పాటు** - సేవాభావం కలిగిన విద్యావంతులు కలసికట్టుగా గ్రామగ్రామంలో, పేటపేటలో రాత్రిపూట తీరిక సమయంలో నడిచే వయోజన పాఠశాలలను ఏర్పాటు చేయాలి. చదువు రాని వారికి నచ్చచెప్పి ఆ పాఠశాలలో చేర్చి వారికి చదువు చెప్పడం అలాంటి సరస్వతీ పుత్రుల కర్తవ్యం. ఇతరులకు సాయపడే ధనమే ధన్యమైనది. చదువు రాని వారికి చదువు చెప్పే విద్యయే ధన్యమైనది. ఇలా చదువు చెప్పడానికి సేవాభావం కలిగిన సహృదయులను తయారు చేయడం, వారిని ప్రోత్సహించడం ముఖ్యమైన పని.

**వయోజన మహిళలకు శిక్షణ ఏర్పాటు** - మహిళల కోసం వయోజన పాఠశాలలు నిర్వహించడానికి మధ్యాహ్నం అనుకూలంగా ఉంటుంది. ఇంటిపనులు ముగించుకున్న తర్వాత మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు వారికి తీరిక ఉంటుంది. వారి పాఠశాలలను ఆ సమయంలో నిర్వహించాలి. చదువుకున్న మహిళలు వీటిని నిర్వహించడం మంచిది. అది సాధ్యపడకపోతే 15 - 16 సంవత్సరాలలోపు బాలురకు కాని, వయో వృద్ధులకు కాని ఆ పని అప్పగించవచ్చు.

**శిక్షణతో పాటు దీక్ష** - వయోజన విద్య కోసం సూత్రబద్ధమైన పాఠ్య ప్రణాళికను తయారు చేయాలి. జ్ఞాన దీక్షను కలిగించే పుస్తకాలను అందుకు వినియోగించాలి. అక్షర జ్ఞానంతో పాటు జీవిత సమస్యల విశ్లేషణ కూడా ఆ పుస్తకాల ద్వారా లభించాలి. భావ విప్లవం, నైతిక అభ్యున్నతి, యుగనిర్మాణ సిద్ధాంతం ఈ పాఠ్యపుస్తకాలలో ఉండాలి. ఉపాధ్యాయులు ఆ పాఠాలు బోధించేటపుడు ఆయా విషయాలపై చర్చలు జరపాలి. సమాచార శాస్త్రం, పౌరశాస్త్రం, ఆరోగ్యం, మతం-సదాచారం, రాజనీతి, ప్రపంచ పరిచయం మున్నగు విషయాలలో స్థూలమైన పరిజ్ఞానం అందించాలి. అందువల్ల శిక్షార్థులు నేటి పరిస్థితుల గురించి, ఆధునిక యుగం గురించి, మానవ జాతి ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకోగలుగుతారు.

**క్రొత్త పాఠశాలల స్థాపన** - క్రొత్త పాఠశాలలు అవసరమైన స్థలాలలో వాటి స్థాపనకు ప్రయత్నం జరగాలి. ప్రజల సహకారంతో క్రొత్త పాఠశాలలను స్థాపించి, ఆ తర్వాత వాటిని ప్రభుత్వానికి అప్పగించడం మంచి పద్ధతి. పాఠశాలల కోసం ఖాళీ స్థలాన్ని కాని, గృహాన్ని కాని ఉచితంగా పొందవచ్చు. ఫీజు వసూలు చేసి అధ్యాపకులకు వేతనాలు ఇవ్వవచ్చు. ధనవంతులు ఈ కృషికి సహకరించేలా తగు వాతావరణాన్ని నిర్మించవలసి ఉంటుంది.

**రాత్రి పాఠశాలల నిర్వహణ** - కొద్దిగా చదువుకుని పనులు చేసుకుంటూ తమ విద్యార్హతలను పెంచుకోవాలని కోరేవారి కోసం రాత్రి పాఠశాలలు నిర్వహించాలి. రాత్రిపూట సుమారు రెండు గంటల పాటు చదువుకుని వీరు జీవితంలో ఉన్నతిని సాధించగలుగుతారు. ప్రయివేటుగా చదువుకుని పరీక్షలు వ్రాసే సౌకర్యం పెక్కు ప్రభుత్వ సంస్థలలోను, ప్రభుత్వేతర సంస్థలలోను ఉంటున్నది. ఎక్కడ ఎలాంటి సౌకర్యం ఉంటే ఆ ప్రకారం ఈ పాఠశాలలను నడపాలి. ఈ పాఠశాలల నిర్వహణకయ్యే ధనాన్ని విద్యార్థుల నుండి ఫీజు వసూలు చేయడం ద్వారా సమకూర్చుకోవచ్చు.

**విద్యావంతులు జ్ఞాన ఋణాన్ని తీర్చుకోవాలి** - ఐదుగురికి చదువు చెప్పి తమ జ్ఞాన ఋణాన్ని తీర్చుకుంటామని విద్యావంతులు ప్రతిజ్ఞ

**శ్రద్ధతో ముడిపడినపుడే తర్కానికి సార్థకత.**

చేయాలి. ధనవంతులు ధనాన్ని దానం చేసి పుణ్యం సంపాదిస్తారు. అలాగే విద్యావంతులు విద్యాదానం చేసి పుణ్యం సంపాదించే సంప్రదాయాన్ని ప్రారంభించాలి.

తీర్థయాత్రలు జరిపి తిరిగి వచ్చిన తర్వాత దానం చేయడం, విందు భోజనాలు ఏర్పాటు చేయడం ఒక సాంప్రదాయం. అలా చేస్తేనే కాని తీర్థయాత్ర సఫలం కాదన్న నమ్మకం ప్రజలలో ఉంది. అలాగే జ్ఞాన ఋణాన్ని తీర్చుకోనిదే విద్య సఫలము, సార్థకము కాదన్న నమ్మకాన్ని ప్రజలలో కలిగించాలి. ప్రభుత్వానికి పన్నులు కట్టడం బాధ్యత. చేసిన అప్పులు తీర్చడం బాధ్యత. అలాగే విద్యావంతులు ఐదుగురికి చదువు చెప్పడం బాధ్యత. ఇందుకు సమయదానం చేయవచ్చు. అది వీలు కాకపోతే ధనాన్ని దానం చేసి అధ్యాపకులకు వేతనాలు సమకూర్చవచ్చు.

**గ్రంథాలయం, పఠనాలయం** - గ్రంథాలయాలను, పఠనాలయాలను స్థాపించాలి. జీవితానికి కొత్త దిశను ఇచ్చే గ్రంథాలను, పత్రికలను మాత్రమే వాటిలో ఉంచాలి. అశ్లీల సాహిత్యాన్ని, కాలక్షేప సాహిత్యాన్ని ఎట్టి పరిస్థితిలోను వాటిలో ఉంచకూడదు. భోజనంలో విషపదార్థాలు ఎలాంటివో గ్రంథాలయాలలో చెత్తసాహిత్యం అలాంటిది. చదువుకునే వారి నుంచి కొద్ది రుసుము వసూలు చేసి కాని, చందాలు వసూలు చేసి కాని ఆ గ్రంథాలయాలను నిర్వహించాలి. మంచి పుస్తకాలను, పత్రికలను వ్యక్తుల నుండి సేకరించి గ్రంథాలయాలలో ఉంచవచ్చు.

**చదివే అభిరుచిని కలిగించాలి** - చదివే అభిరుచిని కలిగించడం యుగ నిర్మాణం దృష్టిలో అత్యవసరం. సాధారణంగా విద్యాలయాలలో చదువు పూర్తి కాగానే జనం పుస్తకాలకు నమస్కారం పెట్టేస్తారు. తమ వృత్తి ఉద్యోగాలలో మునిగిపోతారు. పేకాట ఆడడంలా పుస్తకాలు చదవడం సమయాన్ని వృధా చేయడం అని వాళ్ళు అనుకుంటారు. ఈ అభిప్రాయాన్ని ప్రజల మనస్సుల నుండి తొలగించాలి. నిరక్షరాస్యతపై పోరాటం జరిపినట్లే జ్ఞానవృద్ధి పట్ల నిర్లక్ష్యంపై కూడా పోరాటం జరపాలి. కడుపుకు భోజనం ఎంత అవసరమో బుద్ధికి జ్ఞానాన్ని పెంచే సాహిత్యం అంత అవసరమనే సత్యాన్ని జనమానసంలో బలంగా నాటాలి.

ఇంటింటికీ వెళ్ళి ప్రజలలో చదివే అభిరుచిని కలిగించాలి. వారి ఇళ్లకు మంచి పుస్తకాలను అందించాలి. ఇదొక పెద్దపని. సంచార గ్రంథాలయాలను నిర్వహించాలి. జ్ఞాన ప్రచారకులు తమ సంచీలలో కొన్ని పుస్తకాలను తీసుకుని బయలుదేరాలి. ఇంటింటికీ వెళ్ళి గ్రంథ పఠనం పట్ల అభిరుచిని పెంచాలి. చదివి తిరిగి ఇవ్వడానికి కొన్ని పుస్తకాలు ఇవ్వాలి. ఇంటింటికీ వెళ్ళి ఉచితంగా టీ ఇచ్చి గతంలో టీని ప్రచారం చేశారు. ఇప్పుడు ప్రజలకు టీ త్రాగడం బాగా అలవాటయిపోయింది. అదేవిధంగా ప్రజలలో మంచి సాహిత్యాన్ని చదివే అభిరుచిని కలిగించాలి. స్వాధ్యాయాన్ని దినచర్యలో అంతర్భాగం చేసుకునేలా ప్రజల మనసులను మలచాలి. యుగనిర్మాణ యోజన సాఫల్యం ఈ అభిరుచిని పెంచడంపై చాలావరకు ఆధారపడి ఉంది.

విద్యా ప్రసారం అవసరం. మానసిక వికాసానికి ఇది తప్పనిసరి. విద్యా విస్తరణ జరగనిదే దేశం ముందడుగు వేయలేదు. భావ విప్లవ లక్ష్యం పూర్తి కావడం అనేది ప్రజాశిక్షణపై ఆధారపడి ఉంది. కనుక ఇందుకోసం ప్రాణాలు ఒడ్డి కృషి చేయాలి.

L L L

## ఆత్మవిశ్వాసానికి ఆధారం

మొక్కలు సంవేదనశీలమైనవి అని నిరూపించాలనుకొన్న జగదీశ్ చంద్ర బోస్ తన ప్రతిపాదన సత్యమని ఋజువు చేయటానికి ఇంగ్లండు వెళ్లాడు. అనేక వైజ్ఞానికులతో నిండిన నిండు సభలో ఆయన తన ప్రదర్శనను చేయవలసిఉన్నది. ఒక మొక్కకు సూదిమందు ఇచ్చి ఆ విష ప్రభావం మొక్కమీద ఎలాగుంటుందో ప్రత్యక్షంగా చూపించాలి. మొక్కకు సూదిమందు ఇచ్చారు. కాని అది విష ప్రభావానికి లోనుకాలేదు. తక్షణం బోసు ఈ సూదిమందు ప్రభావం చెట్టు మీద లేనపుడు నా మీద కూడా ఉండదు అని పల్కి అదే సూది మందును తన చేతిమీద చేసుకున్నాడు. సభ భయంతో చేష్టలుడిగి స్తబ్ధుగా చూస్తూ ఉండి పోయింది. ఆ సూదిమందు వల్ల మనిషికి ఎంతటి దుర్గతి కలుగుతుందో అందరికీ తెలుసు. అది బోసుని ఏమీ చేయలేక పోవటంతో దానిని తిరిగి పరీక్షించవలసిన పరిస్థితి ఏర్పడింది. పొరపాటు వలన విషం సూది మందు ఉంచే స్థానంలో బలానికి ఉపయోగించే సూదిమందు ఉంచారన్న విషయం బయటపడింది. తరువాత అనుకున్నట్లు విషపు సూదిమందు మొక్కకు ఈయటం, తక్షణం ప్రతిక్రియ జరగటం సభాసదులు ప్రత్యక్షంగా చూశారు.

ఈయన తన అన్వేషణను పూర్తి తత్పరతతో సాగించేవారు. ప్రతిపాదనలకు పూర్వమే ప్రామాణికతను ఖచ్చితంగా ఋజువు పరుచుకొనేవారు. ఈ కారణం వలననే వీరికి ఇంతటి ఆత్మవిశ్వాసం లభించింది. సత్యాలను కేవలం పుస్తకాలలో చదివినంత మాత్రాన ఉపయోగం లేదు. వీటిని జీవితంలో ధైర్యంగా స్వీకరించి, అభ్యాసం చేయాలి. అప్పడే ఇలాంటి గొప్ప గుణాలు సంస్కారాలుగా తయారవుతాయి, తరువాతి జన్మలలో పుట్టు భోగులవలె అద్భుతమైన మేధాసంపదలను పరమాత్మ ప్రసాదించిన కానుకలవలె వారు అవలీలగా అనతికాలంలోనే హస్తగతం చేసుకోగలుగుతారు.

**నిష్ఠతో, నిర్మల హృదయంతో చేసే కృషి ఎన్నడూ విఫలం కాదు.**

# కృష్ణావతారం-14

# భస్మమైన కాలయవనుడు

మగధరాజగు జరాసంధుని పుత్రికలు ఇరువురు కంసుని వివాహమాడిరి. కంసుని మరణానంతరము ఇద్దరు వెళ్లి జరాసంధునికి విషయమంతటిని వివరించిరి. జరాసంధుడు చాలా దుఃఖితుడై యాదవ వంశమును సమూలముగా తుడిచిపెట్టవలెనని నిశ్చయించెను. ఇట్లు సంకల్పించి జరాసంధుడు విశాలమగు సైన్యమును సంఘటితపరచి మథురపై దండెత్తెను. కృష్ణుడు జరాసంధుని విశాల సేనను చూచి భయపడిన పురవాసులకు ధైర్యము చెప్పి తన కర్తవ్యమును గూర్చి ఆలోచించెను.

**ఏతదర్థో Eవతారో Eయం భూభార హరణాయ మే ।**
**సంరక్షణాయ సాధూనాం కృతో Eన్యేషాం వధాయ చ ॥**
**అన్యోE పి ధర్మరక్షాయై దేహః సంభ్రియతే మయా ।**
**విరామయాప్యధర్మస్య కాలే ప్రభవతః క్వచిత్ ॥**

భూభారహరణము, సాధుజన రక్షణము అను ప్రయోజనములను సాధించుటయే నాయీ యవతార ప్రయోజనము.

ధర్మమును రక్షించుటకు, ఆయా సమయముల యందు వృద్ధి పొందిన అధర్మమును అరికట్టుటకు నేను ఇంకను అనేకములైన శరీరములను ధరింతును.

(1) సజ్జనత్వమును రక్షించుటకు దుర్మార్గమును సంహరింపవలసిన అవసరమున్నది. భగవద్భక్తులు ఇట్టి కార్యములలో సహకరింపవలెను.
(2) సమతౌల్యమును స్థాపించుటకు సమయానుసారముగ ఈశ్వరుడు ఎన్నియో అవతారములను ధరించుచుండును.

**బల తదంగార్ణవ దుర్గ భైరవం**
**దురన్తపారం మగధేన్ద్ర పాలితమ్ ।**
**క్షయం ప్రణీతమ్ వసుదేవ పుత్రయో**
**విక్రీడితం తజ్జగదీశయోః పరమ్ ॥**

పరీక్షిన్మహారాజా ! జరాసంధుని ఆ సేన సముద్రము వలె దుర్గమముగను, భయావహముగను, చాలా కష్టముగా జయించుటకు తగినదిగను ఉండెను. కాని శ్రీకృష్ణ బలరాములు కొద్దికాలములోనే దానిని నాశనం చేసిరి. వారు సర్వజగత్తునకు ప్రభువులు. మానవలీలలను చేయుచుండిరి.

(1) ఇతరులకు భయము గొల్పు పరిస్థితులతో బుద్ధిమంతులు తేజస్సు గలవారు నగు మానవులు పోరాడి సాఫల్యమును పొందెదరు.
(2) మనము ఆపదలకు భయపడక వానిని ఎదుర్కొనవలెను.

జరాసంధుని సైన్యమంతయు చంపబడెను. అతడు బలరాముడి చేతిలో పరాజితుడయ్యెను. బలరాముడు జరాసంధుని వరుణపాశములతో బంధించి వానిని సంహరింపదలచుచుండెను. కాని శ్రీకృష్ణుడు ఆయనతో ఇట్లు పలికెను - ఈతడు జీవించియున్నచో ఇంకను సైన్యమును ప్రోగు చేసికొని తెచ్చును, అపుడు మనకు భూభారమును తగ్గించుట తేలికయగును.

పరాజితుడైన జరాసంధుడు రాజ్యమును వదలి తపస్సు చేయుటకై సిద్ధమగుచుండెను. కాని వాని అనుయాయులు ఇది కాల మహిమయని చెప్పి వానిని ఉత్సాహపరచిరి. ఉత్సాహితుడగు జరాసంధుడు పదునేడుమారులు మథురపై దాడి చేసెను. ప్రతిసారి వాడు ఓడిపోవుచునే యుండెను. పదునెనిమిదవ మారు వాడు మరల దాడి చేసెను. వాడు యుద్ధమును ఆరంభించుచుండగా కాలయవనుడు మథురపై దాడి చేసెను. ఇట్లు మథుర దాడికి గురికాగా బలరామునితో కృష్ణుడు చర్చించుచు "మనము ఇరువురితో యుద్ధమునకు దిగినచో ఆపదల పాలగుదుము. శత్రువును ఎదిరించుటకు మనకు మథురలో సరియైన దుర్గమేదియు లేదు" - అని తెలిపెను.

**తస్మాదద్య విధాస్యామో దుర్గం ద్విపద దుర్గమమ్ ।**
**తత్ర జ్ఞాతీన్ సమాధాయ యవనం ఘాతయామహే ॥**

అందువలన నేడే మనము మానవులు చొరరాని ఒక దుర్గమును నిర్మించి దానిలో మన బంధువులను ఉంచి తరువాత కాలయవనుని సంహరింతము.

(1) ఆవేశపడి ఏపనీ చేయరాదు. సమయానుసారముగ ఆలోచించి పనిచేయవలెను.
(2) ఆపద ఎదురైనపుడు తనవారితో చర్చించుట హితకరమగును.

బలరామునితో చర్చించి శ్రీకృష్ణుడు సముద్రములో ఒక విశాలమైన దుర్గమును నిర్మించెను. ఆ ద్వారకా పట్టణము అన్ని విధములగు సౌకర్యములను కలిగి ఉండెను. భవన నిర్మాణము తర్వాత లోకపాలురందరు భగవానునికి కృతజ్ఞత తెలుపుటకు

**కష్టాల పరీక్ష దాటితేనే సాధన సఫలం అవుతుంది.**

కానుకలను సమర్పించిరి.

**యద్యద్భగవతా దత్త మాధిపత్యం స్వసిద్ధయే ।**
**సర్వం ప్రత్యర్పయామాసుర్హరౌ భూమిగతే నృప ॥**

పరీక్షిన్మహారాజా! లోకపాలురకు వారి యధికారముకై శక్తులను, సిద్ధులను శ్రీకృష్ణు డొసంగెను. శ్రీకృష్ణ భగవానుడు భూమిపై అవతరించి లీలలు చేయుచుండగా వారు సర్వసిద్ధులను ఆయనకు అర్పించిరి.

(1) విభూతులన్నియు భగవానునివే.
(2) భగవానుని కార్యమున సహాయపడుటకే అదనపు యోగ్యతలు కలిసినవి.
(3) భగవానుడు ఇచ్చిన వానిని మరల ఆయనకే సమర్పింపవలెను.

ఇట్లు ద్వారకా పట్టణమును నిర్మించి పిమ్మట శ్రీకృష్ణుడు అసురులను సంహరించుటకు యుద్ధనీతిని ఏర్పరచి కార్యమును ఆరంభించెను.

**ప్రజాపాలేన రామేణ కృష్ణః సమనుమంత్రితః ।**
**నిర్జగామ పురద్వారాత్ పద్మమాలీ నిరాయుధః ॥**

శ్రీకృష్ణ భగవానుడు తన వారినందరిని ద్వారకా పట్టణమునకు చేర్చి, మిగిలిన వారి రక్షణకై బలరాముని మథురలో నిలిపెను. ఆయన అభిప్రాయమును తీసికొని పద్మమాలను ధరించి అస్త్రశస్త్రములు లేకుండగ నగర ద్వారము గుండా బయటకు వెళ్లెను.

మధురానగరమునుండి బయటకు వచ్చుచున్న శ్రీకృష్ణ భగవానుని చూచి గుర్తించి కాలయవనుడు "నేను గూడ అస్త్రశస్త్రములు లేకుండగనే వీనితో యుద్ధము చేయుదు"నని నిశ్చయించుకొనెను.

**ఇతి నిశ్చిత్య యవనః ప్రాద్రవన్తం పరా ఙ్ముఖమ్ ।**
**అన్వధావజ్జిఘృక్షుస్తం దురాపమపి యోగినామ్ ॥**

ఇట్లు నిశ్చయించి కాలయవనుడు శ్రీకృష్ణ భగవానునివైపు పరుగిడెను. అప్పుడు ఆయన మరియొకవైపు ముఖము పెట్టి యుద్ధరంగము నుండి పారిపోయెను. యోగి జనదుర్లభుడగు ఆప్రభువును పట్టుకొనుటకు కాలయవనుడు ఆయన వెంట పరుగిడసాగెను.

కృష్ణుడు శత్రువు పట్ల కూటనీతితో ప్రవర్తించుచుండెను. అది ఫలించెను. తన భయము వలన ఆయన పరుగిడుచుండెనని కాలయవనుడు తలంచెను.

**పలాయనం యదుకులే జాతస్య తవ నోచితమ్ ।**
**ఇతి క్షిపన్ననుగతో నైనం ప్రాప్యాహతా శుభః ॥**

కాలయవనుడు మాటిమాటికీ ఆక్షేపించుచు ఇట్లు పలికెను - "కృష్ణా ! నీవు ఉత్తమమగు యదువంశమున జన్మించితివి, ఇట్లు యుద్ధము వదలి పారిపోవుట తగదు." కాని అశుభములైన కర్మ బంధనములు నశింపకపోవుటచే కాలయవనుడు శ్రీకృష్ణుని పట్టుకొనలేకపోయెను.

(1) అశుభకార్యములు మిగిలియుండగా భగవానుని పట్టుకొనుట కష్టమేయగును.
(2) ఉత్తమ వంశమున పుట్టిన వ్యక్తి ఎవరైనా అనుచితమగు కార్యమును చేసినచో నిందలపాలగును.

మాటిమాటికీ కృష్ణుని పిలుచుచు కాలయవనుడు ఆయన వెంట పడెను. కాని కృష్ణుడు ఆగలేదు. పరుగిడుచునే యుండెను. చివరకు ఆయన ఒక గుహలో ప్రవేశించెను. అక్కడ ఒక వ్యక్తి నిద్రించుచుండెను. కృష్ణుడు తన పీతాంబరమును ఆయనపై కప్పి ఒక ప్రక్క దాగియుండి చూడసాగెను. ఇంతలో కాలయవనుడు గూడా ఆ గుహలో ప్రవేశించి "ఇతడు మోసగించి నన్ను ఇటు తెచ్చెను. ఇప్పుడు గొప్ప సాధువువలె ఇక్కడ నిద్రించుచున్నాడు"అని పలికి ఆ నిద్రించుచున్న పురుషుని చాచి ఒక తన్ను తన్నెను.

**స తావత్తస్య రుష్టస్య దృష్టిపాతేన భారత ।**
**దేహజేనాగ్నినా దగ్ధో భస్మసాదభత్ క్షణాత్ ॥**

పరీక్షిన్మహారాజా ! ఆ పురుషుడిట్లు మేల్కొని కృద్ధుడయ్యెను. ఆయన దృష్టి పడినంతనె కాలయవనుని శరీరమున అగ్ని పుట్టెను. క్షణములో మండి వాడు భస్మమయ్యెను.

(1) ఉద్రేకములో ఏ మాత్రము ఆలోచించక పని చేసినచో అది హానికరమగును.

ఈ కథను విని పరీక్షిత్తు శుకదేవుని ఆ పురుషుడెవరని అడుగగా ఆయన ముచుకుందుడను మహారాజని శుకుడు సమాధానమిచ్చెను. ముచుకుందుడు దేవతల ప్రార్థననుసరించి వారికి సేనాపతియై చాలా దినములు యుద్ధము చేసెను. ఆయన తన అలసటను పోగొట్టుకొనుటకు నిద్రించుచుండెను. నిన్ను మేల్కొల్పిన వానిపై నీ దృష్టి పడినంతనే వాడు భస్మమగునని దేవతలు ఆయనకు వరమిచ్చిరి. ఇట్లు శ్రీకృష్ణుడు కాలయవనుని యుక్తితో భస్మము చేసి తన దివ్యరూపమును ముచుకుందునకు ప్రదర్శించెను. రాజు అడుగగా కృష్ణుడు తన్ను ఆయనకు పరిచయము చేసుకొనెను. తన అదృష్టమును ప్రశంసించుచు రాజు భగవానుని స్తుతించుచు ఇట్లు పలికెను.

**మౌనేన కలహం నాస్తి : మౌనం వల్ల కలహం రాదు.**

**లబ్ధ్వా జనో దుర్లభ మత్ర మానుషం**
**కథంచి దవ్యఙ్గమయత్న తో Ê నఘ ।**
**పాదారవిన్దం న భజత్య సమ్మతి -**
**ర్గృహాన్ధకూపే పతితో యథా పశుః ॥**

దేవా ! ఈ భూమి మిగుల పవిత్రమైన కర్మభూమి. దీనియందు మానవ జన్మ మిగుల దుర్లభము. తన అదృష్టము వలన భగవానుని పరమకృప వలన దానిని అప్రయత్నముగ పొందియు ఏ నీచవ్యక్తి విషయ సుఖములకే పూర్తిగా ప్రయత్నము చేయుచుండునో, భగవానుని చరణకమలములను ఉపాసింపడో, సేవింపడో వాడు తృణ లోభముచే అంధకూపమున పడిపోవు పశువు వంటివాడగును.

(1) మానవ జన్మ యొక్క దుర్లభత్వమును దృష్టిలో నుంచుకొనవలెను.
(2) సేవించుటయే మానవుని ఉద్దేశ్యము.
(3) విషయ భోగములందు చిక్కుకుని యుండుట మానవునికి శ్రేయస్కరము కాదు.

**భవాపవర్గో భ్రమతో యదా భవే -**
**జ్జనస్య తర్హ్యచ్యుత సత్సమాగమః ।**
**సత్సఙ్గమో యర్హి తదైవ సద్గతౌ**
**పరావరేశే త్వయి జాయతే మతిః ॥**

స్వస్వరూపమున ఒకే స్థితిలో ఉండువాడు భగవంతుడు. జీవుడు అనాదికాలము నుండి జనన మరణరూప సంసార చక్రమున తిరుగుచున్నాడు. ఆ చక్రము నుండి బయటపడు సమయము వచ్చినపుడు వానికి సత్సంగము లభించును. సత్సంగము లభించిన క్షణమందే సత్పురుషుల ఆశ్రయము, కార్యకారణరూప జగత్తునకు ఏకైక ప్రభువుడవగు నీయందు జీవుని బుద్ధి చాలా దృఢముగా లగ్నమగుట నిశ్చయము.

(1) ఉత్తమ వ్యక్తుల సాంగత్యము దుఃఖమునుండి విడిపించి సద్గతిని ఈయగలదు.
(2) భగవంతుని యందు బుద్ధిని లగ్నము చేయు వాతావరణమే సత్సంగము.

ముచుకుందుడు భగవానుని స్తుతించెను. తన్ను భజింపవలసినదిగా భగవానుడు ఆయనను ఆదేశించెను. భగవానుని ఆజ్ఞను పొంది ముచుకుందుడు బదరికాశ్రమమునకు వెళ్లి భగవానుని ఆరాధింపసాగెను.

**భగవాన్ పునరావ్రజ్య పురీం యవనవేష్టితామ్ ।**
**హత్వా మ్లేచ్ఛబలం నిన్యే తదీయం ద్వారకాం ధనమ్ ॥**

భగవానుడు మథురకు తిరిగివచ్చెను. ఇంతవరకు అది కాలయవనుని సైన్యముచే ముట్టడింపబడి యుండెను. శ్రీకృష్ణుడు ఆ మ్లేచ్ఛ సేనను సంహరించి వారిధనము నంతటిని లాగికొని ద్వారకా నగరమునకు వెళ్లిపోయెను.

(1) సేనాపతి లేని సేన అవ్యవస్థిత మగును. క్రమ పద్ధతిలేని వారు శక్తిశాలురైనను నశించిపోవుదురు.

L L L

## ఇలియట్ సాధన

ఇంగ్లీషు విద్వాంసుడు ఇలియట్ తన శ్రమ సాధనల ద్వారా ఇంగ్లీషు భాషతోపాటు అనేక ప్రపంచ భాషల గురించి కోట్లాదిమంది ప్రజలు ప్రేరణ, ప్రకాశం పొందేటట్లుగా తన ఆలోచనలను అభిప్రాయాలను ఈనాటి లోకానికి అందజేశారు.

ఇంగ్లండులో పుట్టిన ఇలియట్ సంపన్నుడైన వ్యాపారవేత్త అయిన తండ్రికి సహకరించి తానుకూడా సంపన్నుడు కావటానికి బదులు సాహిత్యసేవ చేయాలని నిశ్చయించుకొన్నాడు. దీనికోసం ఈయన తండ్రిని నొప్పించక భిన్నాభిప్రాయాలు గల తండ్రి నుండి ఏ సహాయం కోరక చిన్న చిన్న ఉద్యోగాలు చేసికొంటూ లభించిన దానితో కష్టపడి విశ్వవిద్యాలయాలలో చదువుకొనేవాడు. వేదాంత శాస్త్రం వీరి ప్రియమైన పాఠ్యాంశం. దీనికోసం ఫ్రాన్సు, అమెరికా, జర్మనీ దేశాలకు వెళ్లారు. 30 సంవత్సరముల వయస్సు వచ్చేవరకూ పూర్తిగా విద్యార్థి జీవితాన్ని గడిపారు. తరువాత సాహిత్య సేవ ప్రారంభించారు. ఇంగ్లీషులో కావ్య సాహిత్యం, వేదాంతం ఆరోజుల్లో చాలా జటిలంగా ఉండేవి. ఇలియట్ ద్వారా సృష్టించబడిన ఉచ్చశ్రేణికి చెందిన సాహిత్యం వల్ల విశ్వసాహిత్య దారిద్ర్యమే నిర్మూలించబడిందని చెప్పవచ్చు.

శ్రమ సాధనకు కాలపరిమితిగాని, ముహూర్త బలం వంటివిగాని ఏమీ లేవు. ఏ క్షణంలో ప్రేరణ లభిస్తుందో ఆ క్షణంలోనే దానిని ఆరంభంచేసి కాళిదాసులుగా మారిపోవచ్చు.

**సజ్జనుల సంపద పరోపకారానికే వినియోగం అవుతుంది.** పద్మపురాణం నుండి

# యుగ గీత

## పన్నెండు విధముల యజ్ఞాలు

*(గత సంచిక తరువాయి)*

నాల్గవ అధ్యాయంలోని 26వ శ్లోకం నుండి 31వ శ్లోకం వరకు భగవానుడు 12 రకాల యజ్ఞాలను వర్ణించి వాటి రహస్యాలను వివరిస్తున్నారు.

**శ్రోత్రాదీ నింద్రియా ణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి ।**
**శబ్దాదీన్ విషయా నన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి ॥**

అనగా -

*ఇతర యోగులు చెవులు మున్నగు సమస్త ఇంద్రియములను సంయమనం అనే అగ్నిలో హవనం చేస్తారు. మరికొందరు యోగులు శబ్దము మున్నగు సమస్త విషయములను ఇంద్రియములు అనే అగ్నిలో హవనం చేస్తారు.*

**సర్వా ణీంద్రియకర్మాణి ప్రాణ కర్మాణి చాపరే ।**
**ఆత్మ సంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥**

అనగా -

ఇతర యోగులు ఇంద్రియాల క్రియలన్నింటినీ, ప్రాణముల క్రియలన్నింటినీ జ్ఞానంతో వెలిగించబడిన ఆత్మసంయమనం అనే అగ్నిలో హవనం చేస్తారు. అనగా సచ్చిదానంద రూపమైన పరమాత్మను మినహా మరెవరినీ చింతన చేయకపోవడమే ఈ క్రియలన్నింటినీ హవనం చేయటం.

**ద్రవ్యయజ్ఞా స్తపోయజ్ఞా యోగయజ్ఞా స్తథా Ê పరే ।**
**స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః ॥**

అనగా -

*కొందరు ద్రవ్య సంబంధమైన యజ్ఞం చేస్తారు. కొందరు తపస్సు రూపంలో యజ్ఞం చేస్తారు. మరికొందరు యోగం రూపంలో యజ్ఞం చేస్తారు. కొందరు అహింస వంటి తీవ్ర వ్రతములు చేసే సాధకులు స్వాధ్యాయం రూపంలో జ్ఞానయజ్ఞం చేస్తారు.*

**అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేÊపానం తథాÊపరే ।**
**ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః ॥**
**అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।**
**సర్వేప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపిత కల్మషాః ॥**

అనగా -

*కొందరు యోగులు అపాన వాయువులో ప్రాణవాయువును హవనం చేస్తారు. ఇతరులు ప్రాణవాయువులో అపాన వాయువును హవనం చేస్తారు. నియమితంగా ఆహారం తీసుకునే ప్రాణాయామ పరాయణులు మరికొందరు ప్రాణ అపానముల గతిని నిరోధించి ప్రాణాలను ప్రాణాలలోనే హవనం చేస్తారు. ఈ సాధకులందరు యజ్ఞాల ద్వారా పాపాలను నాశనం చేస్తారు, యజ్ఞాలలోని రహస్యాన్ని తెలుసుకుంటారు.*

**యజ్ఞ శిష్టామృతభుజో యాన్తి బ్రహ్మ సనాతనం ।**
**నాÊయం లోకోÊస్త్య యజ్ఞస్య కుతోÊన్యః కురుసత్తమ ॥**

అనగా -

*కురు శ్రేష్ఠుడైన ఓ అర్జునా ! యజ్ఞశేషమనే అమృతాన్ని సేవించే యోగులు సనాతన పరబ్రహ్మ పరమాత్మను పొందుతారు. యజ్ఞం చేయని వ్యక్తికి ఈ ఇహలోకం కూడా సుఖాన్ని ఇవ్వదు. ఇక పరలోకం సుఖాన్ని ఎలా ఇస్తుంది ?*

26వ శ్లోకం నుండి 30వ శ్లోకం వరకు యజ్ఞం యొక్క వివిధ రూపాల వర్ణన ఉంది. చివరి 31వ శ్లోకంలో యజ్ఞ మహిమ చెప్పబడింది.

ఈ 12 రకాల యజ్ఞాలు వ్యక్తి ఆంతరిక క్రియలకు, బహిరంగ సంబంధాలకు సంబంధించినవి. వీటివల్ల మనిషి జీవితమంతా యజ్ఞమయం అయిపోతుంది. అనంతంగా వ్యాపించి ఉన్న ప్రభువుకు నిరంతర పూజగా మారిపోతుంది. ఈ పన్నెండూ ఇవి -

(1) దేవతలకు పూజ చేయడం - యజ్ఞానుష్ఠానం - దేవయజ్ఞం. (2) బ్రహ్మ అనే అగ్నిలో జీవాత్మను ఆహుతి చేసి ఏకత్వ భావనతో హోమం చేయడం. (3) ఇంద్రియాలను సంయమ అగ్నిలో హవనం చేయడం.(4) ఇంద్రియ అగ్నిలో విషయాల హవనం. (5) సమస్త ఇంద్రియ కర్మలనూ, ప్రాణ కర్మలనూ జ్ఞానంతో వెలిగే ఆత్మసంయమన యోగం అనే అగ్నిలో హవనం. (6) ద్రవ్య యజ్ఞం. (7) తపోయజ్ఞం. (8) యోగ యజ్ఞం. (9) స్వాధ్యాయ యజ్ఞం (10) అపానంలో ప్రాణవాయువు హవనం. (11) ప్రాణంలో అపానవాయువు హవనం. (12) ప్రాణాలను ప్రాణంలో హవనం చేయడం.

ఈ యజ్ఞాలన్నింటి లక్ష్యం ఒక్కటే - సాధకుడిని శుద్ధి చేయడం, పరమ లక్ష్యాన్ని సాధించడం కోసం అతడిని తయారు చేయడం. యజ్ఞం ఏ విధమైనది అయినా మూడు లక్ష్యాలతో మనం దాన్ని జరపాలి. మొదటిది మన ఆలోచనలు పరమేశ్వరుని వైపు మళ్లడం. రెండవది కల్మషాల ప్రక్షాళన. మూడవది అనంతుడైన పరమాత్మతో తాదాత్మ్య భావాన్ని వికసింపచేసుకోవడం. మన ఆలోచనలు ఎల్లపుడు నిర్మాణాత్మకంగా, ఉత్కృష్టతను కోరేవిగా ఉండాలి. మానవ కళ్యాణం కోసం జీవించాలంటే అంతరంగ పవిత్రత అత్యవసరం. దానిని సంపాదించాలి. మనకూ, పరమాత్మకూ అంతరం ఉండనంతగా మనం ఆయనతో సాన్నిహిత్యం పెంపొందించుకోవాలి.

'ఇన్ట్యూనింగ్ విత్ ఇన్ఫినిటీ' అనే గ్రంథంలో ఒక పాశ్చాత్య రచయిత ఇలా వ్రాశారు- పరమాత్మతో ఏకాకారం కావడానికి హిందువులు కనుగొన్న మహత్తర విధానం యజ్ఞం. దానితో సమానమైన విధానం ఏ మత సాంప్రదాయంలోను కానరాదు. క్రైస్తవ మతాన్ని జీవితంలో అమలు జరుపుతున్న ఆ విద్వాంసుడు ప్రతిరోజూ యజ్ఞం చేసేవాడు. యజ్ఞ ప్రాముఖ్యాన్ని అందరికీ వివరించేవాడు.

**'ఇదం న మమ'** (ఇది నాది కాదు) అనే భావంతో యజ్ఞం చేస్తే మన కర్మ మనది కాక ప్రభువుది అవుతుంది ; అకర్మగా మారుతుంది. యజ్ఞం అంటే అగ్నిని జ్వలింపచేసి దానిలో ద్రవ్యాలను హవనం చేయడం మాత్రమే కాదు. విరాట్ అర్థంలో యజ్ఞం అంటే జీవన యజ్ఞం. నా కర్మ ఏదయినా, అది నా కోసం కాక పరమాత్మలో తాదాత్మ్యం పొందడం కోసం చేసేది- అనే భావనతో చేసేది యజ్ఞం.

Ð(Ç-¡"ÉÓ-KÓ-<ÓH.Ó)

**కష్టాలలోనే కటిక నిజాలు తెలుస్తాయి.**

# వ్యక్తి నిర్మాణం

# శిష్టాచారాన్ని పాటించడం ఎలా?

జీవితంలోని సఫలత అసఫలతలపై మన వ్యవహారంలోని చిన్న చిన్న విషయాల ప్రభావం చాలా ఉంటుంది. చిన్న చిన్న చెడు అలవాట్లు, స్వభావంలోని చిన్న చిన్న వికృతులు, నడవడికలోని తప్పుడు పద్ధతులు - ఇలాంటి సామాన్య విషయాలే మనిషిని ఉన్నతి, వికాసం, సాఫల్యముల మార్గంలో అడ్డంకులుగా తయారవుతాయి. వీటిని సరిచేసుకోకుండా మనిషి తన అపజయానికి ఇతర కారణాలను వెదకి తనను తాను సంతృప్తిపరచుకొనే విఫలయత్నం చేస్తుంటాడు.

**వ్యవహారంలో మర్యాద :** మనిషిని మాటతీరు, జీవనం తీరు తెన్నులు, నడవడిక ఆధారంగానే సమాజం అతని పట్ల అభిప్రాయం ఏర్పరచుకుంటుంది. అది మనుష్యుని జీవితంలో ప్రముఖపాత్ర వహిస్తుంది. అందుకే చిన్న చిన్న పొరపాట్లు, స్వభావంలోని వికృతులు, నడవడిక, మాటమంతిలో అసభ్యత, ఇతర దోషాలు తొలగించుకొనుట అవశ్యకం.

**జీవితంలో సంతులనం అవసరం :** అనేక మంది ఉద్రేక స్వభావులుగా ఉంటారు. మాట మాటకు ప్రతిసారీ ఉద్రేకపడుతూ ఇతరులతో పోట్లాడుతూ ఉంటారు. ఏ విషయమూ ప్రశాంతమైన మనస్సుతో ఆలోచించుకోకుండా, తర్కించుకుంటూ గందరగోళ స్థితిలో ఉంటారు. వారి ముఖాలలో విసుగు, చిరాకు కనబడుతూ ఉంటాయి. ఆత్మవిశ్వాసం లేకపోవడం, హీన భావన, గాబరా వలన అనేకమంది స్థిమితంగా ఉండలేరు. ఈ విషయాలన్నీ మనుష్యుని మానసిక స్థితిని తెలియజేస్తాయి. జీవితంలో ప్రతి క్రియాకలాపంవల్ల ప్రభావితులయ్యేవారి గురించి మంచి అభిప్రాయం ఏర్పడదు. ఉద్రేకం, హీనభావం కలిగి ఉండి చికాకు, బడలికతో ఉండే వ్యక్తిని ఏ తెలివిగలవాడైనా పనిలో పెట్టుకొనుటకు, వెంబడి ఉంచుకొనుటకు ఇష్టపడడు. ఇవి చూడటానికి చిన్నవిగా ఉన్నా ఏదైనా రంగంలో విజయం సాధించుటకు అడ్డంకులుగా ఉంటాయి.

మాట్లాడుతూ ఉండే ప్రతి వ్యక్తి నడుస్తూ తిరుగుతూ ఉండే ప్రకటన వంటివాడు. ప్రకటనను బట్టే దాని ప్రభావం ఉంటుందనేది సత్యం. మాటా-మంతీ, వేషధారణను బట్టి మనుష్యుని వ్యక్తిత్వం ప్రదర్శితమవుతుంది. ఏ దురలవాటుల వల్ల తన గురించి తప్పుడు ప్రచారం అవుతుందో, తన అసభ్యత, మూర్ఖత్వం స్పష్టమవుతాయో వాటిని వదిలి వేయుట అత్యవసరం.

**జీవితంపై మనోభూమిక ప్రభావం :** చాలామంది ఇతరులతో కళ్ళతో కళ్ళు కలిపి మాట్లాడుటకు సంకోచిస్తారు. అనేకమంది మాట్లాడుతూ బట్టలు మెలిపెడుతూ ఉంటారు. కొంతమంది పూచికపుల్లతో నేలను గీస్తూ తవ్వుతూ ఉంటారు. కొంతమంది నోట్లో వేలు వేసుకోవటం లేదా గోళ్ళుకొరుకుట చేస్తూ ఉంటారు. వీరు ఇతరులను సరిగా ప్రభావితం చేయలేరు. దీనితో వ్యక్తిత్వంలోని బోలుతనం, క్షుద్రత్వం స్పష్టమవుతుంది.

సమాజంలో అటువంటి వ్యక్తులకు ప్రాముఖ్యత ఇవ్వబడదు. వారు ఉన్నతశ్రేణి వ్యక్తులలో లెక్కించబడరు. ఈ రకమైన సంకోచ స్వభావులు బలహీన మనస్కులు ఏ గొప్ప పనినైనా చేస్తారని ఆశించలేము.

**సంభాషణ ఒక కళ :** సంభాషణ స్థాయి మనుష్యుని వ్యక్తిత్వాన్ని ప్రకటిస్తుంది. ఎక్కువ మౌనంగా ఉండేవారు లేదా అధికంగా మాట్లాడేవారు మంచివారుగా భావించబడరు. అవసరమైనంతవరకు స్పష్టంగా అచి తూచి మాట్లాడే మనిషి వ్యక్తిత్వపు బరువు పెరుగుతుంది. ఆలోచించకుండా, అవకతవక భాషతో, అమర్యాదగా, పెద్ద పెద్దగా మాట్లాడుట, మధ్యలో జోక్యం చేసుకొనుట, అసందర్భంగా మాట్లాడుట, తన గురించే చెప్పుకొనుచుండుట అనేవి సంభాషణలోని దోషాలు. సంభాషణలో తన అనుభవాల గురించే వర్ణించుచుండుట, ఇతరులకు అవకాశం ఇవ్వకుండుట, యువతుల అందం గురించి చర్చించుట, పరనింద మున్నగు వాని వలన మనుష్యుని అల్పత్వాన్ని ఎవరైనా సహజంగానే అంచనా వేస్తారు. సంభాషణలోని ఈ దోషాలు కారణంగా దుష్ప్రభావం పడుతుంది. దీనితో మనుష్యుని ఉన్నతి, సఫలత సుదూర విషయాలవుతాయి. అనేకమంది ఖచ్చితమైన సరియైన విషయాన్నే కఠోరంగా, శుష్కంగా అంటారు. అనేకమంది ఉపదేశకులు ప్రేమ, మైత్రి, దయను ఉపదేశిస్తూ ఇతరులను ప్రశంసిస్తూ, ఆదర్శాలను వర్ణిస్తూ కూడా ఎవరితోనో పోట్లాడుతున్నట్లు కన్పిస్తారు. స్వరంలోని ఈ కాఠిన్యాన్ని తొలగించుకొనుట అవసరం. సంభాషణలో మధురత, గంభీరత, స్పష్టతల వలన ఇతరులపై మంచి ప్రభావం పడుతుంది. సాధారణ యోగ్యత కలిగినవారు కూడా తమ ప్రసంగ మాధుర్యంతో పెద్ద పెద్ద పనులు నెరవేరుస్తారు. కానీ పైన చెప్పుకొన్న దోషాలు తొలగించుకోలేనివారు ఈ విధంగా ఫిర్యాదు చేస్తుంటారు - 'మేము ఇతరులకు మంచి మాటలే చెబుతున్నాము. వారి హితం

**నిజాయితీగా ఉండు. నిజాయితీగా పని చెయ్యి. నిజాయితీగా మాట్లాడు. నీ హృదయం తేలికగా ఉంటుంది.**

కోరుకుంటున్నాము. అయినా మమ్మల్ని చెడ్డగా అనుకుంటున్నారు. మాకు దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు.' దీనికి కారణం ఇతరులు కారు, మన కుదిరీ కుదరని మాటలే.

**క్రమపద్ధతి గల జీవనం అనివార్యం :** అనేకమంది ధర్మం, ఆధ్యాత్మం, సమాజం, మానవత గురించి పెద్ద పెద్దగా మాట్లాడుతూ ఉంటారు. మాటలలో అభిప్రాయాలలో ఆకాశకుసుమాలను చిత్రించుటలో వెనుకబడరు. కానీ భూమిమీద చేసే పనిలో వచ్చే చిన్న చిన్న విషయాల పట్ల కొంచెం కూడా శ్రద్ధ చూపించరు. ఫలితంగా వారు భూమికీ కాక ఆకాశానికీ కాక, చివరకు ఏ గుర్తింపు లేకుండా పోతారు. దుస్తులు అస్తవ్యస్తంగా, జుట్టు చిందరవందరగా, తినుట త్రాగుటలో ఒక పద్ధతి లేకుండా, పైగా అసభ్యత, అసహ్యం ఉట్టిపడతూ ఉండే వ్యక్తులు ఏ గొప్ప పనీ సాధించలేరు. ఏ ప్రత్యేక రంగంలోనూ విశేష సాఫల్యం పొందలేరు.

**శీలము, నడతలో శ్రేష్ఠత :** ఏదో ఒక శీలసంబంధమైన, నడతకు సంబంధించిన దోషం మనుష్యుని పరాజయం పతనంవైపు ప్రేరేపిస్తుంది. సమాజంలో అతడి విలువ, పలుకుబడి నశిస్తాయి. మహాపండితుడు, విజ్ఞాని, బలవంతుడైన రావణుడు తన అహంకారము, పరస్త్రీ ఆసక్తి వలన నష్టపోయాడు. సమాజమంతా, చివరకు పశుపక్షులు కూడా అతన్ని వ్యతిరేకించాయి. ఈ విధంగా చరిత్రపుటలలో వ్రాయబడిన పతనపు కథలలో మనుష్యుని శీలరాహిత్యమే ప్రముఖము. శీలము, నడత సాధారణమైనవి అని వాటిని విస్మరిస్తే మనుష్యుని ప్రగతి ఆగిపోతుంది.

**ప్రసన్నత ప్రభావం :** అనేకమంది సాధారణ సందర్భాలలో కూడా ముఖం పెద్దది చేసుకొని, ఏడుపు ముఖాలతో కన్పిస్తూ ఉంటారు. మృత్యుభయం, నైరాశ్యం, పరాజయం, భయంకర వాతావరణాన్ని సృష్టిస్తూ ఉంటారు. మరొకవైపు కొంతమంది తమ ప్రసన్నత, చిరునవ్వు, ఆశాభావంతో ప్రాణవంతము, సుందరము, శ్రేష్ఠమైన వాతావరణాన్ని తయారుచేస్తారు. మనుష్యుని దృష్టికోణము, ఇచ్ఛాశక్తి ముఖ్యమైనవి. దుఃఖము, బాధ, నిరాశా అందరి జీవితాలలో ఉంటాయనేది శాశ్వత సత్యం. ఎవరు ఉత్సాహము ప్రసన్నత్వము అందిస్తారో, స్మశానంలో కూడా నవజీవనం కల్పిస్తారో వారిని సమాజం ప్రశంసిస్తుంది. ప్రతిసారీ తమ దుఃఖము, చికాకులు, లేమి గురించి ఏడ్చేవారిని అందరూ వదిలించుకోవాలనుకుంటారు. ఎందుకంటే ఏడ్చేవాళ్ళకు కొదువ ఉండదు.

**ఇతరుల బలహీనతలే కాదు, సద్గుణాలు కూడా చూడండి :** సామాజిక సహకారం, జనుల సహాయం, తన రంగంలో సాఫల్యం లభించక పోవుటకు ఒక పెద్ద కారణం ప్రతి విషయంలో ఇతరులను విమర్శించుచుండుట. ప్రతి సమయంలో ప్రతి విషయాన్ని విమర్శనా గీటురాయిపై గీయుట మంచి పని కాదు. దీనివలన జనులు దూరమవుతారు. మనుష్యుడు ఇతరుల అనుభూతులు, మహత్తర సమాచారం, అభిప్రాయాలు, జ్ఞానం నుండి వంచితుడవుతాడు.

ఈ చిన్న చిన్న విషయాలే మనుష్యుని ఉన్నతికి ఎన్నో ఆటంకాలు కలిగించవచ్చు. వీటిని సరిచేసుకోవటానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ ఉండాలి.

## మర్యాదను పాటిద్దాం

ఇతరులపట్ల శ్రద్ధ, స్నేహం పెంపొందించే నడవడికను మర్యాద అని అంటాము. మానవ జీవితాన్ని సుందరం, సుఖవంతం చేసే శ్రద్ధ, స్నేహం ఇతరులపట్ల ఆత్మీయతాభావాన్ని కలిగిస్తాయి. స్నేహం, శ్రద్ధా లేకుండా మానవ జీవనం నీరసం, కష్టదాయకం అవుతుంది.

సాధారణంగా మనుష్యుడు ఒక నిశ్చిత కాలము జీవించవలసి ఉంటుంది. అనేక మందితో సమాజం రూపొందించు కొని. మనుష్యుడు తన సుఖ-సౌకర్యాలకు ఒక క్రమబద్ధత సునిశ్చితం చేసుకొనేందుకు కొన్ని నియమాలు ఏర్పాటు చేసుకున్నాడు. జీవన యాపనలో పరస్పర వ్యవహారములో ఇది సరసతను ఉత్పన్నం చేస్తుంది. ఆ వ్యవహార నియమాలను మర్యాద అని అనవచ్చు. ఈ మర్యాద లోపిస్తే మానవ సమాజం జంతువుల సమూహం వలె అస్తవ్యస్తమైపోతుంది. పిల్లలతో వృద్ధులు, వృద్ధులతో పిల్లలు, స్త్రీ పురుషులు పరస్పరం ఏ విధంగా అయినా వ్యవహరిస్తే, తండ్రి-తల్లి, ఇరుగు-పొరుగు, గురు-శిష్యులని ఏ గౌరవం, మర్యాద లేకపోతే, అందరూ అందరితో ఇచ్చవచ్చినట్లు వ్యవహరిస్తే - అటువంటి దశలో నియమమంటూ ఉండదు. అనుశాసనం ఉండదు. ఒక విచిత్రమైన అస్తవ్యస్తత, అవ్యవహారము ఉత్పన్నమవుతాయి.

ఈ అస్తవ్యస్తత, అవ్యవస్థ, క్రమశిక్షణారాహిత్యం నిరోధించటానికే శిష్టాచార నియమాలు, దాని మర్యాదలు ఏర్పాటు చేయబడ్డాయి. ఎక్కడ ఈ మర్యాదలు రక్షించబడతాయో, అక్కడ ప్రసన్నతా వాతావరణం ఉంటుంది. ఎక్కడ ఈ మర్యాదలు ఉల్లంఘించబడతాయో అక్కడ కలహము, కష్టాల పరిస్థితులు ఏర్పడతాయి. జీవితంలో ప్రతిక్షణం ప్రతి అడుగు విఘ్నబాధల నుండి విముక్తమై ప్రసన్నంగా ఉండుటకు మర్యాద యొక్క సార్వజనీన, సర్వమాన్య నియమాల పాలన అనివార్యము.

**మర్యాద ప్రవర్తనకు ఆధారం :** మర్యాదకు స్థూలమైన అర్థం -

**విద్యాహీనః పశుః - విద్య లేనివాడు వింత పశువు.**

అందరూ ప్రసన్నత అనుభవించే విధంగా అందరితో తగిన విధంగా వ్యవహరించుట. ఇందుకు వ్యతిరేకమైనదంతా అమర్యాద. దీనివలన జనులలో సంక్షోభం, అసంతోషం కలుగుతాయి.

అందుకే మర్యాదా నియమాలు ఏర్పాటు చేయబడ్డాయి. అవి పూర్ణమని చెప్పలేము. ప్రతి స్థానం, ప్రతి వ్యక్తి, ప్రతి పరిస్థితికి సరిపోయే అన్ని సాధ్య కల్పనలు చేసి సంపూర్ణ నియమాలు తయారుచేయుట అసంభవం. ఇందుకే మర్యాద లోని ఒక మూల సూత్రం శ్రద్ధ, స్నేహంతో జోడించబడింది. పెద్దలపట్ల శ్రద్ధ, పిన్నల పట్ల స్నేహపూర్ణ వ్యవహారం - ఇది మర్యాదకు మూలాధారం.

మర్యాద స్నేహముల పరిభాష వాటి శబ్దార్థముల వరకే పరిమితం కాకూడదు. ఎక్కడైనా శ్రద్ధ పూజా రూపంలో వ్యక్తం కావచ్చు. ఎక్కడైనా ఆదరం రూపంలో, ఎక్కడైనా సాధారణ నమ్రత రూపంలో వ్యక్తం కావచ్చు.

**మర్యాద స్వరూపం :** పెద్దలపట్ల శ్రద్ధాభావం ప్రదర్శించుటయే శిష్టాచారం. దీనిని పాదాలు స్పృశించి నమస్కారం చేయుట, లేదా సాధారణ నమ్రత రూపంలో చూపించవచ్చు. తమ తల్లి-తండ్రి, చిన్నాన్న-పెదనాన్న, ఉపాధ్యాయులు మున్నగు గురుజనులకు భారతీయ శిష్టాచారం ప్రకారం చరణ స్పర్శ చేయవచ్చు. తమకు గౌరవనీయులైన వయోవృద్ధులు, విద్యాధికులు, అధికారంలో ఉన్నవారికి ప్రణామం చేయబడుతుంది. అపరిచితులు, తెలియనివారు, సంబంధంలేని వారు, తమకంటే తక్కువ పదవిలో ఉన్న వయోవృద్ధులకు శ్రద్ధను వ్యక్తం చేయుట ఒకే విధంగా ఉండదు. అయినా తగిన మర్యాద తప్పనిసరిగా ఇవ్వాలి. ఎవరి గౌరవానికీ భంగం కలుగని రీతిలో వ్యవహరించుటయే శిష్టాచారం. ఇందుకు వ్యతిరేకమైన ఆచరణ అశిష్టాచారం అవుతుంది.

ఇదేవిధంగా తమకంటే చిన్నవారిపట్ల స్నేహం వ్యక్తం చేయుట ఒక ఆవశ్యకమైన షరతు, ఏ విధంగా తమ పిల్లలను ఒడిలోకి తీసుకుని, ఎత్తుతూ - దింపుతూ, నవ్వుతూ - నవ్విస్తూ, వెక్కిరిస్తూ, నీవు - మీరు అంటూ, వెన్ను చరుస్తూ, ముఖం ముద్దుపెట్టుకుంటూ, జోలపాడుతూ నిస్సంకోచంగా ప్రేమ - మమత పంచుతామో ఇతరుల పిల్లల పట్ల అంత చొరవకు అధికారం ఉండదు. అయినా చొరవ చూపించుట, తియ్యని గొంతుతో స్నేహపూర్వకంగా మాట్లాడుట, కుశల సమాచారం అడుగుట, అవసరమైన పరామర్శ చేయుట మానవ శ్రేష్ఠతల గురించి కొద్దిపాటి చర్చ చేయుట, ప్రేమ చూపించుట శిష్టాచారంలోని అంగములే. ఇవి పరస్పరం సభ్యత మర్యాదలను పెంచుతాయి.

ఏ విధంగా వయస్సు పెరుగుతూ ఉంటుందో అలా అలా ఆ వయస్సును బట్టి పిల్లలు లేదా పెద్దల పట్ల ప్రేమ వ్యక్తీకరించుటలో గంభీరత పెరుగుతుంది. దీనిని గుర్తుంచుకొనకపోవుట అశిష్టాచారం కావచ్చు. ఇదే విధంగా యువకులు యువతుల మధ్య ప్రేమ చూపించుటలో జాగ్రత్తలు శిష్టాచారముగా, వాటిని ఉల్లంఘించుట శిష్టాచారంలో పొరపాటుగా అనుకోవాలి.

మనకంటే చిన్నవారు స్నేహానికి అధికారులు శ్రద్ధకు కాదు అనేది నిజమే. కాని శ్రేష్ఠతలోని అంతరం గుర్తింపును మార్చివేస్తుంది. వయస్సులో యోగ్యతలో మనకంటే తక్కువ అయినప్పటికీ మనకంటే పదవిలో లేదా ఏదైనా స్థితిలో అధికులైతే మన శ్రద్ధ లేక ఆదరానికి పాత్రులవుతారు. పిన్నవారైనందున వారిపట్ల ఆదరాన్ని ఉపేక్షించుట అశిష్టత క్రిందే వస్తుంది.

ప్రతి మనుష్యునికీ తన సామాజిక శిష్టాచార నియమాలు, మర్యాదలు, విశ్వాసాలలో అచంచల నమ్మకం ఉండాలి. వాటిని వదిలివేయుట ఇతర సమాజాల శిష్టాచారాలను నెత్తిన రుద్దుట కూడదు. కానీ ఇతర సమాజాలలోనికి వెళ్ళి వారి శిష్టాచార నియమపాలన చేయకపోవుట, తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరించుట అశిష్టతయేగాక అసభ్యం కూడా అవుతుంది.

పాశ్చాత్య దేశాలలో ఎవరైనా స్త్రీ పట్ల శిష్టాచారం చూపించుటకు అక్కడి ఒక పద్ధతి ఆమె చేతిని ముద్దు పెట్టుకొనుట. కానీ భారతదేశంలో అలా చేయకూడదు. ఒకవేళ ఎవరైనా పాశ్చాత్య వ్యక్తి భారతీయ సమాజంలో అలా వ్యవహరించుట అశిష్టాచారం అవుతుంది.

ప్రతి దేశం - కాలం కొరకు, ప్రతి పరిస్థితి లేక ప్రతి వ్యక్తికి శిష్టాచార నియమాలు ఏర్పడిలేవు. ఏర్పాటు చేయలేము. వాటిని నేర్పలేము.

**సభ్య ఆచరణ :** ప్రతిసారీ తెలిసిన నియమాలు పాటించుచుండుట, దానితోపాటు తన వ్యవహారంలో ప్రతిచోట, ప్రతిసారీ, అన్ని స్థితులలో యథోచిత శ్రద్ధ స్నేహం కలిగిఉంటూ నమ్రత, గౌరవపూర్వక సభ్య ఆచరణ చేయటం, మన ఆచరణతో ఎవరికీ ఏ విధమైన కష్టం లేక అసౌకర్యం కలిగించుట లేదుకదా అని గుర్తుంచుకొనుట శిష్టాచార నిర్వహణ అవుతుంది.

తన శిష్టాచార నియమాల పట్ల నిష్ఠ కలిగి ఉన్నప్పటికీ ఇతర సమాజాలలోని శిష్టాచారాన్ని యథాయోగ్యంగా, స్థానాన్ని బట్టి నిర్వహించకపోవుట అశిష్టత అవుతుంది. ఇందుకు అవసరమైన వాటిని అడిగి తెలిసికొనుట, లేదా ఆ సమాజంలో తన తెలియనితనానికి క్షమాపణ అడుగుట, మార్గదర్శనం కొరకు ప్రార్థించుట ఒక శిష్టాచారమే. దీనిని ప్రతి సభ్య వ్యక్తి పాటించాలి.

W W W

కర్తవ్యో మిత్ర సంగ్రహః - మిత్రులను సంపాదించు.

## జీవన పథం

# అందరి హితంలోనే మన హితం

సాంఘిక న్యాయ సిద్ధాంతం ఒక తిరుగులేని వాస్తవం. దానిని ఏ మాత్రం ఉపేక్షించలేము. ఒక వర్గానికి అన్యాయం జరిగితే రెండవ వర్గం ఎన్నడూ శాంతియుతంగా జీవించజాలదు. ఇనుప చువ్వను ఒక కొన వద్ద వేడి చేస్తే, దాని వేడిమి క్రమంగా రెండవ కొనకు చేరుతుంది. మానవ జాతి అంతా ఒక ఇనుప చువ్వ వంటిది. దానిలో ఏ భాగాన్ని వేడి చేసినా చల్లబరచినా, ఆ ప్రభావం ఇతర భాగాలకు ప్రసరించడం తప్పనిసరి. అందరికీ సమానంగా సాంఘిక న్యాయం అందాలి. ప్రతి మనిషీ ఇతరులవలె మానవోచితములైన హక్కులను అనుభవించాలి. అలాంటి స్థితి నిర్మాణం కానిదే మన సమాజం దోపిడీ నుండి విముక్తి పొందదు. సమాజవాద సిద్ధాంతం ఆర్థిక సమానత్వాన్ని రాజకీయ స్థాయిలో ఎంతో తీవ్రంగా ప్రతిపాదిస్తోంది. సామ్యవాద దేశాలు తీవ్రంగా, సమాజవాద దేశాలు నెమ్మదిగా ఈ మార్గంలో ముందుకు పోతున్నాయి. ఆధ్యాత్మిక వాదం సనాతన కాలం నుండి దీనినే బోధిస్తోంది. పరిగ్రహం (కూడబెట్టడం) పాపమని ఈ దేశంలో ఎల్లప్పుడూ పరిగణిస్తూ వచ్చారు. సామాన్య ప్రజల స్థాయి కన్న బాగా హెచ్చుగా సుఖసాధనాలు ప్రోగు చేసుకోవడం, సంపదను కూడబెట్టడం మన దేశంలో ఎల్లప్పుడూ పాపంగా పరిగణిస్తూ వచ్చారు. 'వంద చేతులతో సంపాదించు, వేయి చేతులతో దానం చెయ్యి' అని మన మహర్షులు ఆదేశించారు. లెక్కలేనన్ని చెడుగులకు జన్మనిచ్చే సంగ్రహ ప్రవృత్తిని అదుపు చేయాలన్నది దీని అర్థం.

**ఔదార్యాన్ని పెంపొందించుకో** : ఒక వ్యక్తిలో పిసినారితనం, స్వార్థపరత్వం, ఔదార్యరాహిత్యం, కఠోరత విపరీతంగా పెరిగిపోయినపుడే అతడు సామాన్య ప్రజల కన్న అత్యధికంగా ధనం నిల్వచేయగలుగుతాడు. ఇతరులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతుంటే, దారిద్ర్యంలో మగ్గుతూ ఉంటే, వారి పిల్లలు చదువు, వైద్యసౌకర్యం అందక అలమటిస్తూ ఉంటే - ఎవ్వరికీ చేయి విదపనివాడు, రవ్వంత ఇస్తే కొండంత కీర్తి లభించే అవకాశం ఉంటేనే ఇచ్చేవాడు మాత్రమే సంపన్నుడు కాగలుగుతాడు. ప్రతి వ్యక్తి పుష్కలంగా సంపాదించాలి; ఆ సంపాదన ప్రయోజనాన్ని ఇతరులకు పంచాలి - అన్నదే సాంఘిక న్యాయానికి గీటురాయి. అందరూ కలిసి మెలిసి తినాలి. జీవించాలి, జీవించనివ్వాలి. సుఖదుఃఖాలను పరస్పరం పంచుకోవాలి. వీటి బరువు ఒకే వ్యక్తి భుజాల మీద పడితే అతడు క్రుంగిపోయి నుసి అయిపోతాడు. వీటిని అంతా కలిసి పంచుకుంటే ఎవరిమీదా బరువు పడదు. అందరి మనసులూ సేదదీరుతాయి. సమాజంలో అసమానత అనే విషం తయారు కాదు.

**మనిషి గొప్పతనానికి గీటురాళ్లు గుణ కర్మ స్వభావాలు:** ఆర్థిక సమానత్వ సిద్ధాంతం సనాతనమైనది, శాశ్వతమైనది. అలాగే సాంఘిక సమానత్వం, మానవ హక్కుల సమానత్వం అనే ఆదర్శం కూడా తప్పనిసరిగా అమలు చేయవలసినట్టిదే. ఈ ఆదర్శాన్ని సవాలు చేయలేము. ఏదైనా కులంలో, వంశంలో పుట్టినంత మాత్రాన మనిషి హక్కు తగ్గడానికి గాని పెరగడానికి గాని వీలు లేదు. హెచ్చు తగ్గులకు గీటురాళ్లు గుణ కర్మ స్వభావాలే కావాలి. తన వ్యక్తిగత విశిష్టత వల్ల ఒక వ్యక్తికి మరింత గౌరవం లభించవచ్చు. కానీ, వ్యక్తి ఫలానా కులంలో పుట్టినందువల్ల అతడు గొప్పవాడు కాని, చిన్నవాడు కాని కాజాలడు. ఇపుడు ప్రపంచం చెత్తా చెదారం వంటి ఈ భావాలకు నీళ్లు వదులుతోంది. అమెరికా, ఆఫ్రికా ఖండాలలో నల్లవారి పట్ల జరుగుతున్న విచక్షణను ప్రపంచాభిప్రాయం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. మేధావి వర్గాలు ఈ జాతివిచక్షణను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాయి. ఈ విచక్షణ హెచ్చు సమయం సాగదన్నది ఖాయం. సామాజిక సమానత్వానికి సర్వత్రా గుర్తింపు లభిస్తుంది. నిర్ణీతమైన పనులను, వృత్తులను వంశపారంపర్యంతో జోడించి, వాటిని మరింత సమర్థవంతంగా, మరింత సమున్నతంగా చేసే ఉద్దేశ్యంతో భారతదేశంలో కులాలు ఏర్పరచబడ్డాయి. ఈ పవిత్ర పరంపరలో హెచ్చుతగ్గులు అనే విషయం వచ్చి చేరుతుందని దాని నిర్మాతలు కలలో సైతం ఊహించిఉండరు. కానీ నేడా వికృత పరిస్థితి కొనసాగుతోంది. గుణ కర్మ స్వభావాలను ప్రక్కన పెట్టి వంశం, కులం ఆధారంగా హెచ్చుతగ్గులను నిర్ణయించే పద్ధతి తిష్టవేసింది. నిరర్థకమైన ఈ మూఢత్వాన్ని నిర్మూలించవలసిందే. వివేకం పెరిగే కొద్దీ ఇలాంటి మూఢ నమ్మకాలు సమాప్తం అవుతూపోతాయి. తరుణం మించిపోకముందే మనం విజ్ఞతను ప్రదర్శించి వీటిని వదులుకోగలిగితే అది ప్రశంసనీయం అవుతుంది.

**స్త్రీపురుషులు సమానులే :** స్త్రీలు ఆవులు, గేదెల వలె తమ ఆస్తి అని పురుషులు భావించడం పూర్తిగా అనుచితం. శరీరంలోని కొన్ని అవయవాలలో తేడా ఉన్నంత మాత్రాన స్త్రీపురుషులలో ఒకరు

**కర్మానుగో గచ్ఛతి జీవ ఏక - పుణ్యాపాప కర్మలు మాత్రమే జీవుడిని అనుసరిస్తాయి.**

హీనులనీ, మరొకరు గొప్పవారనీ భావించతగదు. లక్షల సంవత్సరాల పాటు ప్రపంచంలో మాతృస్వామ్య పద్ధతి అమలు జరిగిందని చరిత్రకారులకు తెలుసు. తల్లులు తమ కుటుంబాలకు యజమానులుగా ఉండేవారు. పురుషులు వారి చెప్పుచేతలలో ఉండేవారు. ఇప్పటికీ కేరళ ప్రాంతంలో మాతృస్వామ్య పద్ధతి కానవస్తోంది. స్త్రీ గొప్పదని పురుషుడు హీనుడనీ ఇందువల్ల రుజువు కాదు. ఇది సౌలభ్యానికీ, వ్యవస్థకూ సంబంధించిన విషయం. ఈ పెట్టుబడిదారీ యుగంలో, సంపాదించేవారు తాము గొప్పవాళ్ళమని భావిస్తారు. మొత్తం మీద పురుషులు ధనసంపాదన చేస్తున్నారు. స్త్రీలు వారి అదుపాజ్ఞలలో ఉండవలసి వస్తోంది. ఇది ఆర్థిక వ్యవస్థ వల్ల కలిగిన ఒక పరిణామం మాత్రమే. మానవ హక్కులపై గల మౌలిక విశ్వాసంపై దీని ప్రభావం పడకూడదు. స్త్రీలు పురుషులకు దాసులు అనే సూత్రం సాంఘిక న్యాయానికి ఏ విధంగానూ అనుగుణం కాదు. పరస్పర ప్రేమ, సద్భావాలు కారణంగా కుక్కలు సైతం మనిషి కోసం తమ ప్రాణాలను బలి చేయడానికి సిద్ధపడతాయి. మరి స్త్రీ పురుషుల అపూర్ణత ఒండొరుల ద్వారా పూర్ణం అవుతున్నపుడు, ప్రేమ, సౌజన్యాల ద్వారా రెండు శరీరాలు ఒకే ఆత్మగా రూపొంది ఎందుకు జీవించవు? ఈ పని బంధనాల ద్వారా, నిషేధాల ద్వారా సాధ్యమయ్యేది కాదు.

ప్రతి మానవ ప్రాణికీ ఉన్న ప్రాథమిక హక్కులను మనం ఆమోదించి తీరాలి. ప్రతి వ్యక్తి సమానమైన పౌర హక్కులతో జన్మించాడనే వాస్తవాన్ని, జన్మించిందనే వాస్తవాన్ని మనం ఒప్పుకుని తీరాలి. స్త్రీల సామాజిక హక్కులను ఆమోదించనంతవరకు, వారిని పశువుల వలె కొట్టాలలో బంధించి ఉంచినంత వరకు మన ప్రజలలో సగం మంది బానిసలుగా మిగిలిపోతారు. రాజకీయ స్వాతంత్ర్యం లభించడం వల్ల మనకు సమానత్వం స్వేచ్ఛ అనే హక్కులు అందాయి. కాని నేటికీ స్త్రీల రూపంలో సగం దేశానికి ఆ హక్కులు అందడం లేదు. వెనుకబడిన నాల్గవ వంతు ప్రజలకు కూడా ఈ హక్కులు అందడం లేదు. జనాభాలో నాల్గవ వంతు మాత్రమే ఉన్న అగ్రవర్ణాల పురుషులకే మానవ స్వేచ్ఛ హక్కులు లభించాయి. నాలుగింట మూడువంతుల ప్రజలకు కూడా ఈ హక్కులు లభించాలి. అది జరగనంత వరకు మన స్వేచ్ఛ అసంపూర్ణంగా మిగిలిపోతుంది. మనం సమాజంలోని విడదీయరాని అవయవాలమని గుర్తించాలి. శరీరంలో అవయవాలన్నిటి ప్రయోజనాలు ఒండొంటితో ముడిపడి ఉంటాయి. అలాగే మానవ జాతి యావత్తూ ఒకే పడవలో ప్రయాణిస్తోంది. గడియారంలోని ఒక శీల చెడిపోతే గడియారం ఆగిపోతుంది. శరీరంలోని ఒక అవయవానికి బాధ కలిగితే, దాని ప్రభావం ఇతర అవయవాల మీద పడుతుంది. అలాగే మనమంతా ఒకే గొలుసులోని పూసల వలె ఒండొరులతో ముడిపడి ఉన్నాం. ప్రతి కొక్కెము సరిగా అమరి ఉంటే, గొలుసు బలంగా ఉంటుంది. అవి విడిపోతే గొలుసు అనేది మిగలదు. నూలుపోగులు వేటికవిగా విడిపోతే తాడు అనేది ఎలా మిగులుతుంది? కొబ్బరి ఈనెలు ఆత్మసమర్పణ చేసుకోకపోతే కొబ్బరి చీపురు ఎలా తయారవుతుంది? నీటిబొట్లు తమ స్వార్థాలు చూసుకుంటే ఇంతటి విశాలమైన సముద్రం ఎలా ఏర్పడుతుంది? కులం, జాతి తమ మనుగడ నిలుపుకోడానికి కారణం ప్రజాబాహుళ్యం వాటితో మమేకం కావడమే. ఆదర్శాల కోసం సర్వస్వాన్ని సమర్పించాలనే భావన కలిగిన వ్యక్తుల సమూహమే సమాజం అవుతుంది. జాతి అవుతుంది. శక్తికి మూల బిందువు ఇదే. పరస్పరం కలసి మెలసి ఈ భావనను వికసింపచేసుకోవడం ద్వారానే మన సర్వతోముఖ ప్రగతికి మార్గం సుగమమవుతుంది. పరిమితమైన మన వర్గం స్వార్థాన్ని గురించి ఆలోచించడం ఆధ్యాత్మికవాద ఆదర్శాలకు విరుద్ధం. అందరి హితంలో మన హితం ఉన్నదని మనం భావించాలి. శరీరంలోని ఒక అవయవం బాగా పెద్దదయితే అది బరువనిపిస్తుంది. కొద్దిమంది ధనవంతులు, సంపన్నులు, ధర్మాత్ములు, జ్ఞానవంతులు, బలాఢ్యులు అయినంత మాత్రాన మహత్తర ఉద్దేశ్యాలు నెరవేరవు. మనమంతా సుఖంగా ఉంటే, ధనవంతులుగా ఉంటే, ఆరోగ్యవంతులుగా ఉంటే, శీలవంతులుగా రూపొందితే-అపుడే ప్రతి ఒక్కరి సుఖశాంతులకు రక్షణ లభిస్తుంది. చోరులు, వ్యభిచారులు, హంతకుల మధ్య నివసించే సజ్జనుడు సైతం తన సుఖశాంతులను రక్షించుకోలేడు. అటువంటపుడు సామాజిక అవ్యవస్థ మధ్య వ్యక్తిగత స్వార్థాన్ని సాధించాలని అనుకోవడం వల్ల ప్రయోజనం ఏమి ఉంటుంది? ఒకవేళ సాధించినా, దానిని ఎలా వినియోగించుకోగలుగుతాము?

వ్యక్తిగత స్వార్థాన్ని సామూహిక స్వార్థం కోసం అర్పణ చేయడమే పుణ్యం. దీనినే దేశభక్తి, త్యాగం,బలిదానం,గొప్పతనం వంటి పేర్లతో పిలుస్తారు. ఈ విధానాన్ని అవలంబించి, మనిషి మహాపురుషుడు అవుతాడు. లోక కళ్యాణాన్ని సాధిస్తాడు. తన ఆదర్శం ద్వారా పలువురికి ప్రేరణ ఇస్తాడు. తన సమాజ భవిష్యత్తును వైభవోజ్వలం చేస్తాడు. ముక్తికీ, స్వర్గానికీ మార్గం కూడా ఇదే. భగవంతుడిని పొందటానికి మజిలీ కూడా ఇదే. ఆత్మకు శాంతి, సద్గతి కూడా దీనిపై ఆధారపడి ఉంటాయి. ఇందుకు విరుద్ధమైన మార్గం కూడా ఉంది. ఆ మార్గంలో మనిషి వ్యక్తిగత స్వార్థం కోసం సమాజానికి హాని కలిగించడానికి నడుం బిగిస్తాడు. ఇతరులు ఎంతటి ఆపదలో చిక్కుకున్నా, ఎంతగా కష్టనష్టాలకు

**న గాయత్ర్యాః పరం మంత్రమ్ - గాయత్రిని మించిన మంత్రం లేదు.**

గురి అయినా లెక్క చేయకుండా మనిషి తన స్వార్థాన్నే చూచుకుంటాడు. నేర మనస్తత్వం అని దానిని పిలుస్తారు. నరకానికి దారి ఇదే. దేశద్రోహం, సమాజద్రోహం, ధర్మద్రోహం అని దానినే పిలుస్తారు. ఆత్మ-హననానికీ ఆత్మ-పతనానికీ దారి ఇదే. ఈ దారిలో నడిస్తే మనిషి నరక కూపంలో పడి యమ యాతనలను అనుభవిస్తాడు.

అందరి స్వార్థంలో తన స్వార్థాన్ని సమర్పణ చేసి, వ్యక్తిగత స్వార్థం కన్న సామూహిక స్వార్థానికి హెచ్చు విలువ ఇవ్వాలనే ఆదర్శం యుగ నిర్మాణ సంకల్పంలో చేర్చబడడం మన సర్వతోముఖ వికాసం సాధ్యపడడానికే. ప్రజలంతా పరస్పరం కలసిమెలసి ఒండొరులను ముందుకు తీసుకుపోవడంలో, ఉన్నతులను చేయడంలో, సుఖవంతులను చేయడంలో సహకారం అందిస్తే-మనం ఏ యుగాన్ని తిరిగి స్థాపించడానికి నడుం బిగించామో ఆ యుగం దగ్గరపడుతుంది.

## మన సమాజం అసభ్యం, వివేకరహితం కాకూడదు

అసభ్య సమాజంలో, వివేకం లేని ప్రజల మధ్య నివసించే శ్రేష్ఠవ్యక్తి సైతం ప్రశాంతంగా జీవితం గడపలేడు. అసామాన్యుడూ, మనస్వీ అయిన వ్యక్తి సమాజాన్ని సంస్కరించడానికి అపురూపమైన తన ప్రతిభను వినియోగించి కొంత అనుకూలతను సాధించవచ్చు. పాములు చుట్టివేసినా వన్నె తరగని చందన వృక్షంలా తన మానసిక స్థితిని స్థిరంగా నిలుపుకోవచ్చు. అయితే చాలా కొద్ది మంది మాత్రమే ఆ స్థితిని అందుకోగలుగుతారు. "నన్ను నరకానికి పంపినా, అక్కడ కూడా నేను స్వర్గాన్ని సృష్టించుకుంటాను"- అని ఎమర్సన్ మహాశయుని వలె వక్కాణించగలిగే వారిని వ్రేళ్ల మీద లెక్కించవచ్చు.

చెడ్డవారి మధ్య నివసిస్తే మంచివారికీ కష్టాలు వస్తాయి. నరబలి దురాచారాన్ని పాటించే నిర్దయులు, అవివేకులు, ఆటవికులు, అనాగరికులు అయిన జనుల బస్తీలో నివసించే మంచి మనిషికి భద్రత ఉంటుందా? ఏదో ఒకరోజున తన వంతు వస్తుందని అతడు భయపడుతూ ఉంటాడు. శుచి,శుభ్రతలను ప్రేమించే వ్యక్తికి మురికివాడలో మనశ్శాంతి ఎలా లభిస్తుంది? నలువైపులా చెత్త మురిగిపోయి దుర్వాసన వ్యాపిస్తూ ఉంటే-తన ఒక్క ఇంటిని శుభ్రం చేసుకుని ప్రయోజనం ఏముంది? ఆ దుర్వాసన అతడికి మనశ్శాంతి లేకుండా చేస్తుంది. పేటలో ప్లేగు వ్యాధి ప్రబలితే ఆరోగ్య సూత్రాలను అక్షరాలా పాటించే వ్యక్తి అయినా ఆ వ్యాధి కోరలలో చిక్కుకుంటాడు.

ఒక గ్రామంలో కొద్దిమంది మతకలహాలను రెచ్చగొట్టితే, ముఠా కక్షల వల్ల దౌర్జన్యాలకు దిగితే ప్రభుత్వం ఆ గ్రామంపై సామూహిక జరిమానా విధిస్తుంది. శాంతికాముకులైన ప్రజలు కూడా ఆ శిక్షను అనుభవించవలసి వస్తుంది. అపుడు వారిని సైతం చట్టం నిర్దోషులుగా పరిగణించదు. ఎందుకంటే-తాను ప్రశాంతంగా, గౌరవంగా జీవించడం మాత్రమే గాక-దుర్మార్గులకు నచ్చచెప్పడం, వారిని నిలువరించడం, అవేవీ పని చేయని స్థితిలో వారిని ప్రతిఘటించడం కూడా వ్యక్తికి కర్తవ్యం అవుతుంది. వ్యక్తి గిరి గీసుకుని కూర్చుని, దుర్మార్గాలను అడ్డుకోకపోతే-ఆ అడ్డుకోకపోవడం కూడా పౌరశాస్త్రం ప్రకారం నేరమే అవుతుంది. ఆ నేరానికి శిక్షగా సామూహిక జరిమానా విధించబడినపుడు నేనేం చేశాను, నాకేం సంబంధం, నేను నేరం చేశానా అని వాదిస్తే ఆ వాదన చెల్లదు.

స్వయంగా నేరం చేయకపోవడమే మన నిర్దోషిత్వానికి ప్రమాణం కాదు. దుర్మార్గాలను అడ్డుకోవడం కూడా సభ్యత, సంస్కారం ఉన్న పౌరుని కర్తవ్యమే. తన కళ్ల ఎదుట హత్య, లూటీ, దొంగతనం, మానభంగం వంటి పాశవిక చర్యలు జరుగుతూ ఉంటే చూస్తూ ఊరుకోవడం చట్టరీత్యా నేరంగా పరిగణించబడుతుంది. న్యాయమూర్తి ఆ నేరానికి శిక్ష విధిస్తాడు. ఆ చర్య పిరికితనంగా, మానవీయ కర్తవ్యాల ఉపేక్షగా పరిగణించబడుతుంది. గ్రామంలోని మరొకరి ఇంటిలో బందిపోటు దొంగతనం జరుగుతూ ఉంటే, దొంగలను ఎదిరించటానికై తన తుపాకీని ఉపయోగించడం తుపాకీ కలిగి ఉన్న వ్యక్తి కర్తవ్యం. తుపాకీ కలిగి ఉన్న ఆ వ్యక్తి భయపడి తన ఇంటిలో కాళ్లు ముడుచుకుని కూర్చుంటే, అడ్డూ అదుపూ లేకుండా బందిపోటు దొంగతనాలు సాగిపోతూ ఉంటే-అందుకు బందిపోట్లతో పాటు ఆ తుపాకీ కలిగిన వ్యక్తి కూడా నేరస్థుడుగా పరిగణించబడతాడు. ప్రభుత్వం అతడి తుపాకీని జప్తు చేస్తుంది.

చెడ్డపనులు తాను చేయకపోవడం, ఇతరులను చేయనివ్వకపోవడం సభ్యత గల ప్రతి పౌరునికీ కర్తవ్యాలని సమాజ శాస్త్రం చెపుతోంది. పౌరుడు తాను నేరం చేయకూడదు, ఇతరులను నేరం చేయనివ్వకూడదు. తాను పాపం చేయకపోయినా - పాపులను ఎదిరించకపోవడం పాపాన్ని పోషించడమే అవుతుంది. ఎందుకంటే-అడ్డూ అదుపూ లేనపుడు పాపం పెచ్చుపెరిగి పోతుంది. మనమంతా ఒకే పడవలో ప్రయాణిస్తున్నాం. మనలో ఒకడు పడవకు చిల్లు పెడితే, అటూ ఇటూ గెంతులు వేసి పడవను ఊగిసలాడేటట్లు చేస్తే - అతడిని అడ్డుకోవడం పడవలోని ఇతర వ్యక్తులకు కర్తవ్యం అవుతుంది. మేమేం చేస్తాం, మా తప్పేముంది,

**సంశయాత్మా వినశ్యతి - అనుమానపరుడు నశిస్తాడు.**

చిల్లు పెట్టింది మేము కాదు కదా - అని వాదించే హక్కు ఎవరికీ లేదు. చిల్లు పెట్టేవాడిని అడ్డుకోకపోవడం కూడా చిల్లు పెట్టడం అంత నేరమే. మానవ సమాజం పరస్పరం సాన్నిహిత్యంతో బంధించబడి ఉంది. కనుక మనిషి తన పాప ఫలితాన్నే కాక ఇతరుల పాపఫలితాన్ని కూడా అనుభవించవలసి వస్తుంది. జయచంద్రుడు, మీర్జాఫర్ చేసిన దేశద్రోహం వల్ల భారతప్రజలు ఎంతోకాలం బానిసత్వంలో మ్రగ్గవలసివచ్చింది.

మన సమాజంలో నలువైపులా అజ్ఞానం, అవివేకం, దుష్టసంస్కారాలు, గుడ్డి నమ్మకాలు, అవినీతి, అసభ్యతల వాతావరణం వ్యాపించి ఉంటే - దాని ప్రభావం మనమీద కాకున్నా మన కుటుంబంలోని పసి మనసులపై తప్పక పడుతుంది. అశ్లీలమైన పాటలు, అశ్లీలమైన సినిమాలు, అశ్లీలమైన నృత్యాలు, అశ్లీలమైన పుస్తకాలు, అశ్లీలమైన చిత్రాలు ఎన్నెన్ని పసి మనసులను ప్రభావితం చేస్తున్నాయో, పెడత్రోవ పట్టిస్తున్నాయో మనం మన కళ్లతో చూస్తున్నాం.

సమాజంలో వ్యాపించి ఉన్న దుష్ప్రవృత్తులను నిరోధించడం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు. ఆ బాధ్యత సభ్యత గల పౌరులపై కూడా ఉంది. జాగరూకుల, మనస్వుల ప్రతిఘటన వల్ల దుష్ప్రవృత్తులు నేడు కాకుంటే రేపయినా నాశనమై తీరుతాయి. ఆనాడు మేధావులు బ్రిటిషు పాలనపై తిరగబడినపుడు - ఆ తిరుగుబాటు వ్యర్థంగా మిగిలిపోయిందా ? జాప్యం జరిగింది. కష్టనష్టాలు కలిగాయి. అయినా ఆ ఉద్యమం సఫలమయింది. అలాంటి మహోద్యమాలు జరగనందువల్లనే అవినీతి, అవివేకం, గ్రుడ్డి నమ్మకం, అశ్లీలత సమాజంలో మిగిలి ఉన్నాయి. అలాంటి స్థాయిలో ప్రతిఘటన జరిగితే - మన సామజిక కాలుష్యం నిర్మూలం అవుతుంది. సభ్య సమాజంలోని సభ్యత గల పౌరులని పిలిపించుకునే గౌరవం మనకు తప్పక లభిస్తుంది.

ప్రపంచమంతా పరస్పర సహకారం ఆధారంగా పురోగమిస్తోంది. మనిషి ఒక సామాజిక జీవి. పరస్పర సహకారం ఆధారంగానే అతడు ముందడుగు వేశాడు. ఉన్నతిని సాధించాడు. ప్రేమ, మమత, ఆత్మీయత, సహకారం, ఔదార్యం నిండిన స్థలం స్వర్గం అయింది. వ్యక్తి తనకోసం కాక సమాజం కోసం జీవించాలి అన్నది సమాజవాదం, సామ్యవాదం ప్రతిపాదించే సిద్ధాంతం. సామూహికమైన సుఖశాంతులను పెంపొందించడానికై వ్యక్తి తన సుఖసమృద్ధులనూ, సౌకర్యాలను త్యాగం చేయాలని ఆ వాదాలు చెపుతున్నాయి. వ్యక్తి తన ధనాన్ని, వైభవాన్ని, సంపదను కనీస అవసరాలకే వినియోగించాలనీ, మిగిలిన దానినంతా అందరి సామూహిక ఉద్ధరణకు వినియోగించాలనీ ధర్మం, ఆధ్యాత్మికత ప్రబోధిస్తున్నాయి. అలాంటి పరమార్థ పరాయణులతో కూడిన సమాజం ఫలిస్తుంది. పుష్పిస్తుంది. సుఖవంతం అవుతుంది. స్వార్థపరత్వం, కీచులాట, కూడబెట్టే ధోరణి పెరిగితే చెడ్డపనులు పెచ్చుపెరుగుతాయి. మామూలు పౌరుని స్థాయికి బాగా మించిన స్థాయిలో సుఖభోగాలను అనుభవించాలనే ధోరణి వృద్ధి చెందితే-దోపిడీ, అన్యాయం, దురాచారం, ఘర్షణ, అసూయ మున్నగు చెడుగులు విజృంభిస్తాయి.

వివేకం, న్యాయం, అనుశాసనం, సంయమనం, నిజాయితీ, సామాజిక స్పృహ, సత్ప్రవర్తన, ఆత్మ గౌరవం వంటి సద్గుణాల సమ్మేళనమే సంస్కృతి. భారతీయ సంస్కృతి ఖచ్చితంగా ఇదే. ఈ సంస్కృతి ఆధారంగానే మనం ప్రాచీన కాలంలో వైభవాన్ని పొందాము. మనం వ్యక్తిలో, సమాజంలో ఈ గుణాలను నిర్మాణం చేయాలి. వికసింపచేయాలి. వేషభూషలు, చదువు, ధనం, పదవి మున్నగునవి కారణంగా మనం నాగరికులమని చెప్పుకోవడం దురదృష్టకరం. నిజమైన సభ్యత మానవీయ గుణాల సామూహిక విస్తరణపైననే ఆధారపడి ఉంటుంది. వాటి ఆధారంగానే ఏ సమాజమైనా, ఏ జాతి అయినా ఫలించి పుష్పిస్తుంది. అపుడు మాత్రమే దాని పౌరుల నిజమైన ప్రయోజనాలు సాధించబడతాయి.

సాంఘిక దురాచారాలు, సామూహిక దుష్ప్రవృత్తులు నిలచి ఉండడం అనేది సజ్జనులకు కూడా ఆపదలను తెచ్చిపెడుతుంది. వ్యక్తి ఎంతటి ఔన్నత్యాన్ని సాధించినా పతిత వాతావరణంలో ఆ ఔన్నత్యం ఇసుక గోడలా అస్థిరంగా ఉండిపోతుంది. కనుక మనం వ్యక్తిగత ఔన్నత్యానికి ఇచ్చే ప్రాముఖ్యాన్ని సామాజిక ఔన్నత్యానికి కూడా ఇవ్వాలి. అందుకోసం అన్ని విధాలా కృషి చేయాలి. దాని పట్ల ఉపేక్ష మనకు వ్యక్తిగతంగా ప్రమాదం తెచ్చిపెడుతుంది. మన ఆరోగ్య సమస్యలను, సంపాదన సమస్యలను పరిష్కరించడం ఎంత అవసరమో సాంఘిక సంస్కరణపై దృష్టి నిలుపడం అంత అవసరం. మనం నిర్దోషులం అయినా సామాజికమైన పాపాలలో భాగస్వాములం అవుతాం. భూకంపాలు, కరవులు, యుద్ధాలు, మహమ్మారుల వంటి ప్రమాదాల రూపంలో ప్రకోపాల రూపంలో పరమేశ్వరుడు మనపై సామూహిక శిక్ష విధిస్తూ ఉంటాడు. మనం మనల్ని మాత్రమే కాక సమాజాన్ని కూడా సంస్కరించాలని హెచ్చరిస్తాడు. కనుక మనం నాగరికులుగా తయారైతే చాలదు. సమాజాన్ని కూడా నాగరికంగా తయారు చేయాలి.

H H H

**ఉపార్జితానాం విత్తానాం త్యాగ ఏవహి రక్షణమ్ - సంపదకు త్యాగమే రక్షణ.**

వ్యక్తి నిర్మాణం

# ఆత్మవిశ్వాసం ఒక సంజీవని

ప్రపంచంలో మూడురకాల మనషు లుంటారు. ఒకరు ఆత్మవిశ్వాసం గలవారు. రెండవవారు ఆత్మనిషేధులు. మూడవవర్గం సంశయాత్ములు. ఒక వర్గంవారు తమ కృషి, ప్రయత్నాల బలంతో సమాజాన్ని ప్రభావితం చేస్తారు. తమ స్థానాన్ని పదిలంచేసుకుని, జీవితాన్ని సార్థకం చేసుకుంటూ, చరిత్రపుటలలో చెరగని ముద్ర వేసుకుంటారు.

రెండవ వర్గం వారు నిషేధాత్మక, నకారాత్మక భావాలతో నిరాశా, నిస్పృహలు పొందుతారు. వారిలో ఉత్సాహం ఉండదు, సాహసం ఉండదు. అంతా తమ తలరాత అని ఏడుస్తూ, ఏడిపిస్తూ బ్రతుకుతారు. నిరర్థకమైన జీవితం గడిపి ఎందుకూ కొరగా కుండా మరణిస్తారు.

మూడవ వర్గం వారు తర్క వితర్కాలతో, తర్జన భర్జనలతో అమూల్యమైన తమ సమయాన్ని శక్తినీ నశింపచేసుకుంటారు. ఏదో చేస్తున్నామనే భ్రమతో ఏమీచేయకుండానే అసంతుష్టితో జీవితాన్ని ముగిస్తారు. వారి జీవితం ప్రయోజనం లేకుండానే గడచిపోతుంది.

ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తులందరూ ఆత్మవిశ్వాస వర్గానికి చెందినవారే. వారికి తమ మీద, తమ శక్తి మీద విశ్వాసం ఉంటుంది. ఏం చేయడానికైనా సాహసం ఉంటుంది. ఏ పని చేపట్టినా పూర్తి సంకల్పంతో లగ్నమై దానిని పూర్తిగా సాధిస్తారు దారిలో ఎన్ని అవరోధాలు వచ్చినా లెక్కచేయరు. ఆశ, సాహసం, కృషి వారిలో ఎక్కువగా ఉంటాయి. వారు ఎట్టి పరిస్థితులలోనూ తమ కార్యాన్ని పరిత్యజించరు.

ఆత్మవిశ్వాసం గలవారు మెచ్చుకోదగిన కర్మవీరులు. వారికి ఉన్నతమైన ఉద్దేశాలు, ఆదర్శాలు ఉంటాయి. హేయత, హీనత, నికృష్టత వారి వద్దకు చేరవు. ఆత్మవిశ్వాసం ఎప్పుడైతే ఉంటుందో, అప్పుడు వారు వెనుకంజవేసే అవసరంమేది? పదండి ముందుకు, పదండి త్రోసుకు, పదండి పోదాం పైపైకి అనే నినాదం వారిది. ఆదర్శం గొప్పగా ఉంటే పురుషార్థం ఉన్నతంగా ఉంటుంది. వారు తమ శక్తి సామర్థ్యాలను ద్విగుణీకృతం చేసుకుంటారు. వాటిని చక్కగా ఉపయోగించుకుంటారు. నిత్యనూతనమైన ఉత్సాహంతో కర్తవ్య పథంలో ముందుకు సాగుతారు. కొత్త కొత్త ప్రయత్నాలు, ప్రయోగాలు చేస్తారు. ప్రతికూలతలను, అవరోధాలను ధైర్యంగా ఎదుర్కొంటారు. పరాజయం పలాయనవాదం వీరివద్ద ఉండవు. పోరాటమే వీరి నినాదం. కర్తవ్యమే వీరి ధర్మశాస్త్రం. అటువంటి వీరోచిత స్వభావం గలవారికే విజయమకుటం ధరించే అవకాశం కలుగుతుంది.

ఆత్మ అనంతశక్తుల భాండాగారం. ఇందులో లేని శక్తి సామర్థ్యాలు మరెక్కడా లభించవు. సందేహమేమిటి? ఆత్మ పరమాత్మలోని అంశేగదా! పరమాత్మ ఒక్కడే సర్వ సమర్థుడు, సర్వశక్తిమంతుడు, సర్వగుణ శీలుడు. ఆయన నుండి ఆ గుణాలు ప్రవహించి ప్రపంచానికి లభిస్తాయి. ఆయన అంశయైన ఆత్మలో ఆ గుణాలన్నీ ఉండటం సహజం. ఆత్మయందు విశ్వాసం కలిగిఉండడం, పరమాత్మయందు విశ్వాసం కలిగిఉండడమే అవుతుంది. పరమాత్మయందు విశ్వాసం కలిగిఉండి, ఆయన ఆశ్రయాన్ని పొందటం జరిగితే తక్కువ అనేది ఉండదు. అటువంటి ఆస్తికుని ఎదుట శక్తులు అనుచరులవలె నిలిచి అతడు తమ నెప్పుడు పిలిచి ఉపయోగించుకుంటాడా అని ఎదురుచూస్తుంటాయి.

ఆత్మలోని శక్తికోశం దానంతటది తెరుచుకోదు. మనం ప్రయత్నించి తెరవాలి. ఈ ప్రకటనకు తాళం చెవి శుభసంకేతం. అంటే గళం "నేను ఈ పని చేయగలను. నాలో ఈపని చేసే సాహసం ఉన్నది, ఉత్సాహం ఉన్నది, శక్తి ఉన్నది. నాకు పురుషార్థమంటే అనురాగమున్నది, కష్టపడటం నా ప్రియతమమైన వ్యసనం. విఘ్నాలు, బాధలు నన్నేమీ చేయలేవు. పోరాటం నా జీవితంలో విడరాని భాగం. నేను మనిషిని. నా జీవితానికి ఒక లక్ష్యం ఉన్నది. దాన్ని నెరవేర్చడానికి నా తను, మన, జీవనాలను సంపూర్ణంగా వినియోగిస్తాను. సాఫల్యంలో ఆసక్తి, వైఫల్యంలో భయం నా దరిజేరవు. శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పిన అనాసక్త కర్మయోగానికి నేను అనుయాయిని. నాకు తెలుసు-లక్ష్యప్రాప్తికి, ఉద్దేశపూర్తికి సాఫల్యం, పరాజయం సోపానాల వంటివని. సాఫల్యం నన్ను మదమత్తుని చేయదు. పరాజయం నాకు నిరాశ కలిగించదు. నాకు అఖండమైన ఆత్మవిశ్వాసం ఉన్నది. నేను ఈ పనిని పూర్తిగా చేసి తీరుతాను'' - అని గట్టిగా ప్రకటన చేయాలి.

ఈ విధంగా శుభ, సృజనాత్మక సంకేతాలను ఇస్తుండటం వల్ల ఆత్మ అనే పద్మకోశం విచ్చుకుంటుంది. అందున్న శక్తులు సుగంధం వలె వ్యాపించి పురుషునిలో పడుగు-పేకగా కలిసిపోతాయి. నేను ఈ పని చేసితీరుతాను - అనే భావం కలగటంతోనే శరీరం, మనస్సు, ఆత్మలకు సంబంధించిన సర్వ ఉత్పాదక శక్తులూ ఏకత్రితమై వ్యక్తిని కార్యోన్ముఖుని చేస్తాయి. అవి అతడిలో అక్షయమైన ఉత్సాహాన్నీ, సాహసాన్నీ, ఆశనూ పెంపొందిస్తాయి. మార్గ మధ్యంలో వచ్చే బాధలన్నీ భయపడి తొలగిపోతాయి. అడుగడుగుతో లక్ష్యం

**క్లిష్ట పరిస్థితిలోనే మనిషి శక్తియుక్తులు వెలికివస్తాయి.**

స్పష్టంగా కనిపిస్తుంది. శుభ సంకేతాలవల్ల కలిగే ఆత్మవిశ్వాసం ఆత్మవరకే పరిమితం గాదు. అది క్రియలుగా, ప్రక్రియలుగా మార్పు చెంది సిద్ధిని కలిగిస్తుంది.

కాని ఆత్మనిషేధి వర్గానికి చెందిన వ్యక్తి తన శుక్తులన్నింటినీ నెగెటివ్‌గా మార్చుకుని నష్టపోతాడు. ఆత్మనిషేధం ఆసురీప్రవృత్తి. ఆత్మవిశ్వాసం దేవప్రవృత్తి. ఆత్మలోని శివశక్తి ఆసురీప్రవృత్తి గలవారికి ఏవిధంగా సహాయపడుతుంది? ఆత్మనిషేధమన్నా నాస్తికత అన్నా ఒకటే. నాస్తికులైనవారు పరమాత్మను వదలివేస్తే పరమాత్మ అంతకుముందే వారిని వదలివేస్తాడు. ఆవిధంగా పరమాత్మచే నిరాకరింపబడినవారికి పద్నాలుగు లోకాల్లోనూ మంచి జరుగుతుందనే ఆశ లేదు. అటువంటి నాస్తికవాద ఆత్మనిషేధకుల నావ భవసాగరం మధ్యలో మునిగిపోయేది ఖాయం.

ఆత్మనిషేధి దేవత్వ భావనలన్నిటినీ కోల్పోతాడు. అతడు ఒంటరిగా ఆత్మబహిష్కృతస్థితిలో మునిగినవానివలె వ్యర్థంగా, ఊరు, పేరూ లేకుండా అంధకారంలో మునిగిపోతాడు.

ఆత్మ నిషేధి దౌర్భాగ్యం - అతడి లోపల అశుభమైన నకారాత్మక సంకేతాలు (నెగెటివ్ సజెషన్స్) తయారై దయ్యాల పిలుపులవలె వినిపిస్తుంటాయి. అతడి మలిన మానసంలో ప్రతిధ్వనించే మాటలు "నేను ఈ పని చేయలేను. ఆ పని చేసే శక్తి నాకు లేదు. నాదగ్గర సాధనాలు లేవు. నాకు సమయం అనుకూలంగా లేదు. నాకు యోగ్యత తక్కువ. కార్య సాఫల్యం నా నుదుట వ్రాసిలేదు.'' ఈ విధంగా నకారాత్మక సంకేతాలను వినీ వినీ, జీవితం నిర్జీవంగా, నిర్బలంగా తయారవుతుంది. నిరాశ, నిస్పృహ, భయం మనస్సును నింపివేస్తాయి. ద్వంద్వాలు పెనవేసుకుంటాయి. తను, మనో, మస్తిష్కాల శక్తి శిథిలమైపోతుంది. అంతఃకరణ అలిసి నిష్క్రియమవుతుంది. శరీరం డీలా పడుతుంది. మనస్సు నీరసిస్తుంది. ఇక అతడు ప్రపంచంలో దేన్నీ చేయలేడు. అన్నిట్లో వెనకబడిపోతాడు. కుమిలిపోతూ జీవితం గడుపుతాడు.

మూడోవర్గంవారు సంశయాత్మలు. వీరి పరిస్థితి మరింత దరిద్రంగా ఉంటుంది. ఆత్మవిశ్వాసి పొగడ్తలను పొందుతాడు. ఆత్మ నిషేధి దయనీయ స్థితిలో ఉంటాడు. ఆత్మ సంశయి పరిహాసాలకు గురిఅవుతాడు. అతడు ప్రతి విషయంలోనూ అవునా, కాదా అని గుంజాటన పడుతుంటాడు. ఎంతో ఉత్సాహంతో ఒక పనిని మొదలు పెడతాడు. కొంచెంసేపటికే సంశయం కలుగుతుంది. నావల్ల ఈ పని పూర్తవుతుందా అని అనుమానం. నాకు అందుకు తగిన శక్తి సామర్థ్యాలున్నాయా అని అనుమానం. మనసు శూన్యమవుతుంది. అయోగ్యత దానిలోనికి దిగుతుంది. భయంతో పని వదలివేస్తాడు. ఎంతోకాలం వ్యర్థం. ప్రయోజనం శూన్యం.

సంశయాత్మక వ్యక్తి జీవితమంతా ఇదే విధంగా జరిగిపోతుంటుంది. పని మొదలుపెట్టటానికి సాహసం ఉండదు. మొదలుపెట్టినా పూర్తి గాదు. ఎంతసేపూ తర్క-వితర్కాలు. తన జీవితమంతా వ్యర్థం చేసుకోటం. గాలిమేడలు కట్టటం. మనస్సు స్థిరంగా ఉండదు. విశ్వాసం అసలే ఉండదు. ఇంతకుముందు చేసింది లేదు. ఇక ముందు చేయగలిగేది లేదు. పరిహాస్పదంగా జీవితం గడిచిపోతుంది.

ఆత్మనిషేధం ఒక భయంకరమైన శాపం. దీని ప్రభావం మనస్సు మీద, మస్తిష్కం మీద మాత్రమే గాకుండా సంపూర్ణ జీవన వ్యవస్థమీద పడుతుంది. నేను ఈపని చేయలేను. ఇటువంటి భావన రావటంతోనే మనస్సు, మస్తిష్కం సహకరించటం మానివేస్తాయి. శరీరం పని చేయదు. రక్తప్రవాహం సరిగా జరగదు. దీనివల్ల ఎన్నో అవకతవకలు వస్తాయి. రక్తంలోని పోషకశక్తి క్షీణిస్తుంది. రోగాలు వస్తాయి. అటువంటివాడు ఏపనీ చేయలేడు. ఆత్మనిషేధం విషతుల్యమైనది. దీనినుండి మనం రక్షించుకోవాలి.

ఆత్మవిశ్వాసం జీవితానికి సంజీవనిశక్తి వంటిది. నేను ఈ పనిని తప్పనిసరిగా చేస్తాను - అన్న విశ్వాసం కలగగానే మానవుని మనస్సులో ఆశ, ఉత్సాహం ఉత్పన్నమవుతాయి. జీవిత వ్యవస్థ అంతా సంఘటితమవుతుంది. పురుషార్థం కోసం తన శక్తిని, సేవను సమర్పిస్తాడు. రక్త ప్రవాహంలో ఒక స్వస్థత ఉల్లాసం, నాడులలో స్నిగ్ధత కలుగుతాయి, జీవనశక్తి సహకరిస్తుంది. కర్మేంద్రియాలూ, జ్ఞానేంద్రియాలూ అన్నీ క్రియాన్వితమై సహకరిస్తాయి. మనో, మస్తిష్క, శరీరాలు ఆరోగ్యవంతంగా ఉంటాయి. ప్రసన్నత కలుగుతుంది. చురుకుతనం ఉంటుంది. లక్ష్యంవేపు భయం లేకుండా పయనిస్తాడు.

ఈ విధంగా విశ్లేషించుకుంటే మనం ఏ వర్గానికి చెందిందీ తెలుసుకోవచ్చు. ఆత్మవిశ్వాసి? ఆత్మనిషేధి? సంశయి? ఆత్మవిశ్వాసి ఐతే మీకు శుభం కలుగుతుంది. ఈ విశ్వాసాన్ని మరింతగా వికసితం చేసుకోండి. కొత్త కొత్త పనులు ప్రారంభించండి. జీవితాన్ని సంపూర్ణంగా సఫలం చేసుకుని ముందుకు నడవండి.

మీరు ఆత్మ నిషేధి, ఆత్మ సంశయీ అయితే వెంటనే ఆగిపోయి, మీ భావధారను సరియైన దిశకు మళ్లించుకోండి. సంపూర్ణశక్తిని అందుకు వినియోగించండి. ఆత్మలో, పరమాత్మలో విశ్వాసం పెంపొందించుకోండి. మీ మనస్సుకూ మస్తిష్కానికీ శుభ సంకేతాల నందించండి. మీ దివ్యపరంపర సహాయం తీసుకోండి. పరమపితను స్మరించండి. సాహసంతో శ్రేయోపథంలో ముందుకు నడవండి. ఆత్మ మీకు సహకరిస్తుంది. పరమాత్మ సహాయం మీకు లభిస్తుంది.

అనువాదం : డి.వి.ఎన్.బి.విశ్వనాథ్

**ఆత్మను నిర్మలం చేయడం, ఇంద్రియాలను అదుపు చేయడం, వాటిని పరమాత్మలో కలపడం – ఈ ప్రక్రియ పేరే యోగం.**

## ఆనంద స్వరూపం
# భోగం కాదు, త్యాగం

ఆనందాన్ని పొందడం మన ప్రధాన లక్ష్యం. మనం రాత్రింబవళ్లు ఆ ప్రయత్నంలోనే ఉంటాం. ఎవరు ఏ స్థితిలో ఉంటే వారికి ఆ స్థితిలో ఆనందానుభూతి కలుగుతోంది. స్వచ్ఛమైన సహజ సంపద, నిర్మలమైన గాలీ నీరు ప్రకృతి మాత ఇచ్చే అనేక వరాలు తమకు అందుతున్నాయని గ్రామీణులు సంతోషిస్తారు. పట్టణవాసుల సంతోషం ఇంతకన్న తక్కువేమీ కాదు. వారి సౌకర్యాలు వారికి ఉన్నాయి. విద్యాలయాలు, ఆసుపత్రులు, సినిమాలు, పార్కులు మున్నగు ఎన్నెన్నో సౌకర్యాలు లభించడంవల్ల వారు సంతోషిస్తున్నారు. ఒకడు ఒకే స్థలంలో స్థిరంగా ఉండి సుఖపడతాడు. ఒకడికి తిరుగుతూ ఉండడం సంతోషాన్ని ఇస్తుంది. కొందరికి వ్యవసాయమంటే ఇష్టం. కొందరికి ఉద్యోగమంటే మక్కువ. సైనికునికి తన దేశం ముఖ్యం. వర్తకునికి తన దుకాణం ముఖ్యం. ప్రతి ఒక్కడూ తనకు నచ్చిన దాన్ని వెదికి అందులో ఆనందం అనుభవిస్తాడు. పశువులకు కూడా అసంతృప్తి లేదు. ఎందుకంటే - వాటికి చావు భయం లేదు. తమ స్థలాన్ని మార్చుకోవడానికి అవికూడ వెనుకంజ వేస్తాయి. తాత్పర్యం ఏమంటే - ఇక్కడ అందరూ సుఖంగా జీవిస్తున్నారు. ఆ ఆనందం సార్థకమా కాదా, సముచితమా కాదా, సాత్వికమా అసాత్వికమా - అన్నదే ఆలోచించవలసిన విషయం.

**భోగం వల్ల రోగం :** సహజమైన ఆనందంవల్లనే ఆత్మసంతృప్తి లభిస్తే - ఈ ప్రశ్నకు అంత ప్రాముఖ్యం ఉండదు. రుచికరమైన భోజనం ఆనందాన్ని ఇస్తుంది. రకరకాల మిఠాయిలు, కారపు పదార్థాలు పరమాన్నాలు లభించాలని అందరూ కోరుకుంటారు. వాటివల్ల ఇంద్రియ సుఖం లభిస్తుంది కూడా. అయితే ఈ ఆనందంలో ఒక దోషం ఉంది. భోగం వల్ల రోగం జనిస్తుంది అనే సామెత ప్రకారం - ఇంద్రియ సుఖాలన్నీ నిజమైన ఆనందాన్ని ఇవ్వలేవు.

**శాశ్వత ఆనంద స్వరూపం :** వికృతి, వికారం లేనిదే పూర్తి ఆనందం. ఎలాంటి అనుమానాలకూ, కొరతలకూ, ఇబ్బందులకూ ఆస్కారం లేనిదే పూర్తి ఆనందం. మామూలు జీవితంలో మనకు లభించే ఆనందం మనకు అలవాటయిపోయింది. అది అనుచితం అయినా మనకు అలా అనిపించదు. కనుక ఆనందాన్ని పరీక్షించడానికి ఒక గీటురాయి అవసరం అవుతున్నది. కల్తీలేని ఆనందాన్ని పొందడానికై మనం మన దృక్పథాన్ని సవరించుకోవడం అవసరం.

**గాలికి తిరగడం ఆపండి :** లౌకికమైన ఆనందం సిద్ధిని ఇవ్వదు. దానివల్ల జీవన లక్ష్యం నెరవేరదు. ఆలోచన, బుద్ధి, వివేకం అనే అసాధారణ శక్తులు మనిషికి లభించాయి. వాటిని భౌతిక సుఖాలను పొందడానికి మాత్రమే వినియోగిస్తే అందులో ప్రత్యేకత లేదు. జీవితమనే దీపం ఆరిపోకముందు మనం ఎవరము అని తెలుసుకున్నామా అనేది పరిశీలించదగిన విషయం. ఈ ప్రశ్నకు సమాధానం పొందడం వివేకానికి చివరిమెట్టు. ఆత్మజ్ఞానం ఆనందానికి మూలం. మనిషి ఈ విషయంలో అజ్ఞానిగా ఉండిపోతే - లౌకిక జీవనంలోనూ గాలికి తిరగడం తప్పదు. ఆత్మను శరణు చొచ్చినప్పుడే సిద్ధి లభిస్తుంది. ఆత్మజ్ఞానం లేకపోతే మనిషికి ఎదురయ్యే ఇతర అనుమానాలు తొలగడం సాధ్యపడదు. లౌకిక సుఖాలలో పూర్తి ఆనందం లేదనీ, తనను తాను తెలుసుకోవడంలోనే అది ఇమిడి ఉన్నదనీ దీనివల్ల రుజువవుతోంది.

**లౌకిక సుఖం క్షణికం :** మనం రోజూ ఆనందం పొందే సాధనాలను మార్చుతూ ఉంటాం. ఒక్కొక్క సాధనాన్ని ప్రయోగించి చూస్తూ ఉంటాం. కొద్ది ఆనందం కన్న మరింత విశుద్ధమైన, మరింత పరిపూర్ణమైన ఆనందం కోసం వెదుకుతున్నామని దీనివల్ల స్పష్టమవుతోంది. ఒక వస్త్రం ధరిస్తాం. దాని మంచి చెడ్డలు తెలుస్తాయి. ఈసారి బట్టలు కొనేటప్పుడు వాటిలో పూర్వపు బట్టలలో ఉన్న లోపాలు ఉండకుండా జాగ్రత్తపడతాం. అవి మరింత ఆకర్షకంగా ఉండాలని చూస్తాం. అందువల్ల మన అభిరుచికూడా విశుద్ధం అవుతుంది. ఆనందం కూడా విశుద్ధం అవుతుంది. పరిపూర్ణమూ, శాశ్వతమూ అయిన ఆనందాన్ని మనం కోరుకుంటాం. అలాంటి ఆనందం లౌకిక జీవనంలో లభ్యం కాదు. అప్పుడు పారలౌకిక జీవనం విషయం దృష్టికి వస్తుంది. ఆత్మ, పరమాత్మలపై దృష్టి మరలుతుంది. ఈ సిద్ధి భగవానుని

**త్రివర్గోయం దాంపత్య మధిగచ్ఛతి - దాంపత్యము ధర్మార్థకామములను సాధిస్తుంది.**

శరణు పొందడం వల్ల లభిస్తుంది.

**దృక్పథాన్ని మార్చుకోవాలి :** కానీ, ఈ విషయం జనానికి అర్థం కాదు. వారు లౌకిక సుఖాలపట్ల ఆసక్తి చూపుతారు. దృక్పథాన్ని మార్చుకోవడానికి ఇష్టపడకపోవడమే ఇందుకు కారణం. సూర్యుడు రోజూ ఒకేవిధంగా ఉదయిస్తాడు. రోజూ ఉదయించే సూర్యుడే కదా అని మనం అనుకుంటాం. కాని, మనం మన దృక్పథాన్ని కొద్దిగా మార్చుకుంటే, విరాట్ జగత్తులోని మహత్తరమైన, క్రియాశీలమైన శక్తితత్వంగా సూర్యుని గురించి ఆలోచిస్తే - ఆ మహాప్రాణం ఎన్నో విచిత్రాలతో కూడినదనీ, జీవనదాత అనీ అర్థమవుతుంది. దృక్పథం మారడంవల్ల అర్థంచేసుకునే స్థితి మారుతుంది. మనం క్రమంగా మరింత ఆనందం వైపు ముందడుగు వేస్తూ పోతాం. నిత్య జీవితంలో జరిగే ఎన్నో సంఘటనలు సామాన్యమైనవిగా కనిపిస్తాయి. కాని వాటిలో ఎంతో ప్రత్యేకత, ఎంతో విజ్ఞానం దాగి ఉంటాయి.

మన దృక్పథం బోధించేదిగా ఉండదు కనుక దానిలో లోతు ఉండదు. కనుక, మనం గొప్ప విషయాలను వదిలివేస్తాం. స్థూలంగా అనుభవించడానికి వీలయ్యే సుఖాలను గురించి మాత్రమే ఆలోచిస్తాం.

**దృష్టిని బట్టే సృష్టి :** దృక్పథం మారితే వస్తువులన్నీ మారినట్లు కనిపిస్తుంది. జగద్గురు శంకరాచార్యులు చెప్పారు - 'ఈ ప్రపంచం ఒక మరుభూమి. ఇందులో సుఖం కావాలంటే భగవానుని శరణు పొందు. ఆయుష్షు, సిరిసంపదలు, కీర్తి, ప్రాపంచిక సుఖాలు - అన్నింటినీ పొందడం ఈశ్వర పరాయణత ద్వారానే, ఆత్మ చింతన ద్వారానే సాధ్యపడుతుంది.' ఇదే దైవీ సంపత్తి. కాని ఈ విషయం మనకు అర్థం కాదు. ఎందుకంటే మనం సుఖం పట్ల, ప్రపంచంపట్ల మన వైఖరిని మార్చుకోలేదు. దృక్పథం మారితే అంతటా ఆనందమే వ్యాపించినట్లు కనిపిస్తుంది.

**భోగంలో కన్న త్యాగంలోనే ఆనందం :** మనం భోగంలో ఆనందం అనుభవిస్తున్నాం. ఈ ప్రపంచంలో గొప్ప విషయాలు మరిన్ని ఉన్నాయని గుర్తించడం లేదు. ఆలోచనవల్ల ఆత్మ, పరమాత్మ ఉన్నవన్న విషయం అర్థమైతే భోగంలో కన్న త్యాగంలో మరింత ఆనందాన్ని పొందుతాం. అప్పుడు రోజూ మూల లక్ష్యం వైపు ముందడుగు వేస్తూ పోతాం. పరమేశ్వర చింతనలో ఆనందం లభించదనే ఫిర్యాదు అప్పుడు ఉండదు. ఇదంతా దృక్పథంలోని ఔన్నత్యం పై ఆధారపడి ఉంటుంది. గతంలో పనులన్నీ భౌతికమైన ఔన్నత్యం కోసం జరిగాయి. అలాగే ఆధ్యాత్మిక సాఫల్యాలపై కూడ మనస్సు లగ్నం కావచ్చు. అయితే ముందు మన లక్ష్యం నిర్ణయం కావాలి. నేను శరీరం కాదు, ఆత్మ - అనే దృష్టితో మన ప్రతి పనీ పూర్తికావాలి.

ఆధ్యాత్మిక ఆనందం భౌతికమూ, స్థూలమూ అయిన ఆనందంకన్న వేయిరెట్లు అధికమైనది. భోగంలో కన్న త్యాగంలో హెచ్చు ఆనందం ఉంది. శరీరంలో కన్న ఆత్మలో ఆనందానుభూతి హెచ్చు. కనుకనే - మనిషి శారీరక అవసరాలను తీర్చుకోవడంలోనే మునిగిపోకూడదనీ, మానవ జీవనం వంటి అసాధారణమైన సంఘటనను అంతరిక దృష్టితో పరిశీలించాలనీ విజ్ఞులు అనాదిగా ప్రేరణ ఇస్తూ వచ్చారు. విషయ సుఖాలు బంధనాలు లేనివి కావు. వానికి సాధనాలు తప్పనిసరి అవుతాయి. అజ్ఞానంవల్ల మనం సముచితమైనదిగా పరిగణించేదే నిజానికి వ్యాధి కలిగించేది అవుతుంది. ఆనందం కోసం చేసిన పని చెదురుబాటును కలిగిస్తే - ఆ ఆనందాన్ని విశుద్ధమూ, సంపూర్ణమూ, మానవోచితమూ అయినదిగా పరిగణించలేము.

ఆనందం పొందడానికి ముందుకుపోకూడదని మేము చెప్పడం లేదు. మనం ఆ పని చేస్తూనే ఉన్నాం. మన జీవితంలోని ప్రతిక్షణం ఆనందాన్ని వెదకడంలోనే గడిచిపోతోంది. అయితే, మన ఆనందం ఎలా శాశ్వతం, నిరంతరం, సంపూర్ణం అవుతుందన్నది ప్రశ్న. ఇందుకోసం పెద్ద మార్పు చేయవలసిన అవసరం లేదు. ఇల్లూ వాకిలీ వదిలివెళ్ళవలసిన అవసరం లేదు. విచిత్రమైన వేషభూషలు ధరించవలసిన పని లేదు. సరైన దృక్పథంతో ఈ జీవితాన్ని విలువ కట్టడం మాత్రమే అవసరం. మన శారీరక అవసరాలను తీర్చవలసిందే. అయితే శరీరంలో ఉన్న ఆత్మను విస్మరించకూడదు. మన అజ్ఞానాన్నీ, ఆసక్తినీ కొరతలనూ తొలగించే శక్తి ఆత్మకు ఉంది. ఈ ఇబ్బందులు మూడూ ఆటంకాలు కల్పించకపోతే, మనం వెదుకుతున్న ఆనందం ఈ జీవన విధానంలోనే లభిస్తుంది. ఇందుకోసం మనం మరేదీ చేయనక్కరలేదు. కేవలం మనం దృక్పథాన్ని మార్చుకోవాలి. మనం ఇలా దృక్పథాన్ని మార్చుకోగలిగితే, ఈ జీవితంలోనే శాశ్వత ఆనందం లభిస్తుంది.

L L L

**సత్యం న సాధువృత్తస్య దృశ్యతే పునరుక్తతా - మహాత్ముల చరిత్రకు పునరుక్తి దోషం లేదు.**

## నావారితో నా మాట

# నవ సృజనకు మహాకాలుడు సిద్ధం : మనం సిద్ధమేనా?

పరమపూజ్య గురుదేవులు క్రాంతి ధర్మ సాహిత్యంలోని ఒక మహత్తర గ్రంథం "నవ సృజనకే నిమిత్త మహాకాల్ కీ తయారీ" (నవ సృజనకై మహాకాలుని సంసిద్ధత)లో ఇలా వ్రాశారు - "విత్తనాలు చల్లే సమయం తక్కువగానే ఉంటుంది. వృక్షం ఎంతో కాలం స్థిరంగా జీవించి ఉంటుంది. 1990 నుండి 2000 వరకు పది సంవత్సరాలు దున్నడం, విత్తడం, నీరు పెట్టడం, ఎరువులు వేయడం, సస్య రక్షణ మున్నగు పనులు చేసే సమయం. 21వ శతాబ్దం నుండి వాతావరణం మారిపోతుంది. పరిస్థితులలో భారీయెత్తున మార్పులు జరుగుతాయి. ఇవన్నీ విస్తరించడానికి ఒక శతాబ్దం పడుతుంది. అనగా - 2000 నుండి 2099 వరకు పడుతుంది. ఈలోగా జరిగే పెను మార్పులు సామాన్య ప్రజలను ఆశ్చర్యచకితులను చేస్తాయి. 1900లో ఏ పరిస్థితులు ఉండేవో, అవి ఎంత వేగంగా మారిపోయాయో సూక్ష్మదర్శులందరికీ తెలుసు. ఇకముందు ఎన్నెన్నో ఆశ్చర్యకర పరివర్తనలు జరుగుతాయి. యుగం మారుతుంది. మనిషి శరీరం పూర్వంవలె ఉన్నప్పటికీ అతడి మనసు, ఆలోచన, దృక్పథం పూర్తిగా మారిపోతాయి. కృతయుగం తిరిగివచ్చిందనడం అతిశయోక్తి కాదని చెప్పేటంతగా యుగం మారుతుంది." (25,26 పుటలు).

### తుపానులా వస్తున్న ప్రవాహం

ఇదీ యుగ పరివర్తనకు నేపథ్యం. అసురత్వపు విలయతాండవంతో నిండిన నేటి దృశ్యాలను చూచినప్పుడు - ఈ పరిస్థితులలో యుగం ఎలా మారుతుందని ఎవరికయినా అనిపించవచ్చు. భారత్ ఏవిధంగా, ఎప్పటికి సమర్థవంతమైన జాతిగా, విశ్వానికి మకుటమణి అయిన జాతిగా నిలుస్తుంది? అని అనిపించవచ్చు. ఇలాంటి ప్రశ్నలు రావడం సహజమే. ఈ విషయమై పూజ్యవరులు ఇలా వ్రాశారు - "ప్రాచీనకాలంలో కాలం నెమ్మదిగా గడిచేది. పరివర్తన క్రమంగా జరిగేది. కాని ఇప్పుడు ప్రవాహం తుపాను వేగంతో వచ్చింది. రెండువేల సంవత్సరాలలో జరిగే పని వంద సంవత్సరాలలో పూర్తికాబోతోంది. కొత్త శతాబ్దం కొత్త పరివర్తన తీసుకునివస్తోంది." (పై గ్రంథం 26వ పుట).

రెండువేల సంవత్సరాల దాస్యంలో పోగయిన చెత్త వెనువెంటనే తొలగిపోవడం సాధ్యమయ్యే పని కాదని పూజ్యవరులు పలుమారులు చెప్పి ఉన్నారు. అయితే ఈ పని 2000 సంవత్సరంలో ప్రారంభం అవుతుందనీ, పది సంవత్సరాల లోపలే సామాన్య ప్రజలు యుగ పరివర్తన చిహ్నాలను చూస్తారనీ ఆయన వివరించారు. మనం 21వ శతాబ్దం నాల్గవ సంవత్సరంలో అడుగుపెడుతున్నాం. గత మూడు సంవత్సరాల పరిణామాలను సమీక్షించినప్పుడు - కొన్ని వాస్తవాలు స్పష్టమవుతాయి. విధ్వంసకన్న సృజన మరింత వేగంగా జరిగింది. దేవమానవుల సృష్టి పెరిగింది. జనమానసం అతి కొద్ది సమయంలోనే ఆధ్యాత్మిక వ్యవస్థవైపు మళ్లింది. ఎన్నెన్నో నిర్మాణాత్మక కార్యక్రమాలు ఒకే సమయంలో పెక్కు స్థలాలలో నిర్వహించబడ్డాయి. మనం ఎన్నో ఆశలతో 2004 సంవత్సరం అరుణోదయాన్ని స్వాగతిస్తున్నాం. ఈ సంవత్సరం మరిన్ని శుభ పరిణామాలను తెస్తుందని ఆశిద్దాం.

### మహాప్రజ్ఞ అవతరణ తథ్యం

పరమపూజ్య గురుదేవులు ఆ గ్రంథంలో ఇంకా ఇలా వ్రాశారు - "కాలం మారుతోంది. రాత్రి గతిస్తోంది. ప్రభాతం ఉదయిస్తోంది. ప్రజలు తమను తాము మార్చుకోవడం అందుకు కారణం. ప్రజలు పతనమయ్యే, పతనం చెందించే ధోరణికి బదులు పైకి లేచే, పైకి లేపే ధోరణిని అవలంబిస్తారు. ఇదే కృతయుగం. ఇదే నవయుగం. ఇది దగ్గరపడుతోంది. మరింతగా దగ్గరపడుతోంది." (32వ పుట). ఎంత స్పష్టమైన ప్రకటన ఇది. మరోప్రక్క మనం నిరాశావాదులమై, పలాయనవాదులమై, మిథ్యా బ్రహ్మజ్ఞానులమై పరిష్కారాలను ఎక్కడెక్కడో వెదుకుతున్నాం. సమస్యలు పరిష్కారం అవుతాయి. జనమానస సంస్కరణ ద్వారా, మానవునిలో మహాప్రజ్ఞ అవతరించడం ద్వారా, లక్షల, కోట్ల దేవమానవులను పుణ్య కార్యాలలో, పరమార్థ కార్యాలలో, ధర్మ ప్రసారంలో నియోగించడంద్వారా. యుగ చేతన విస్తరణ, విరాట్ యజ్ఞాల పరంపర, మహాసమ్మేళనాల నిర్వహణ, బౌద్ధిక సభలు, ప్రపంచ స్థాయిలో విస్తృతమైన జనసంపర్కం, భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష దిగ్ దిగంతాలకు, దాదాపు అన్ని భాషలకూ విస్తరించడం, దేవసంస్కృతి విశ్వవిద్యాలయం శరవేగంతో విస్తరించడం మున్నగు మన కార్యకలాపాలు ఇందుకు ఉదాహరణలు. యుగ నాయకులతో, మహామానవులతో కూడిన ఒక కొత్త యువతరం తయారవుతోంది. ఆ యువతరం వచ్చే రెండు దశకాలలో తన కార్యకలాపాలతో అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తుంది.

కనుకనే పరమపూజ్య గురుదేవులు ఆ గ్రంథంలో ఇలా వ్రాశారు - "నవయుగ అవతరణ దగ్గరపడింది. స్రష్ట దానిని ఎవరిద్వారా జరిపించదలచాడో తెలుసుకోవాలని ఉందా? అయితే, ఆయన పనిలో నిమగ్నమైనవారికే ఆ పని సాధించిన గౌరవం లభిస్తుంది." (32వ పుట).

మనమంతా మన మన పాత్రలను నిర్ణయించుకోవాలి. రానున్న రోజులలో యుగ నిర్మాణంలో, జనమానస సంస్కరణలో మన పాత్ర

**అవసరాలు తగ్గించుకో; సహజంగా జీవించు.**

ఏమిటో మనమే నిర్ణయించుకోవాలి. దేవమానవులు తమ సంపాదనలో అత్యల్పభాగం తమకోసం ఖర్చుచేసుకుంటారు. మిగతాభాగాన్ని పరమార్థ కార్యక్రమాలకు వినియోగిస్తారు. రానున్న రోజులలో మనం ఇలాంటి దేవమానవులను అధికాధికంగా నిర్మాణం చేయాలి. వారికి శిక్షణ ఇవ్వాలి. వారికి ఆయా కార్యాలను అప్పగించాలి. మన కార్యరంగం మొత్తం ప్రపంచం. ప్రతిభావంతులైన దేవదూతలు మానవ శరీరాలతో అవతరించబోతున్నారు. వారు తమ సమయంలో అత్యధిక భాగాన్ని ప్రభువు పని కోసం వినియోగిస్తారు. వారిని గుర్తించడానికి లక్షణం ఇదే.

## ఒక మహత్తర సంవత్సరంలో ప్రవేశం

ఈ సంవత్సరం "బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్" రజత జయంతి సంవత్సరం. విజ్ఞానాన్నీ, అధ్యాత్మనూ సమన్వయపరచి ప్రతిపాదించడానికి స్థాపించబడిన సంస్థ అది. 1979లో దీని స్థాపన జరిగింది. గత 25 సంవత్సరాలలో ఈ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నెన్నో పనులు జరిగాయి. పరిశోధనలో కొత్త కొత్త రంగాలు నిర్మాణం అయినాయి. వైజ్ఞానిక అధ్యాత్మవాదం గురించి నేడు అందరూ చర్చించడం ప్రారంభించారు. ఇప్పుడు దేవసంస్కృతి విశ్వవిద్యాలయ స్థాపనతో - రెండు సంస్థల సమన్విత కృషి ఫలితంగా రికార్డులు సృష్టించే మరిన్ని కార్యాలు ప్రారంభం అవుతున్నాయి. వినియోగవాదం, బహిరంగ మార్కెట్‌లను గురించి మాట్లాడే ప్రపంచీకరణ సమర్థక శక్తులు ఎంతటి నష్టాన్ని కలిగించాయో అందరికీ తెలుసు. ఇందుకు పరిష్కారం ఒక్కటే - విజ్ఞాన సమ్మతమైన అధ్యాత్మను జీవితంలో ప్రవేశపెట్టడం. మన అంతరాంతరాలలో నిద్రిస్తూన్న వర్చస్సును యోగ సాధనద్వారా మేలుకొలపడం. ప్రతిభను సమాజ అభ్యున్నతికి నియోగించడం. యువశక్తిద్వారా నిర్మాణాత్మక మహోద్యమాలను వేగవంతం చేయడం. ఈ సంవత్సరంలో ఈ పనులన్నింటికీ ప్రాధాన్యం ఇస్తాం. ఈ మహోద్యమాన్ని దేశవ్యాప్తం చేస్తాం. యుగనిర్మాణ సత్సంకల్పాల 18 సూత్రాలు కృతయుగ సమాజానికి ఆధారాలు అవుతాయి. విభూతి కలిగిన వ్యక్తులు, ప్రతిభామూర్తులు స్వయంగా వీటిని ప్రజల మధ్యకు తీసుకువెళతారు. వీరి ద్వారా ఆలోచనలలో మార్పు వస్తుంది. వీరు సజీవ ప్రాణశక్తులు.

## ప్రాంతీయ శాఖల సువ్యవస్థ

సంఘటన - సశక్తీకరణ ప్రక్రియ దేశమంతటిలో వేగం పుంజుకున్నది. ఏడు జోనల్ కేంద్రాలు, 14 సబ్‌జోనల్ కేంద్రాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయి. శాంతికుంజ్ నుండి వెళ్లే కేంద్ర ప్రతినిధులు ఈ కార్యాలయాల కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. గాయత్రీ పరివార్ సంస్థకు ఒక సువ్యవస్థిత రూపం ఏర్పడుతోంది. స్థానిక కార్యకర్తలు ప్రతి పనికీ కేంద్రంవైపు చూడవలసిన అవసరం ఇక ఉండదు. జోనల్ కేంద్రాలు ఆ పని చేస్తున్నాయి. ఇకముందు ఇవి మరింత సమర్థవంతంగా పనిచేస్తాయి. ఇప్పుడు ప్రతి యూనిట్ తన కార్యక్షేత్రాన్ని చూచుకుంటోంది. సప్త ఉద్యమాలు వేగం పుంజుకుంటున్నాయి. మన పత్రికల పాఠకుల సంఖ్య పెరగాలి. పరమపూజ్య గురుదేవుల సాహిత్యం సంజీవనివంటిది. సాహిత్య విస్తరణ కేంద్రాలద్వారా, శక్తిపీఠాలద్వారా, జ్ఞాన కేంద్రాలద్వారా, జోనల్ కార్యాలయాలద్వారా ఈ సాహిత్యాన్ని ఇంటింటికీ అందించాలి. ఈ జనజాగరణ జ్ఞానయజ్ఞంద్వారా సమాజమనే పాలసముద్రంనుండి ప్రతిభ అనే నవనీతం వెలికివస్తుంది. ఈ ప్రతిభ నవసృజనలో నిమగ్నం అవుతుంది.

అఖిల విశ్వ గాయత్రీ పరివార్ కార్యరంగం అత్యంత విస్తృతం అయినది. ప్రతి వ్యక్తికీ పనిచేయడానికి ఇందులో అనంతమైన అవకాశాలు ఉన్నాయి. స్వల్ప సాధనాలు కలిగిఉన్నా ప్రబలమైన భావనలు ఉన్న వ్యక్తులనుండి సాధన సంపన్నులవరకు - ప్రతి వ్యక్తికీ సమయదానం, అంశదానం ఇవ్వడానికి విశాలమైన కార్యరంగం ఉన్నది. విద్య నుండి వ్యవసాయం వరకు, గ్రామీణ స్వావలంబన నుండి ఆరోగ్య అభివృద్ధి వరకు, దేవాలయ వ్యవస్థ నుండి పర్యావరణ పరిరక్షణవరకు, మత్తు నివారణనుండి దురాచారాల నిర్మూలనవరకు ఎన్నో రకాల పనులు మనముందు ఉన్నాయి. మన క్షేత్రంలోని సంఘటన సమూహాలు, సమన్వయ సమితులు, ప్రజ్ఞామండలులు, ట్రస్టులతో కలసి ఉన్న సమితులు - అన్నీ ఈ పనులలో భాగస్వాములు కావలసిందిగా ప్రతిభామూర్తులను హృదయపూర్వకంగా ఆహ్వానించాలి. సదుద్దేశంతో కూడిన సునిశ్చితమైన కార్య ప్రణాళిక ముందుండడంతో - ఎందరెందరో వ్యక్తులు వాటిలో పాల్గొనడానికి ముందుకు వస్తారు. వివిధ ఉద్యమాలను చేపట్టుతారు. మన కుటుంబాలలో, యుగశక్తి గాయత్రి పత్రిక పాఠకులలో కూడా ఇలా ముందుకువచ్చే వ్యక్తులు ఉంటారు. శిక్షణ పొంది ఈ నవనిర్మాణ మహాయజ్ఞంలో పాల్గొనవలసిందిగా అలాంటి వ్యక్తులందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం.

## మనం సిద్ధమేనా?

మహాకాలుని తయారీలో మన స్వంత తయారీ ఎంత ఉన్నదో పరీక్షించుకునే తరుణం వచ్చింది. ఇది శాంతంగా కూర్చొని భజన చేసే సమయం కాదు. సమాజ దేవత ఆరాధనకు మనల్ని మనం అర్పించుకోవలసిన తరుణం వచ్చింది. భవిష్యత్తు ఉజ్వలమైనదన్నది తథ్యం. మనం ముందుకు వచ్చి మన పాత్ర నిర్వహిద్దాం. ఆ గౌరవాన్ని పొందుదాం. సమయం మించిపోతే మిగిలేది పశ్చాత్తాపమే.

K K K

**ధర్మో రక్షతి రక్షితః - ధర్మాన్ని రక్షించే వారిని ధర్మమే కాపాడుతుంది.**

# శాంతికుంజ్ సమాచారం

### నేపాల్‌లో దేవసంస్కృతి విశ్వవిద్యాలయ కేంద్రం

నేపాల్‌లో దేవసంస్కృతి విశ్వవిద్యాలయ కేంద్రాన్ని స్థాపించడంలో పూర్తి సహకారం అందిస్తానని నేపాల్ మాజీ ప్రధానమంత్రి మాననీయ శ్రీలోకేంద్రబహాదుర్ చంద్‌జీ హామీ ఇచ్చారు. తమ ధర్మపత్నితో సహా ఎనిమిదిమంది బృందంతో ఆయన నవంబరు మొదటివారంలో నాలుగు రోజులు శాంతికుంజ్‌లో గడిపారు. శాంతికుంజ్ వాతావరణం దివ్యమైనదనీ, అది తనను సదా ఆకర్షిస్తోందనీ ఆయన ఆ సందర్భంగా అన్నారు. ఖాట్మండులో శాంతికుంజ్ కేంద్రం ఏర్పాటయి తద్వారా నేపాల్‌లోని గ్రామ గ్రామంలో నిజమైన హిందూత్వ సందేశం అందడానికి తాను కృషి చేస్తానని ఆయన అన్నారు.

డా॥ ప్రణవ్ పండ్యాజీ, శ్రద్ధేయ శైల దీదీలతో ఆయన ఈ విషయాలపై చర్చలు జరిపారు. దేవసంస్కృతి విశ్వవిద్యాలయం కార్యకలాపాలను గురించి డా॥ ప్రణవ్ పండ్యాజీ ఆయనకు వివరించారు. ఆసందర్భంగా శ్రద్ధేయ శైలదీదీ బృందం సభ్యులందరికీ మంగళ తిలకం దిద్ది, గురుసత్తా ప్రతినిధిగా ఆశీస్సులు అందించారు. గురుదేవుల సాహిత్యాన్ని బహూకరించారు. ఆ సాహిత్యాన్ని నేపాలీ భాషలో ప్రచురించడానికి పూర్తి సహకారం అందిస్తానని నేపాల్ మాజీ ప్రధానమంత్రి చెప్పారు. ఆయుర్వేద పునరుద్ధరణపై ఏర్పాటుచేసిన ప్రదర్శనాన్ని ఆయన దర్శించారు.

### శిక్షణకూ, విద్యకూ సమన్వయం

భారతీయ సంస్కృతియే నేటి సమస్యలకు పరిష్కారం చూపుతుంది. దానికి విరుద్ధంగా నడిస్తే బ్రహ్మరాక్షసులే తయారవుతారు. కొన్ని విదేశీ విద్యాలయాలు చరిత్రను తారుమారు చేసి బోధిస్తున్నాయి. ఋషులు, మునుల విషయంలో ఈ విద్యాలయాలవారు ప్రమాదకరమైన విమర్శలు చేస్తున్నారు.

శిక్షణకూ, విద్యకూ మౌలికమైన అంతరం ఉంది. శిక్షణ పరిస్థితులకు సంబంధించినది. విద్య మనఃస్థితికి సంబంధించినది. విద్యాభారతి సంస్థ ఈ రెంటికీ అందమైన సమన్వయాన్ని సాధించింది. పిల్లలలో సంస్కార బీజాలను నాటితే మనదేశం 21 శతాబ్దపు మహానాయకురాలు కావడం తథ్యం. భారతదేశపు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, నైతిక అభ్యుదయం ఉత్తరాంచల్ నుండే జరుగుతుందని నేను ఆశిస్తున్నాను.

అని డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ఇటీవల విద్యాభారతి స్వర్ణజయంతి సంవత్సరం సందర్భంగా హరిద్వార్‌లోని పంత్ ద్వీపంలో ఏర్పాటయిన బాల కుంభమేళాను ధ్వజారోహణతో ప్రారంభిస్తూ అన్నారు. ఉత్తరాంచల్‌లోని వివిధ శిశు మందిరాలనుండి వచ్చిన ఆరువేలమంది పిల్లలు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వార్తలు

### విజయవాడలో నవరాత్రి ఉత్సవం

విజయవాడ కార్యాలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా సెప్టెంబరు 27 నుండి అక్టోబరు 5 వరకు త్రికుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. 5న పూర్ణాహుతిలో 100 మంది పాల్గొన్నారు.

కార్యాలయంలో కార్తీకమాసం సందర్భంగా నవంబరు 11న 5 కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 200 మంది పాల్గొన్నారు. కార్యాలయంలో కార్తీక వనభోజనాలు కూడా జరిగాయి.

నవంబరు 2న విజయవాడ పాతబస్తీలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో త్రికుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. శ్రీమతి ఎస్. లక్ష్మీదేవి యజ్ఞం నిర్వహించారు. శ్రీయుతులు ఎస్.సాంబశివ రావు, కె.వెంకటరత్నం, శ్రీమతులు సరస్వతి, దుర్గ సహకరించారు.

కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లో శ్రీమతి ఝాన్సీ గృహంలో అక్టోబరు 9న గాయత్రీ యజ్ఞం, దీపయజ్ఞం జరిగాయి. శ్రీమతి సులోచన ఆధ్వర్యం వహించారు. 150 మంది పాల్గొన్నారు. శ్రీయుతులు ప్రమోద్‌కుమార్ కాళింది, వెంకటేశ్వర్లు యజ్ఞం నిర్వహించారు.

నవంబరు 2న కృష్ణాజిల్లా గన్నవరంలోని శ్రీవెంకటేశ్వర ఆలయంలో గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 80 మంది పాల్గొన్నారు. శ్రీయుతులు ప్రమోద్‌కుమార్ కాళింది, వెంకటేశ్వర్లు యజ్ఞం నిర్వహించారు. శ్రీనిరంజనరావు యుగ సాహిత్యాన్ని ప్రదర్శించారు. శ్రీయుతులు ఎమ్.బి.పద్మనాభుడు, కృష్ణారావు, శ్రీమతి ప్రభావతి సహకరించారు.

నవంబరు 10న కృష్ణాజిల్లా పెనమలూరులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 300 మంది పాల్గొన్నారు. శ్రీయుతులు ప్రమోద్‌కుమార్ కాళింది, వెంకటేశ్వర్లు యజ్ఞం నిర్వహించారు. శ్రీయుతులు నిరంజన రావు, బి.ఎస్.పి.లింగం, కె.వెంకటేశ్వర రావు, కె.ఆంజనేయులు, శ్రీమతి ఝాన్సీలక్ష్మి సహకరించారు. నాటి సాయంత్రం దీపయజ్ఞం జరిగింది.

### మంగళగిరిలో విరాట్ దీపయజ్ఞం

నవంబరు 17 సాయంత్రం మంగళగిరిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీ ఎన్.ఎల్.ఎన్.మూర్తి, వారి ధర్మపత్ని శ్రీమతి గౌరీ సావిత్రిల ఆధ్వర్యంలో 2400 దీపాలతో విరాట్ దీపయజ్ఞం జరిగింది. 1200 మంది పాల్గొన్నారు. శ్రీమూర్తి, శ్రీమతి గౌరీ సావిత్రి ప్రవచనాలు ఇచ్చారు.

**ఆత్మబలాన్ని మించిన బలం లేదు**

## భీమునిపట్నంలో శరన్నవరాత్రి అనుష్ఠానం

భీమిలిలోని శ్రీదుర్గా గాయత్రి శక్తి పీఠంలో సెప్టెంబరు 27 నుండి అక్టోబరు 5వరకు శరన్నవరాత్రి అనుష్ఠానం జరిగింది. 27న శ్రీమతి భారతి కలశ స్థాపన జరిపారు. అక్టోబరు 5న పూర్ణాహుతి జరిగింది. ఈ తొమ్మిది రోజులలో ప్రతిరోజూ కుంకుమపూజ, దేవతల సహస్రనామావళి పూజ, గాయత్రీ యజ్ఞం, సామూహిక గాయత్రీ మంత్ర పఠనం జరిగాయి. 3న 24గురు కన్యలకు సుహాసినీ పూజ జరిగింది. తగరపువలస, విశాఖపట్నం, విజయనగరం, మేరంగి మున్నగు స్థలాల నుండి వచ్చిన పరిజనులు కూడ ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. శ్రీమతి భారతి, శ్రీరామకృష్ణ దంపతులు, శ్రీ శ్రీపాద సుబ్బారావు దంపతులతో సహా 30 మంది అనుష్ఠానంలో పాల్గొన్నారు. శ్రీయుతులు బి.గణపతి శాస్త్రి, శ్రీ పి.వి.పండా దంపతులు, శ్రీమతి పుష్ప కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీయుతులు గణేశ్, రామకృష్ణ సహకరించారు.

అక్టోబరు 11న నాగచంద్ర భారతి గాయత్రి విద్యారంభ సంస్కారం పీఠంలో జరిగింది. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సభ్యులు శ్రీహెచ్.జె.దొర సతీసమేతంగా కర్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీమతి భారతి, శ్రీగణపతి, శ్రీపండా దంపతులు సహకరించారు.

## పార్వతీపురంలో ఉచిత నేత్రచికిత్స శిబిరం

అక్టోబరు 27న పార్వతీపురంలో గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో విశాఖ రోటరీ నేత్ర సంస్థ ఉచిత నేత్ర చికిత్స శిబిరం నిర్వహించింది. డి.ఎస్.పి శ్రీ ఎస్.వి.రాజశేఖర బాబు శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 148 మందికి నేత్ర పరీక్ష జరిపారు వారిలో 65 మందికి విశాఖ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స జరిపించారు.

పార్వతీపురంలోని గాయత్రీ ధ్యాన మందిరంలో సంవత్సరంలో 24 లక్షల గాయత్రీమంత్ర జపములు జరిగాయి. దసరా నవరాత్రుల అనుష్ఠానంలో 4,24,300 గాయత్రీమంత్ర జపములు జరిగాయి.

## సి.రామాపురంలో పంచకుండీ యజ్ఞం

చిత్తూరుజిల్లా ఆర్.సి.పురం మండలంలోని సి.రామాపురంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబరు 8న ఉదయం పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం, సాయంత్రం దీపయజ్ఞం జరిగాయి. ఎమ్.ఆర్.పల్లి గాయత్రీ ప్రజ్ఞా మండలి అధ్యక్షురాలు శ్రీమతి ఎన్.మునిలక్ష్మమ్మ ఆధ్వర్యం వహించారు. శ్రీమతి మునేంద్రమ్మ సహకరించారు.

గురుజయంతి సందర్భంగా వశిష్ఠాశ్రమ పీఠాధిపతి శ్రీస్వస్వరూపానందజీకి పాదపూజ, సన్మానం జరిగాయి. మాతాజీ జయంతి సందర్భంగా బాల కార్మికులకు బిస్కెట్ల పంపిణీ జరిగింది. మునిసిపల్ మేనేజరు శ్రీ అమ్మయ్య, శ్రీ ఎమ్.భాస్కరరెడ్డి ఆధ్వర్యం వహించారు.

## శ్రీకాకుళం జిల్లాలో గాయత్రీ మహాయజ్ఞాలు

నవంబరు 3న పెద్ద బాణాపురంలో శ్రీవివేకానంద యువజన సంఘం పర్యవేక్షణలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. శ్రీ జి.సూర్యనారాయణ మూర్తి యజ్ఞం నిర్వహించారు. గ్రామ ప్రజలంతా యజ్ఞంలో పాల్గొన్నారు. నాటి రాత్రి 1008 దీపాలతో దీపయజ్ఞం జరిగింది.

నవంబరు 4న బెండి గ్రామంలో శ్రీసనపల ఉమామహేశ్వర రావు గారి 9 రోజుల గాయత్రీ మహామంత్ర అనుష్ఠానం అనంతరం వారి గృహ ప్రాంగణంలో త్రికుండీ గాయత్రీ మహాయజ్ఞాన్ని శ్రీసూర్యనారాయణ నిర్వహించారు. వందమంది పాల్గొన్నారు.

నవంబరు 11న శ్రీకాకుళం జిల్లా కంట్రగడ గ్రామంలో శ్రీమండియం బాబూరావు ధాన్యపు మిల్లు ప్రాంగణంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది.

శ్రీకాకుళం కార్యకర్త శ్రీ ఎన్.కృష్ణమూర్తి పై కార్యక్రమాలన్నింటినీ పర్యవేక్షించారు.

## ఒరిస్సా గ్రామాలలో గాయత్రీ మహాయజ్ఞాలు

నవంబరు 7న శ్రీకాకుళం జిల్లా సరిహద్దుల్లో ఉన్న ఒరిస్సా గ్రామం పెద్ద కొత్తూరులోని శ్రీసత్యసాయి మందిర ప్రాంగణంలో త్రికుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది.

నవంబరు 8న ఒరిస్సాలోని చత్రపురం గ్రామంలోని శ్రీరామమందిర ప్రాంగణంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. 50మంది పాల్గొన్నారు.

నవంబరు 12న పద్మపురం గ్రామంలోని శ్రీ గేదల అప్పలనాయుడు గృహంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. 30 మంది పాల్గొన్నారు.

నవంబరు 13న చంద్రపురం గ్రామంలో శ్రీనాగలపల్లి కూర్మారావు గృహంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. 40 మంది పాల్గొన్నారు.

నవంబరు 14న బౌజ గ్రామంలో శ్రీసోభనాపురము దామోదరరావు గృహంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. 30మంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం కార్యకర్త శ్రీ ఎన్.కృష్ణమూర్తి పై యజ్ఞాలన్నింటినీ పర్యవేక్షించారు.

## జగిత్యాల పరిజనుల శాంతికుంజ్ యాత్ర

జగిత్యాల గాయత్రీ పరివార్ పరిజనులు శ్రీయుతులు ఆదెపు గంగారాం, గడ్డం బుచ్చిరెడ్డి, పడకంటి లక్ష్మీనారాయణ, గట్ల లక్ష్మణ్ ఇటీవల శాంతికుంజ్ వెళ్ళి, 9 రోజుల శరన్నవరాత్రి అనుష్ఠానంలో పాల్గొన్నారు. వీరు మథురలోని గాయత్రీ తపోభూమిలో కూడ మూడు రోజులు ఉన్నారు.

## కాగజ్‌నగర్‌లో గాయత్రీ యజ్ఞం

అక్టోబరు 29న కాగజ్‌నగర్‌లోని బాలాజీనగర శిశువాటికలో పెద్దింటి సాయి ప్రణయ్ జన్మదినం సందర్భంగా గాయత్రీ యజ్ఞం జరిగింది.

నవంబరు 7న కాగజ్‌నగర్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో చిన్నారుల జన్మదినోత్సవం సందర్భంగా గాయత్రీ యజ్ఞం జరిగింది.

శ్రీకట్టా బాబూరావు పై రెండు యజ్ఞాలనూ నిర్వహించారు.

H H H

**దృఢ ప్రతిజ్ఞ కలిగిన వ్యక్తి ప్రపంచాన్ని మార్చుతాడు.**